ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా

సంపాదక మండలి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్

సంపుటి 19 - సంచిక 04
సెప్టెంబర్ 2014

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**

## శ్వాస

శ్వాస అనే దారముతో జీవితమనే పూమాల గుదిగ్రుచ్చబడినది. శ్వాస యొక్క ప్రతి లయ మరియు తరంగము జీవితమునకు చిరునవ్వును ప్రసాదిస్తుంది. శ్వాస యొక్క లయ మారగానే జీవితపు రూపురేఖలు, రంగులు అనాయాసముగానే మారుతుంటాయి. శ్వాస మారినప్పుడు క్రమక్రమముగా క్రోధము, కరుణ, వైరము, రాగద్వేషములు, ఈర్ష్య, అనురాగము వంటి స్థితులు మనస్సులోకి వచ్చిపోతూ ఉంటాయి. ఇది చెప్పగలిగేది-వినగలిగేది కాక, అనుభవైకవేద్యమైన విషయము. ఒక నెలపాటు అన్ని భావదశలను మరియు స్థితులను గమనిస్తూ ఒక చిట్టా తయారుచేసి పరిశీలించినచో 'శ్వాస యొక్క ఏ లయ మనకు శాంతిని, విశ్రాంతిని చేకూరుస్తుంది? ఏ లయలో మౌనం, శాంతం, సువ్యవస్థితముగా జీవించగలిగే అనుభూతి కలుగుతుంది? ఏ లయబద్ధత చేత జీవితములో ఆనందము క్షీణిస్తోంది' అన్న విషయములు బోధపడతాయి. ధ్యానము, సమాధి స్థితులు కూడా శ్వాస యొక్క లయలో మార్పులే! శ్వాస యొక్క లయ మారుట చేతనే ధ్యానము, సమాధిస్థితి అనుభూతిలోకి వస్తాయి.

శ్వాస యొక్క గతిని పూర్తిగా శూన్యస్థితికి చేర్చి లేక నిలిపివేసిన స్థితిలో కూడా జాగరూకత (మెలకువ)తో ఉండేవిధంగా మార్పు చేయగలిగే కళే ప్రాణాయామము. ఇది మనిషి ఇప్పటివరకు చేసిన అన్వేషణలన్నింటిలోను అగ్రభాగాన నిలిచేటంత అత్యుత్తమమైనది. ఒక్కమాటలో చెప్పాలంటే మానవుడు చంద్రుడు మరియు కుజగ్రహాల మీద కాలుమోపటం కంటే కూడా ఈ అన్వేషణా ఫలితమే మహోన్నతమైనది. శ్వాస యొక్క లయబద్ధతలో పరివర్తన తొంగి చూసినప్పుడు మనిషి జీవితమే మారిపోతుంది. అందుచేత ఆంతరికమైన మెలకువతో (ఎఱుకతో) శ్వాసకు చెందిన లయ పరివర్తన చెందాలి. అయితే విధివిధానాల ద్వారా నిర్దేశించ బడిన ప్రాణాయామములు చెయ్యడము చేత ఇది సాధ్యపడదు. ఒకవేళ విధివిధానమునే కనుగొనాలంటే ప్రతిశ్వాసను ఎఱుకతో (Conscious) జీవించాలి. అంతేకాక ఉచ్ఛ్వాస-నిశ్వాసములతోపాటు భగవన్నామమును జపించుట అభ్యసించవలసి ఉంటుంది. అలా చేసినప్పుడు శ్వాస యొక్క లయబద్ధత చేత జీవనగతి మారుతుంది.

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 2010*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**విజయం అనేది ఆకాశం నుండి ఊడిపడదు**

## విషయ సూచిక


1. **సంపాదకీయం :** శ్వాస — 3
2. **విషయసూచిక-సద్గురువాణి :** నిజమైన శూరవీరుడు — 4
3. **వేదమంత్రం :** సఫలతకు రాజమార్గం — 5
4. **గాయత్రీ విద్య - 47 :** గాయత్రీ సహస్రనామములు — 7
5. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 27 :** దీక్షాభూమికి యాత్ర - 4 — 12
6. **యుగనిర్మాణ యోజన :** మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 19 — 17
7. **టీచర్స్ డే ప్రత్యేకం :** ఆధునిక ఋషి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ — 22
8. **దేవి నవరాత్రుల ప్రత్యేకం :** ఆత్మబల అభివృద్ధికి అద్భుత అవకాశం — 26
9. **భావసంవేదనల గంగోత్రి - 3 :** మీరాబాయి — 27
10. **మెస్మరిజం-12 :** సమ్మోహన విద్య యొక్క చమత్కారాలు — 28
11. **వామన జయంతి ప్రత్యేకం :** భగవంతుడే యాచకుడిగా మారినవేళ — 32
12. **బోధకథ :** పాఠం నేర్పని రావణుడు — 35
13. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** జ్ఞానయోగము యొక్క తత్త్వదర్శనము - 3 — 39
14. **నా వారితో నా మాట :** మనలో ఎంత పరిపక్వత వచ్చింది? — 43
15. **స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 5** — 46
16. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు — 50



**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి !**

**చదివించండి !!**


## సద్గురు వాణి

### నిజమైన శూరవీరుడు



ఎవరైతే తన కూడని చెడు అలవాట్లను వదలివేయగలుగుతాడో అతనే నిజమైన పరాక్రమవంతుడు. బాహ్య ప్రపంచంలో మనం ఎదుర్కొనే బాధలను, కష్టాలను దూరం చేయడానికి ఇతరులు సహాయం చేయగలరు. కానీ తన లోపల ఉన్న దోష దుర్గుణాలను వదిలించుకోవడానికి వ్యక్తి తన ప్రయత్నాల మీదే పూర్తిగా ఆధారపడవలసి వస్తుంది. అటువంటి వాడినే ప్రబల పరాక్రమవంతుడిగా చెప్పాలి, నిజమైన అర్థంలో అతనే శూరవీరుడు.


**యుగశక్తి గాయత్రి**

**చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా పంపించండి.**

బ్యాంకు పేరు: ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ

ఖాతాపేరు : **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**

ఖాతానెం. : **32506416087**

IFSC Code : **SBIN-0013272**

అట్లే మని ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కాని చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 50/- చందాకు అదనంగా పంప ప్రార్థన. అట్లు పంపించని వారి చందాకాలము దామాషా పద్ధతిలో తగ్గించబడును. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలాన జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుతూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము**, హెచ్.పి. రోడ్, మూసాపేట

అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.

ఫోన్: 040-23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| విడి ప్రతి రూ॥ **15/-** | **3** సం॥ చందా రూ॥ **420/-** |
| సం॥ చందా రూ॥ **150/-** | **10** సం॥ చందా రూ॥ **1300/-** |

పెరిగిన ధరలు 30.08.2014 నుండి అమలులోకి వస్తాయి


**విజయానికి అడ్డదారులు ఉండవు**

వేద మంత్రం

# సఫలతకు రాజమార్గం

**మమాగ్నే వర్చో విహవేష్వస్తు వయంత్వేన్ధానాస్తన్వంపుషేమ।**
**మహ్యంసమన్తాం ప్రదిశశ్చతస్త్ర స్త్వయాధ్య క్షేణపృతనాజయేమ॥**

**– (అధర్వవేదం 5/3/1)**

**భావార్థం:** మానవులు సంఘర్షణతో చలించిపోరాదు. పరమాత్మను ఉపాసిస్తూ ఆత్మను, శరీరాన్ని పుష్టివంతం చేసుకోవాలి. ప్రపంచంలో ఎవ్వరూ వారిని ఉన్నత స్థితినుండి పడద్రోయకుందురు గాక !

**సందేశం:** ప్రపంచంలో మానవుని ఎదుట ఎంతో వికటమైన, విచిత్రమైన పరిస్థితి ఎదురవుతూ ఉంటుంది. అతడు ఏదైనా న్యాయోచిత కార్యం చేసినా, దానిని కొందరు దుష్కృత్యాల ద్వారా విఫలం చేస్తుంటారు. అతడు ఓటమి తర్వాత ఓటమిని చవిచూడవలసివస్తుంది. ఆ దురవస్థను దూరం చేసుకోవడానికి ఏం చేయాలో తోచక తికమకపడుతుంటాడు. నాలుగువైపులా చింత, భయం, శోకం, క్రోధం, నిరాశ, ఈర్ష్య, తృష్ణ, కోరికలు వ్యాపించి ఉన్నాయి. ప్రజలు తమ కోరికలు తీర్చుకోవడానికి పరుగులుదీస్తూ క్రింద మీద పడుతుంటారు.

మానవ జన్మ ఏదో విధంగా గడిపివేయడానికి ఇవ్వబడ లేదు. శ్రేష్ఠులైన గొప్పవారుగా గుర్తింపు పొందుటకు, గొప్ప పనులు చేయుటకై ఇవ్వడం జరిగింది. ఆ విధంగా జీవించిన వారు ధన్యులు. ఆ ధన్యతను సాధించాలంటే జాగరూకులై ఉండాలి. ఎల్లప్పుడూ సంఘర్షణా శీలురు కావాలి. మనస్సును దృఢం చేసుకుని లక్ష్యంవైపుకు సాగిపోవాలి.

లోభమోహాలు కలిగిన వ్యక్తులు తమ తమ మనస్సులను తృప్తి పరచుకోవడానికి అనేక అవినీతి మార్గాలను వెతుకు తుంటారు. మోసపూరితమైన మార్గాలలో తమ స్వార్థాన్ని పూర్తి చేసుకుంటూ ఉంటారు. అలాంటి వారు మనకు ఆదర్శం కాకూడదు. నిజమైన ఆదర్శపురుషుడు పరమాత్మయే. మనం ఎల్లప్పుడు ధర్మాన్ని, కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. బాధ్యతతో మెలగాలి. న్యాయమార్గంలో పయనించేటప్పుడు ఎన్ని సమస్యలు ఎదురైనా బెదిరిపోకూడదు. ప్రశాంతంగా మనపనిలో మనం నిమగ్నం కావాలి. పురుషార్థంలో కార్య శూరులం కావాలి. పరమాత్మ యొక్క ఉపాసన అంటే ఇదే.

జీవితం అంటేనే సంఘర్షణ. ప్రపంచంలోని దుష్ప్రవృత్తులతో ఘర్షణ పడడమే జీవితానికి సార్థకత. వాటి ముందు లొంగి పోవడం అంటే ప్రాణంలేని కర్రముక్క నదిలో కొట్టుకు పోవడంతో సమానం. సంఘర్షణ వల్ల మనుష్యునిలో స్వాభిమానం, సాత్వికత జాగృతం అవుతాయి. మంచి పనుల పట్ల ప్రేమ, రుచి, నిమగ్నత, విశ్వాసం, శ్రద్ధ మొదలైన భావాలు బలపడతాయి. శ్రేష్ఠమైన ఆదర్శాలను తన జీవితానికి కేంద్ర బిందువుగా చేసుకోగలుగుతాడు, దానికి అనుగుణంగా జీవిస్తాడు. జీవితంలో ఎదురయ్యే చిన్న పెద్ద సమస్యలకు చలించకుండా ధైర్యంగా ఎదుర్కోవాలి. అప్పుడే అగ్నిలో కాల్చ బడిన బంగారంవలె ప్రకాశిస్తాడు. జీవితంలో విజయాలను సాధిస్తాడు. **మన ధైర్య సాహసాలను పరీక్షించడానికే భగవంతుడు మనకు కష్టాలను కలిగిస్తాడు.** ఎదురొడ్డి నిలిచిన నాడే పరమేశ్వరుని కృపకు పాత్రులు అవుతారు.

సంయమంతో ఆత్మను, శరీరాన్ని, పుష్టివంతం చేసికొని జీవిత సంఘర్షణలో దూకడమే ఆదర్శ బ్రాహ్మణత్వం, సఫలతకు మార్గం.

★★★

## పండుగలు

**సెప్టెంబర్ 2014**

| | |
|---|---|
| 05-09-2014 | టీచర్స్ డే |
| 06-09-2014 | వామన జయంతి |
| 08-09-2014 | మాతా భగవతిదేవి జయంతి |
| 23-09-2014 | మహాలయ అమావాస్య |

**అక్టోబర్ 2014**

| | |
|---|---|
| 01-10-2014 | దుర్గాష్టమి |
| 02-10-2014 | మహాత్మాగాంధీ జయంతి |
| 03-10-2014 | విజయదశమి |
| 23-10-2014 | దీపావళి |

**విజయానికి కష్టపడటం ఒక్కటే మార్గం**



## గాయత్రీ విద్య-47

# గాయత్రీ సహస్రనామములు

గాయత్రి భగవంతుని దివ్యశక్తుల పుంజము (ప్రోగు). ఆ పుంజములో ఎన్ని శక్తులు ఉన్నాయో చెప్పనలవికాదు. దానిలో శక్తులగని ఉన్నది. శాస్త్రములలో సహస్రశబ్దము అనంతమను అర్థమున ప్రయోగింపబడుచున్నది. స్థూలార్థమున సహస్రమనగా వెయ్యి. కానీ ఇతరచోట్ల అనంత సంఖ్యకు సహస్ర శబ్దము ప్రయుక్తమగు చున్నది. ఈశ్వరుని ప్రార్థన అయిన మంత్రపుష్పము 'సహస్రశీర్షా' అని మొదలవుతుంది.

ఈ ప్రార్థనలో ఈశ్వరుడు సహస్రమస్తకుడు, సహస్రబాహుడు, సహస్రపాదుడు, సహస్రనేత్రుడు అని చెప్పబడినాడు. ఇక్కడ ఆ సహస్రమునకు అర్థము అనంతము, వెయ్యికాదు. దీనికి ఎన్నో ప్రమాణములున్నవి. వానివలన సహస్రమునకు అర్థము అనంతమని సిద్ధమగుచున్నది. గాయత్రికి సంబంధించిన అనంత శక్తులలో మనుష్యునకు తెలిసిన శక్తులు చాలా తక్కువ. తెలిసిన వానిలో కూడా చాలా తక్కువ శక్తులే ఉపయోగములోనికి వచ్చాయి. ఏ శక్తులు ఇంతవరకు తెలుసుకొనబడినవో వాని సంఖ్య దాదాపు ఒక్క వెయ్యి మాత్రమే.

ఈ వేయిశక్తుల నామములు వాని గుణములను అనుసరించి ఏర్పడినవి. గాయత్రి యొక్క వేయినామముల వర్ణన ప్రాచీన గ్రంథములో "గాయత్రీ సహస్రనామము"ల రూపమున లభించు చున్నది.

గాయత్రిలో ఏయే శక్తులున్నవి, ఆ శక్తుల సహాయమును పొందుటవలన మనము ఏయే లాభములను పొందగలము, ఈ విషయమే సహస్ర నామములో వర్ణన చేయబడినది. ఎందుకనగా ఈ నామములపై చక్కగా మనస్సునుంచుట వలన గాయత్రి యొక్క శక్తి, ప్రకృతి, ఉపయోగము మున్నగునవి పరిచయమగును. ఈ పరిచయము ఆ లాభప్రాప్తికి సోపాన మగును. దీనిని ఆధారము చేసికొని సాధకుడు గాయత్రీ శక్తిలో ఫలానా ఫలానా విశేషములు ఉన్నవి, వానిని అవసరమును అనుసరించి లేదా రుచిని అనుసరించి పొందవచ్చును అని ఆలోచిస్తాడు. ఇది తెలిసిన మీదట దాని ఉపయోగము వైపు మనస్సు పోతుంది మరియు జీవితమును సంపూర్ణముగా మలచుకొనుటకు ఆ లాభములు ప్రోగుచేసికొను ప్రవృత్తి పెరుగుతుంది. దానితోపాటు ఈ మహాతత్త్వము యొక్క మహిమను గూర్చిన సమాచారము తెలుస్తుంది. దానివలన గాయత్రి ఎంత అసాధారణ శక్తో తెలియ గలదు. ఒకదాని యొక్క మహిమను, విశేషమును, శ్రేష్ఠతను గురించి సమాచారము తెలిసిన మీదట దానిపై శ్రద్ధ ఉత్పన్న మవుతుంది. పరుసవేది గుణములను తెలిసి కొనిన వారే దానిని అన్వేషించి, పొందుటకు ప్రయత్నిస్తారు. లభించిన పిమ్మట దానిని సురక్షితముగా ఉంచుతారు. దానిని ఉపయోగించి తగిన లాభమును పొందుతాడు. పరుసవేది విశేషములు తెలియని వారు దానిని సామాన్యమైన రాతిముక్కగా భావిస్తారు.

అందువలన సహస్రనామములను శ్రద్ధగా పఠించుట వలన కలుగు మహత్యము శాస్త్రములలో చెప్పబడినది. రండి, శ్రద్ధగా గాయత్రీ సహస్రనామములను పఠిద్దాము. **దానిలో వర్ణింపబడిన నామములను గూర్చి ఆలోచిస్తూ గాయత్రీ మహిమను తెలుసు కుందాము, లాభమును పొందుదాము.**

### శ్రీనారాయణ ఉవాచ

సాధు-సాధు మహాప్రాజ్ఞ సమ్యక్ పృష్టం త్వయాऽనఘ

శృణు వక్ష్యామి యత్నేన గాయత్ర్యష్టసహస్రకమ్ ।
నామ్నాం శుభానాం దివ్యానాం సర్వపాపవినాశనమ్ ॥ 1

సృష్ట్యాదౌ యద్భగవతా పూర్వం ప్రోక్తం బ్రవీమి తే ।
అష్టోత్తరసహస్రస్య ఋషిర్బ్రహ్మా ప్రకీర్తితః ॥ 2

ఛన్దోऽనుష్టుప్తథా దేవీ గాయత్రీం దేవతా స్మృతా ।
హలో బీజాని తస్యైవ స్వరాః శక్తయ ఈరితాః ॥ 3

అంగన్యాసకరన్యాసావుచ్యేతే మాతృకాక్షరైః ।
అథ ధ్యానం ప్రవక్ష్యామి సాధకానాం హితాయ వై ॥ 4

సూర్యమణ్డలమధ్యవాసనిరతాం శ్వేతప్రభారఞ్జితామ్ ।
రక్త శ్వేతహిరణ్యనీలధవలైర్యుక్తాం కుమారీమిమామ్ ॥ 5

గాయత్రీం కమలాసనాం కరతలవ్యానద్ధకుణ్డాముంబుజాం ।
పద్మాక్షీం చ వరస్రజం చ దధతీం హంసాధిరూఢాం భజే ॥ 6

అచిన్త్యలక్షణావ్యక్తాప్యర్థమాతృమహేశ్వరీ ।
అమృతార్ణవమధ్యస్థాప్యజితా చాపరాజితా ॥ 7

**కలలను నెరవేర్చుకోవాలంటే కసితో కృషి చేయాలి**

అణిమాదిగుణాధారాప్యర్కమండలసంస్థితా ।
అజరాఽజాపఽరా ధర్మా అక్షసూత్రధరాఽధరా ॥ 8

అకారాదిక్షకారాంతాప్యరిషడ్వర్గభేదినీ ।
అఞ్జనాద్రిప్రతీకాశాప్యంజనాద్రినివాసినీ ॥ 9

అదితిశ్చాజపా విద్యాప్యరవిన్దనిభేక్షణా ।
అన్తర్బహిః స్థితాఽవిద్యాధ్వంసినీ చాన్తరాత్మికా ॥ 10

అజా చాజముఖా వాసాప్యరవిన్దనిభాననా ।
అర్ధమాత్రార్థదానజ్ఞాప్యరిమణ్డలమర్దినీ ॥ 11

అసురఘ్నీ హ్యమావాస్యాప్యలక్ష్మీఘ్న్యన్త్యజార్చితా ।
ఆదిలక్ష్మీశ్చాదిశక్తిరాకృతిశ్చాయతాననా ॥ 12

ఆదిత్యపదవీచారాప్యాదిత్యపరిసేవితా ।
ఆచార్యా వర్తనాచారాప్యాదిమూర్తినివాసినీ ॥ 13

ఆగ్నేయీ చామరీ చాద్యా చారాధ్యా చాసనస్థితా ।
ఆధారనిలయాధారా చాకాశాంతనివాసినీ ॥ 14

ఆద్యాక్షరసమాయుక్తా చాన్తరాకాశరూపిణీ ।
ఆదిత్యమణ్డలగతా చాన్తరధ్వాన్తనాశినీ ॥ 15

ఇందిరా చేష్టదా చేష్టా చేందివరనిభేక్షణీ ।
ఇరావతీ చేంద్రపదా చేంద్రాణీ చేందురూపిణీ ॥ 16

ఇక్షుకోదండసంయుక్తా చేషుసంధానకారిణీ ॥
ఇంద్రనీలసమాకారా చేడాపింగలరూపిణీ ॥ 17

ఇన్ద్రాక్షీ చేశ్వరీ దేవీ చేహాత్రయవివర్జితా ।
ఉమా చోషా హ్యుడునిభా ఉర్వారుకఫలాననా ॥ 18

ఉడుప్రభా చోడుమతీ హ్యుడుపా హ్యుడుమధ్యగా ।
ఊర్ధ్వా చాప్యూర్ధ్వకేశీ చాప్యూర్ధ్వాధోగతిభేదినీ ॥ 19

ఊర్ధ్వబాహుప్రియా చోర్మిమాలా వాగ్గ్రన్థదాయినీ ।
ఋతం చర్షిరృతుమతీ ఋషిదేవనమస్కృతా ॥ 20

ఋగ్వేదా ఋణహర్త్రీ చ ఋషిమండలచారిణీ ।
ఋద్ధిదా ఋజుమార్గస్థా ఋజుధర్మా ఋతుప్రదా ॥ 21

ఋగ్వేదనిలయా ఋజ్వీ లుప్తధర్మ ప్రవర్తినీ ।
లూతారివరసమ్భూతా లూతాదివిషహారిణీ ॥ 22

ఏకాక్షరా చైకమాత్రా చైకా చైకైకనిష్ఠితా ।
ఏంద్రీ హ్యైరావతారూఢా చైహికాముష్మికప్రదా ॥ 23

ఓంకారా హ్యోషధీ చోతా చోతప్రోతనివాసినీ ।
ఔర్వా హ్యౌషధసమ్పన్నా ఔపాసనఫలప్రదా ॥ 24

అణ్డమధ్యస్థితా దేవీ చాః కారమనురూపిణీ ।
కాత్యాయనీ కాళరాత్రిః కామాక్షీ కామసున్దరీ ॥ 25

కమలా కామినీ కాన్తా కామదా కలకంఠినీ ॥
కరికుమ్భస్తనభరా కరవీరసువాసినీ ॥ 26

కళ్యాణీ కుణ్డలవతీ కురుక్షేత్రనివాసినీ ।
కురువిన్దదళాకారా కుణ్డలీ కుముదాలయా ॥ 27

కాలజిహ్వా కరాలాస్యా కాళికా కాలరూపిణీ ।
కమనీయగుణా కాన్తిః కళాధారా కుముద్వతీ ॥ 28

కౌశికీ కమలాకారా కామచారప్రభంజినీ ।
కౌమారీ కరుణాపాంగి కకుబన్తా కరిప్రియా ॥ 29

కేసరీ కేశవనుతా కదంబ కుసుమప్రియా ।
కాలిన్దీ కాళికా కాంచీ కలశోద్భవసంస్తుతా ॥ 30

కామమాతా క్రతుమతీ కామరూపా కృపావతీ ।
కుమారీ కుణ్డనిలయా కిరాతీ కరివాహనా ॥ 31

కైకేయీ కోకిలాలాపా కేతకీ కుసుమప్రియా ।
కమండలుధరా కాళీ కర్మనిర్మూలకారిణీ ॥ 32

కలహంసగతిః కక్షా కృతకౌతుకమంగళా ।
కస్తూరీతిలకా కమ్రా కరీంద్రగమనా కుహూః ॥ 33

కర్పూరలేపనా కృష్ణా కపిలా కుహరాశ్రయా ।
కూటస్థా కుధరా కమ్రా కుక్షిస్థాఖిలవిష్టపా ॥ 34

ఖడ్గ ఖేటకరా ఖర్వా ఖేచరీ ఖగవాహనా ।
ఖట్వాంగధారిణీ ఖ్యాతా ఖగరాజోపరిస్థితా ॥ 35

ఖలఘ్నీ ఖండితజరా ఖండాఖ్యానప్రదాయినీ ।
ఖండేన్దుతిలకా గంగా గణేశగుహపూజితా ॥ 36

గాయత్రీ గోమతీ గీతా గాన్ధారీ గానలోలుపా ।
గౌతమీ గామినీ గాధా గన్ధర్వాప్సరసేవితా ॥ 37

గోవిన్దచరణాక్రాన్తా గుణత్రయవిభావితా ।
గన్ధర్వీ గహ్వరీ గోత్రా గిరీశా గహనాగమీ ॥ 38

గుహావాసా గుణవతీ గురుపాపప్రణాశినీ ।
గుర్వీ గుణవతీ గుహ్యా గోప్తవ్యా గుణదాయినీ ॥ 39

గిరిజా గుహ్యామాతంగి గరుడధ్వజవల్లభా ।
గర్వాపహారిణీ గోదా గోకులస్థా గదాధరా ॥ 40

గోకర్ణనిలయాసక్తా గుహ్యామణ్డలవర్తినీ ।
ఘర్మదా ఘనదా ఘణ్టా ఘోరదానవమర్దినీ ॥ 41

**ప్రయత్నం చేస్తే పని అవుతుందనే గ్యారంటీ లేకపోవచ్చు**

ఘృణిమంత్రమయీ ఘోషా ఘనసమ్పాతదాయినీ ।
ఘణ్టారవప్రియా ఘ్రాణా ఘృణిసన్తుష్టకారిణీ ॥ 42

ఘనారిమండలా ఘూర్ణా ఘృతాచీ ఘనవేగినీ ।
జ్ఞానధాతుమయీ చర్చా చర్చితా చారుహాసినీ ॥ 43

చటులా చండికా చిత్రా చిత్రమాల్యవిభూషితా ।
చతుర్భుజా చారుదన్తా చాతురీ చరితప్రదా ॥ 44

చూలికా చిత్రవస్త్రాన్తా చన్ద్రమః కర్ణకుణ్డలా ।
చన్ద్రహాసా చారుదాత్రీ చకోరీ చన్ద్రహాసినీ ॥ 45

చన్ద్రికా చన్ద్రధాత్రీ చ చౌరీ చౌరా చ చణ్డికా ।
చఞ్చద్వాగ్వాదినీ చన్ద్రచూడా చోరవినాశినీ ॥ 46

చారుచన్దనలిప్తాంగీ చఞ్చచ్చామరవీజితా ।
చారుమధ్యా చారుగతిశ్చన్దిలా చన్ద్రరూపిణీ ॥ 47

చారుహోమప్రియా చార్వా చరితా చక్రబాహుకా ।
చన్ద్రమణ్డలమధ్యస్థా చన్ద్రమణ్డలదర్పణా ॥ 48

చక్రవాకస్తనీ చేష్టా చిత్రా చారువిలాసినీ ।
చిత్స్వరూపా చన్ద్రవతీ చన్ద్రమాశ్చన్దనప్రియా ॥ 49

చోదయిత్రీ చిరప్రజ్ఞా చాతకా చారుహేతుకీ ।
ఛత్రయాతా ఛత్రధరా ఛాయా ఛన్దః పరిచ్ఛదా॥ 50

ఛాయాదేవి ఛిద్రనఖా ఛన్నేన్ద్రియవిసర్పిణీ ।
ఛన్దోఽనుష్టుప్ప్రతిష్ఠాన్తా ఛిద్రోపద్రవభేదినీ ॥ 51

ఛేదా ఛత్రేశ్వరీ ఛిన్నా ఛురికా ఛేదనప్రియా ।
జననీ జన్మరహితా జాతవేదా జగన్మయీ ॥ 52

జాహ్నవీ జటిలా జేత్రీ జరామరణవర్జితా ।
జమ్బూద్వీపవతీ జ్వాలా జయన్తీ జలశాలినీ ॥ 53

జితేన్ద్రియా జితక్రోధా జితామిత్రా జగత్ప్రియా ।
జాతరూపమయీ జిహ్వా జానకీ జగతీ జరా ॥ 54

జనిత్రీ జహ్నుతనయా జగత్త్రయహితైషిణీ ।
జ్వాలాముఖీ జపవతీ జ్వరఘ్నీ జితవిష్టపా ॥ 55

జితాక్రాన్తమయీ జ్వాలా జాగ్రతీ జ్వరదేవతా ।
జ్వలన్తీ జలదా జ్యేష్ఠా జ్యాఘోషాస్ఫోటదిఙ్ముఖీ ॥ 56

జమ్భినీ జృమ్భణా జృంభా జ్వలన్మాణిక్యకుణ్డలా ।
ఝింఝికా ఝణనిర్ఘోషా ఝుంఝూమారుతవేగినీ॥ 57

ఝల్లరీవాద్యకుశలా ఞరూపా ఞభుజా స్మృతా ।
టంకబాణసమాయుక్తా టంకినీ టంకభేదినీ ॥ 58

టంకీగణకృతాఘోషా టంకనీయమహోరసా ।
టంకారకారిణీ దేవీ ఠఠశబ్దనినాదినీ ॥ 59

డామరీ డాకినీ డింభా డుండుమారైకనిర్జితా ।
డామరీతన్త్రమార్గస్థా డమడ్డమరునాదినీ ॥ 60

డిణ్డీరవసహా డిమ్భలసత్క్రీడాపరాయణా ।
ఢుంఢివిఘ్నేశజననీ ఢక్కాహస్తా ఢిలివ్రజా ॥ 61

నిత్యజ్ఞానా నిరుపమా నిర్గుణా నర్మదా నదీ ।
త్రిగుణా త్రిపదా తన్త్రీ తులసీ తరుణా తరుః ॥ 62

త్రివిక్రమపదాక్రాన్తా తురీయపదగామినీ ।
తరుణాదిత్యసంకాశా తామసీ తుహినా తురా ॥ 63

త్రికాలజ్ఞానసమ్పన్నా త్రివలీ చ త్రిలోచనా ।
త్రిశక్తిస్త్రిపురా తుంగా తురంగవదనా తథా ॥ 64

తిమింగలగిలా తీవ్రా త్రిస్రోతా తామసాదినీ ।
తన్త్రమన్త్రవిశేషజ్ఞా తనుమధ్యా త్రివిష్టపా ॥ 65

త్రిసన్ధ్యా త్రిస్తనీ తోషాసంస్థా తాలప్రతాపినీ ।
తాటంకినీ తుషారాభా తుహినాచలవాసినీ ॥ 66

తన్తుజాలసమాయుక్తా తారహారావలిప్రియా ।
తిలహోమప్రియా తీర్థా తమాలకుసుమాకృతిః ॥ 67

తారకా త్రియుతా తన్వీ త్రిశంకుపరివారితా ।
తలోదరీ తిలోభూషా తాటంక ప్రియవాదినీ ॥ 68

త్రిజటా తిత్తిరీ తృష్ణా త్రివిధా తరుణాకృతిః ।
తప్తకాంచనసంకాశా తప్తకాంచనభూషణా ॥ 69

త్రైయమ్బికా త్రివర్గా చ త్రికాలజ్ఞానదాయినీ ।
తర్పణా తృప్తిదా తృప్తా తామసీ తుమ్బురుస్తుతా ॥ 70

తార్క్ష్యస్థా త్రిగుణాకారా త్రిభంగీ తనువల్లరిః ।
థాత్కారీ థారవా థాన్తా దోహినీ దీనవత్సలా ॥ 71

దానవాన్తకరీ దుర్గా దుర్గాసురనిబర్హిణీ ।
దేవరీతిర్దివారాత్రిర్ద్రౌపదీ దున్దుభిస్వనా ॥ 72

దేవయానీ దురావాసా దారిద్ర్యభేదినీ దివా ।
దామోదరప్రియా దీప్తా దిగ్వాసా దిగ్విమోహినీ ॥ 73

దణ్డకారణ్యనిలయా దణ్డినీ దేవపూజితా ।
దేవవన్ద్యా దివిషదా ద్వేషిణీ దానవాకృతిః ॥ 74

దీనానాథస్తుతా దీక్షా దైవతాదిస్వరూపిణీ ।
ధాత్రీ ధనుర్ధరా ధేనుర్ధారిణీ ధర్మచారిణీ ॥ 75

**ప్రయత్నం చేయకపోతే మాత్రం పనులు ఖచ్చితంగా విఫలమవుతాయి**

ధురన్ధరా ధరాధారా ధనదా ధాన్యదోహినీ ।
ధర్మశీలా ధనాధ్యక్షా ధనుర్వేదవిశారదా ॥ 76

ధృతిర్ధన్యా ధృతపదా ధర్మరాజప్రియా ధ్రువా ।
ధూమావతీ ధూమకేశీ ధర్మశాస్త్రప్రకాశినీ ॥ 77

నన్దా నన్దప్రియా నిద్రా నృనుతా నన్దనాత్మికా ।
నర్మదా నళినీ నీలా నీలకణ్ఠసమాశ్రయా ॥ 78

నారాయణప్రియా నిత్యా నిర్మలా నిర్గుణా నిధిః ।
నిరాధారా నిరుపమా నిత్యశుద్ధా నిరంజనా ॥ 79

నాదబిన్దుకళాతీతా నాదబిన్దుకళాత్మికా ।
నృసింహినీ నగధరా నృపనాగవిభూషితా ॥ 80

నరకక్లేశశమనీ నారాయణపదోద్భవా ।
నిరవద్యా నిరాకారా నారదప్రియకారిణీ ॥ 81

నానాజ్యోతిః సమాఖ్యాతా నిధిదా నిర్మలాత్మికా ।
నవసూత్రధరా నీతిర్నిరుపద్రవకారిణీ ॥ 82

నన్దజా నవరత్నాఢ్యా నైమిషారణ్యవాసినీ ।
నవనీతిప్రియా నారీ నీలజీమూతనిః స్వనా ॥ 83

నిమేషిణీ నదీరూపా నీలగ్రీవా నిశీశ్వరీ ।
నామావళిర్నిశుమ్భఘ్నీ నాగలోకనివాసినీ ॥ 84

నవజామ్బూనదప్రఖ్యా నాగలోకాధిదేవతా ।
నూపురాక్రాన్తచరణా నరచిత్త ప్రమోదినీ ॥ 85

నిమగ్నారక్తనయనా నిర్ఘాతసమనిస్వనా ।
నన్దనోద్యాననిలయా నిర్వ్యూహోపరిచారిణీ ॥ 86

పార్వతీ పరమోదారా పరబ్రహ్మాత్మికా పరా ।
పఞ్చకోశవినిర్ముక్తా పంచపాతకనాశినీ ॥ 87

పరచిత్తవిధానజ్ఞా పంచికా పంచరూపిణీ ।
పూర్ణిమా పరమా ప్రీతిః పరతేజః ప్రకాశినీ ॥ 88

పురాణీ పౌరుషీ పుణ్యా పుణ్డరీకనిభేక్షణా ।
పాతాళతలనిర్మగ్నా ప్రీతా ప్రీతివివర్ధినీ ॥ 89

పావనీ పాదసహితా పేశలా పవనాశినీ ।
ప్రజాపతిః పరిశ్రాన్తా పర్వతస్తనమణ్డలా ॥ 90

పద్మప్రియా పద్మసంస్థా పద్మాక్షీ పద్మసమ్భవా ।
పద్మపత్రా పద్మపదా పద్మినీ ప్రియభాషిణీ ॥ 91

పశుపాశవినిర్ముక్తా పురన్ధ్రీ పురవాసినీ ।
పుష్కళా పురుషా పర్వా పారిజాతసుమప్రియా ॥ 92

పతివ్రతా పవిత్రాంగి పుష్పహాసపరాయణా ।
ప్రజ్ఞావతీ సుతా పౌత్రీ పుత్రపూజ్యా పయస్వినీ ॥ 93

పట్టిపాశధరా పంక్తిః పితృలోకప్రదాయినీ ।
పురాణీ పుణ్యశీలా చ ప్రణతార్తి వినాశినీ ॥ 94

ప్రద్యుమ్నజననీ పుష్టా పితామహపరిగ్రహా ।
పుణ్డరీకపురావాసా పుణ్డరీకసమాననా ॥ 95

పృథుజంఘా పృథుభుజా పృథుపాదా పృథూదరీ ।
ప్రవాళశోభా పింగాక్షీ పీతావాసాః ప్రచాపలా ॥ 96

ప్రసవా పుష్టిదా పుణ్యా ప్రతిష్ఠా ప్రణవాగతిః ।
పంచవర్ణా పంచవాణీ పంచికా పంజరస్థితా ॥ 97

పరమాయా పరజ్యోతిః పరప్రీతిః పరాగతిః ।
పరాకాష్ఠా పరేశానీ పావినీ పావకద్యుతిః ॥ 98

పుణ్యప్రదా పరిచ్ఛేద్యా పుష్పహాసా పృథూదరీ ।
పీతాంగి పీతవసనా పీతశయ్యా పిశాచినీ ॥ 99

పీతక్రియా పిశాచఘ్నీ పాటలాక్షీ పటుక్రియా ।
పంచభక్ష్యప్రియాచారా పూతనా ప్రాణఘాతినీ ॥ 100

పున్నాగవనమధ్యస్థా పుణ్యతీర్థనిషేవితా ।
పంచాంగీ చ పరాశక్తిః పరమాహ్లాదకారిణీ ॥ 101

పుష్పకాణ్డస్థితా పూషా పోషితాఖిలవిష్టపా ।
పానప్రియా పంచశిఖా పన్నగోపరిశాయినీ ॥ 102

పంచమాత్రాత్మికా పృథ్వీ పథికా పృథుదోహినీ ।
పురాణన్యాయమీమాంసా పాటలీ పుష్పగన్ధినీ ॥ 103

పుణ్యప్రజా పారదాత్రీ పరమార్గైకగోచరా –
ప్రవాళశోభా పూర్ణాశా ప్రణవా పల్లవోదరీ ॥ 104

ఫలినీ ఫలదా ఫల్గుః ఫూత్కారీ ఫలకాకృతిః ।
ఫణీన్ద్రభోగశయనా ఫణిమణ్డలమణ్డితా ॥ 105

బాలబాలా బహుమతా బాలాతపనిభాంశుకా ।
బలభద్రప్రియా బన్ద్యా బడబా బుద్ధిసంస్తుతా ॥ 106

బన్దీదేవీ బిలవతీ బడిశఘ్నీ బలిప్రియా ।
బాన్ధవీ బోధితా బుద్ధిర్బన్ధూకకుసుమప్రియా ॥ 107

బాలభానుప్రభాకారా బ్రాహ్మీ బ్రాహ్మణదేవతా ।
బృహస్పతిస్తుతా బృన్దా బృన్దావనవిహారిణీ ॥ 108

బలాకినీ బిలాహారా బిలావాసా బహూదకా ।
బహునేత్రా బహుపదా బహుకర్ణావతంసికా ॥ 109

**ప్రయత్నించగా, ప్రయత్నించగా అనుకున్నది సాధించగలం**

బహుబాహుయుతా బీజరూపిణీ బహురూపిణీ ।
బిన్దునాదకళాతీతా బిన్దునాదస్వరూపిణీ ॥ 110

బద్ధగోధాంగులిత్రాణా బదర్యాశ్రమవాసినీ ।
బృన్దారకా బృహత్స్కన్ధా బృహతీ బాణపాతినీ ॥ 111

బృన్దాధ్యక్షా బహునుతా బనితా బహువిక్రమా ।
బద్ధపద్మాసనాసీనా బిల్వపత్రతలస్థితా ॥ 112

బోధిద్రుమనిజావాసా బడిస్థా బిన్దుదర్పణా ।
బాలా బాణాసనవతీ బడబానలవేగినీ ॥ 113

బ్రహ్మాణ్డబహిరన్తఃస్థా బ్రహ్మకంకణసూత్రిణీ ।
భవానీ భీషణవతీ భావినీ భయహారిణి ॥ 114

భద్రకాళీ భుజంగాక్షీ భారతీ భారతాశయా ।
భైరవీ భీషణాకారా భూతిదా భూతిమాలినీ ॥ 115

భామినీ భోగనిరతా భద్రదా భూరివిక్రమా ।
భూతావాసా భృగులతా భార్గవీ భూసురార్చితా ॥ 116

భాగీరథీ భోగవతీ భవనస్థా భిషగ్వరా ।
భామినీ భోగినీ భాషా భవానీ భూరిదక్షిణా ॥ 117

భర్గాత్మికా భీమవతీ భవబన్ధ-విమోచినీ ।
భజనీయా భూతధాత్రీ భంజితా భువనేశ్వరీ ॥ 118

భుజంగవలయా భీమా భేరుణ్డా భాగధేయినీ ।
మాతా మాయా మధుమతీ మధుజిహ్వా మధుప్రియా ॥ 119

మహాదేవీ మహాభాగా మాలినీ మీనలోచనా ।
మాయాతీతా మధుమతీ మధుమాసా మధుద్రవా ॥ 120

మానవీ మధుసమ్భూతా మిథిలాపురవాసినీ ।
మధుకైటభసంహర్త్రీ మేదినీ మేఘమాలినీ । 121

మన్దోదరీ మహామాయా మైథిలీ మసృణప్రియా ।
మహాలక్ష్మీర్మహాకాళీ మహాకన్యా మహేశ్వరీ ॥ 122

మాహేన్ద్రీ మేరుతనయా మన్దారకుసుమార్చితా ।
మంజుమంజీరచరణా మోక్షదా మంజుభాషిణీ ॥ 123

మధురద్రావిణీ ముద్రా మలయా మలయాన్వితా ।
మేధా మరకతశ్యామా మాగధీ మేనకాత్మజా ॥ 124

మహామారీ మహావీరా మహాశ్యామా మనుస్తుతా ।
మాతృకా మిహిరాభాసా ముకున్దపదవిక్రమా ॥ 125

మూలాధారస్థితా ముగ్ధా మణిపూరకవాసినీ ।
మృగాక్షీ మహిషారూఢా మహిషాసురమర్దినీ ॥ 126

యోగాసనా యోగగమ్యా యోగా యౌవనకాశ్రయా ।
యౌవనీ యుద్ధమధ్యస్థా యమునా యుగధారిణీ ॥ 127

యక్షిణీ యోగయుక్తా చ యక్షరాజప్రసూతినీ ।
యాత్రా యానవిధానజ్ఞా యదువంశసముద్భవా ॥ 128

యకారాదిహకారాన్తా యాజుషీ యజ్ఞరూపిణీ ।
యామినీ యోగనిరతా యాతుధాన-భయంకరీ ॥ 129

రుక్మిణీ రమణీ రామా రేవతీ రేణుకా రతిః ।
రౌద్రీ రౌద్రప్రియాకారా రామమాతా రతిప్రియా ॥ 130

రోహిణీ రాజ్యదా రేవా రమా రాజీవలోచనా ।
రాకేశీ రూపసమ్పన్నా రత్నసింహాసనస్థితా ॥ 131

రక్తమాల్యామ్బరధరా రక్తగన్ధానులేపనా ।
రాజహంససమారూఢా రమ్భా రక్తబలిప్రియా ॥ 132

రమణీయయుగాధారా రాజితాఖిలభూతలా ।
రురుచర్మపరీధానా రథినీ రత్నమాలికా ॥ 133

రోగేశీ రోగశమనీ రావిణీ రోమహర్షిణీ ।
రామచన్ద్రపదాక్రాన్తా రావణచ్ఛేదకారిణీ ॥ 134

రత్నవస్త్రపరిచ్ఛన్నా రథస్థా రుక్మభూషణా ।
లజ్జాధిదేవతా లోలా లలితా లింగధారిణీ ॥ 135

లక్ష్మీర్లోలా లుప్తవిషా లోకినీ లోకవిశ్రుతా ॥
లజ్జా లమ్బోదరీ దేవీ లలనా లోకధారిణీ ॥ 136

వరదా వన్దితా విద్యా వైష్ణవీ విమలాకృతిః ।
వారాహీ విరజా వర్షా వరలక్ష్మీర్విలాసినీ ॥ 137

వినతా వ్యోమమధ్యస్థా వారిజాసనసంస్థితా ।
వారుణీ వేణుసమ్భూతా వీతిహోత్రా విరూపిణీ ॥ 138

వాయుమణ్డలమధ్యస్థా విష్ణురూపా విధిప్రియా ।
విష్ణుపత్నీ విష్ణుమతీ విశాలాక్షీ వసున్ధరా ॥ 139

వామదేవప్రియా వేలా వజ్రిణీ వసుదోహినీ ।
వేదాక్షరవరీతాంగీ వాజపేయఫలప్రదా ॥ 140

వాసవీ వామజననీ వైకుణ్ఠనిలయా వరా ।
వ్యాసప్రియా వర్మధరా వాల్మీకిపరిసేవితా ॥ 141

శాకమ్భరీ శివా శాన్తా శారదా శరణాగతిః ।
శాతోదరీ శుభాచారా శుమ్భాసురవిమర్దినీ ॥ 142

శోభావతీ శివాకారా శంకరార్ధశరీరిణీ ।
శోణాశుభాశయాశుభ్రాశిరఃసన్ధానకారిణీ ॥ 143

**ప్రయత్నిస్తూ ఉంటే ఫలితం వస్తుందన్న ఆశ బతికి ఉంటుంది**

శరావతీ శరానన్దా శరజ్జ్యోత్స్నా శుభాననా ।
శరభా శూలినీ శుద్ధా శబరీ శుకవాహనా ॥ 144

శ్రీమతి శ్రీధరానన్దా శ్రవణానన్దదాయినీ ।
శర్వాణీ శర్వరీవన్ద్యా షడ్భాషా షడృతుప్రియా ॥ 145

షడాధారస్థితా దేవి షణ్ముఖప్రియకారిణీ ।
షడఙ్గరూపసుమతిట సురాసురనమస్కృతా ॥ 146

సరస్వతీ సదాధారా సర్వమంగళకారిణీ ।
సామగానప్రియా సూక్ష్మా సావిత్రీ సామసమ్భవా ॥ 147

సర్వవాసా సదానన్దా సుస్తనీ సాగరామ్బరా ।
సర్వైశ్వర్యప్రియా సిద్ధిః సాధుబన్ధుపరాక్రమా ॥ 148

సప్తర్షిమణ్డలగతా సోమమణ్డలవాసినీ ।
సర్వజ్ఞా సాన్ద్రకరుణా సమానాధికవర్జితా ॥ 149

సర్వోత్తుంగా సంగహీనా సద్గుణా సకలేష్టదా ।
సరఘా సూర్యతనయా సుకేశీ సోమసంహతిః ॥ 150

హిరణ్యవర్ణా హరిణీ హ్రీంకారీ హంసవాహినీ ॥
క్షౌమవస్త్రపరీతాఙ్గీ క్షీరాబ్ధితనయా క్షమా ॥ 151

గాయత్రీ చైవ సావిత్రీ పార్వతీ చ సరస్వతీ ।
వేదగర్భా వరారోహా శ్రీగాయత్రీ పరామ్బికా ॥ 152

ఇతి సాహస్రకం నామ్నాం గాయాత్ర్యాశ్చైవ నారద ।
పుణ్యదం సర్వపాపఘ్నం మహాసమ్పత్తిదాయకమ్ ॥ 153

ఏవం నామాని గాయాత్ర్యాస్తోషోత్పత్తికరాణి హి ।
అష్టమ్యాం చ విశేషేణ పఠితవ్యం ద్విజైః సహ ॥ 154

జపం కృత్వా హోమపూజాం ధ్యానం కృత్వా విశేషతః ।
యస్మై కస్మై న దాతవ్యం గాయత్ర్యాస్తు విశేషతః ॥ 155

సుభక్తాయ సుశిష్యాయ వక్తవ్యం భూసురాయ వై ।
భ్రష్టేభ్యః సాధకేభ్యశ్చ బాన్ధవేభ్యో న దర్శయేత్ ॥ 156

యద్గృహే లిఖితం శాస్త్రం భయం తస్య న కస్యచిత్ ।
చంచలాపిస్థిరా భూత్వా కమలా తత్ర తిష్ఠతి ॥ 157

ఇదం రహస్యం పరమం గుహ్యాద్ గుహ్యాతరం మహత్ ।
పుణ్యప్రదం మనుష్యాణాం దరిద్రాణాం నిధిప్రదమ్ ॥ 158

మోక్షప్రదం ముముక్షూణాం కామినాం సర్వకామదమ్ ।
రోగాద్విముచ్యతే రోగీ బద్ధో ముచ్యేత బన్ధనాత్ ॥ 159

బ్రహ్మహత్యాసురాపానసువర్ణస్తేయినో నరాః ।
గురుతల్పగతో వాపి పాతకాన్ముచ్యతే సకృత్ ॥ 160

అసత్ప్రతిగ్రహాచ్చైవాభక్ష్యభక్షాద్విశేషతః ।
పాఖణ్డానృత్యముఖ్యేభ్యః పఠనాదేవ ముచ్యతే ॥ 161

ఇదం రహస్యమమలం మయోక్తం పద్మజోద్భవ ।
బ్రహ్మసాయుజ్యదం నృణాం సత్యం సత్యం న సంశయః॥ 162

గాయత్రీ సహస్రనామములో ప్రతి నామము గొప్ప రహస్య మయమైనదే. దానిలో సూత్రరూపమున గాయత్రీ శక్తుల పరిచయము, ఇతిహాసము, విజ్ఞానము దాగి ఉన్నవి. స్థూలదృష్టితో చూసిన ఈ సహస్ర నామములు సామాన్యముగానే ఉండును. కానీ సూక్ష్మదృష్టితో పరిశీలించినచో ప్రతినామము నుండి గొప్ప గొప్ప రహస్యములు వెలువడును. ఒక్కొక్క నామమును వ్యాఖ్యానించుచున్నచో ఆ తత్త్వములు వెల్లడియగును. వానిని తెలిసి కొనుటకు వేదములు, శాస్త్రములు, పురాణములు, ఇతిహాసములు, దర్శనములు, ఉపనిషత్తులు, బ్రాహ్మణములు, అరణ్యకములు, స్మృతులు, నీతి గ్రంథములు, సంహితలు, సూత్ర గ్రంథములు రచింపబడినవి. వీటివలన ఆదిశక్తియగు గాయత్రి యొక్క రూపు రేఖలు, గతివిధి, ప్రక్రియ, ఉపయోగము, మహత్యము, శాస్త్రీయత, వాస్తవికత ఎట్టివి అను విషయములను అతి సామాన్యుడు కూడా తెలిసికొనగలుగుతాడు. ఈ సహస్రనామములు గాయత్రి యొక్క గుణ-ఇతిహాస-విజ్ఞాన రహస్యములను వెల్లడించుటయేగాక అనేక విధములగు దక్షిణమార్గ సాధనలను కూడా బోధిస్తాయి. అంగుళి నిర్దేశ-సంకేత-సూక్ష్మ-బీజ రూపమున ఉన్న ఈ సహస్ర నామములలో గాయత్రీ విద్యా నిధి నిండి ఉన్నది.

దీనిపై సాధకులందరు కలసి వివిధ విశేష ప్రయోగములు చేసి లోకకల్యాణమునకు కృషి చేసెదరు గాక.

*– గాయత్రీ మహావిజ్ఞానం రెండవ భాగం నుంచి*

## విద్యకు సమయం

*చికాగోలో "ఫ్రాంసిస్ వేలెండ్ పార్కర్" ప్రసిద్ధ విద్యా వేత్త. ఒక మహిళ తన పిల్లవానికి ఎప్పటి నుండి విద్య ప్రారంభించాలని అడగటానికి వచ్చింది. "నీ పిల్లవానికి ఎన్నేండ్లు" అని అడిగాడు పార్కర్. 5 సంవత్సరాలని చెప్పింది తల్లి. "అమ్మా! ఇప్పుడు వచ్చి అడుగుతున్నావు. ఏం లాభం? విద్య నేర్పటానికి అత్యుత్తమమైన సమయం ఆ మొదటి 5 సంవత్సరాలే. ఆ సమయాన్ని నువ్వు చేతులారా పోగొట్టుకున్నావు" అన్నాడు.*

*– అనువాదం: పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**ఆలోచించండి - ప్రయత్నించండి - విజేతలు అవ్వండి**

పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-27

# దీక్షాభూమికి యాత్ర-4

### హిందూ విశ్వవిద్యాలయంలో సంక్షోభం

మాలవ్యాజీ అరెస్టుతో విశ్వవిద్యాలయ వాతావరణం వ్యాకులత, చింత, ఆవేశాలతో నిండిపోయింది. ఆచార్య ఆనంద శంకర బాపూభాయిధృవ విశ్వవిద్యాలయానికి ప్రో వైస్ ఛాన్సలర్‌గా ఉన్నారు. ఆయన ఇబ్బందులను ఎదుర్కొనవలసి వచ్చింది. సహాయ నిరాకరణ ఉద్యమానికి ఆశ్రయం ఇవ్వడం, జాతీయ భావనలు ఉప్పొంగడం చూసి, పరాయి ప్రభుత్వం వెంటనే విశ్వవిద్యాలయానికి గ్రాంటు నిలిపివేసింది. ఆ చిక్కు నుండి బయట పడడానికై ఆచార్య ధృవ వెంటనే లక్నో వెళ్ళారు. అక్కడి అధికారులు ఆయనకు ప్రభుత్వపు తీవ్ర అసంతృప్తిని వెల్లడిచేశారు. విశ్వవిద్యాలయం రాజకీయాలకు కేంద్రంగా మారిందని ఆంగ్ల అధికారులు భావించి గ్రాంట్లు నిలిపివేస్తే, విశ్వవిద్యాలయం దారికి వస్తుందని వారి ఆలోచన. విశ్వవిద్యాలయం ఒక జాతీయ సంస్థ అని, ధర్మం నైతికతలు ఆధారంగా యువకులను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దడం దాని లక్ష్యమని, దానికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేయడానికి ఆయన విశ్వ ప్రయత్నం చేశారు. సమకాలీన పరిస్థితుల వల్ల ఇక్కడి యువకులలో జాతీయ భావతరంగాలు ఎగసి పడుతున్నాయని, ఆ తరంగాలకు ఎవరూ దూరంగా ఉండజాలరని ఆయన వివరించారు. ఈ స్పష్టీకరణతో ఆంగ్ల అధికారులు సంతృప్తి చెందలేదు. విశ్వవిద్యాలయంలో అల్లకల్లోలం కొనసాగింది.



విశ్వవిద్యాలయ వాతావరణంలో వ్యాపించి ఉన్న ఆవేశాన్ని, ఉత్సాహాన్ని, శ్రీరామ్ అవగాహన చేసుకున్నాడు. విశ్వవిద్యాలయ ప్రాంగణం నుండి బయటకు వస్తున్నప్పుడు అతని మనస్సులో మరో ఆలోచనా తరంగం ఉబికింది. అవకాశం లభిస్తే, భారతీయ సంస్కృతి, ధర్మాల నవోన్మేషానికి, నవ్య వికాసానికి సమర్పితమైన ఇలాంటి విశ్వవిద్యాలయాన్ని నిర్మాణం చేయాలని; దానిని రాజకీయ ప్రభావానికి, జోక్యానికి దూరంగా ఉంచాలనే ఆలోచనా తరంగం లేచింది, ఇది ఎలా సాధ్యమనే ప్రశ్నతో. మార్గదర్శక సత్తాయే ఈ తరంగాన్ని సంకల్పంగా మార్చుతుందని, అదే ఆ పని పూర్తిచేస్తుందని మరో ఆలోచన తరంగం వచ్చింది. ఆ సమయంలో మాలవ్యాగారు నైనీ (ప్రయాగ) సెంట్రల్ జైలులో ఉన్నారు.

విశ్వ విద్యాలయాన్ని మూసివేయించడానికి కొన్ని అవాంఛనీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయి. వ్యతిరేకత మొదటి నుంచి ఉన్నది. విశ్వవిద్యాలయం చిక్కుల నుండి బయట పడి నిలబడుతుందని వారు అనుకోలేదు. సాధన సంపద లేదు; ప్రజల సహకారం లేదు; పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు, సంపన్నులు వెన్నుదన్నుగా నిలవడం లేదు; కనుక విశ్వవిద్యాలయం కొద్ది రోజుల్లోనే మూత పడుతుందని వారు భావించారు. కానీ, వారి దురాశ ఫలించలేదు. చిన్న చిన్న అంశదానాలతో భారీమొత్తం సమకూరింది. విశ్వవిద్యాలయ స్వప్నద్రష్ట తన ఊహ సాకారం కావడం చూడసాగారు. ఆటంకాలు కల్పించే వ్యక్తులు నిరాశ చెందారు. విశ్వ విద్యాలయాన్ని అప్రతిష్టపాలు చేయడానికి వారు అన్ని రకాల కుతంత్రాలను సాగించారు.

### మాలవ్యాజీ ఉద్బోధ

1929 డిసెంబరులో మాలవ్యాజీ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ప్రసంగించారు. దేశంకోసం తమ సర్వస్వాన్ని బలిదానం చేయాలని ఆయన ఆ ప్రసంగంలో విద్యార్థులకు ప్రేరణ ఇచ్చారు. ఆ ప్రసంగం విద్యార్థి ఉద్యమచరిత్రలో ఒక మైలురాయి. ఆ ప్రసంగంలో మాలవ్యాజీ విద్యార్థులను ఇలా ఉద్బోధించారు.

'మీరు ఇక్కడ నుండి వెళ్ళి ప్రజలలో విద్యను వ్యాప్తి చేయండి. పరిశుభ్రత గురించి, ఆరోగ్యరక్షణ గురించి వారికి వివరించండి. మీమీ గ్రామాలలో సహకార సంస్థలను

**సమయాన్ని సద్వినియోగం చేస్తే అన్నీ సాధ్యమే**

స్థాపించండి. స్వరాజ్యం కోసం ఎలాంటి త్యాగాలకయినా సిద్ధపడండి. మీ హృదయాలలో స్వాతంత్ర్యకాంక్షను, మాతృభూమి కోసం త్యాగం చేయాలనే భావనను పెంపొందించుకోండి.'

ఈ స్నాతకోత్సవానికి కొద్దిరోజుల తర్వాత గాంధీజీ నాయకత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభమయింది. కాశీ విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా ఉద్యమంలోనికి దుమికారు. విశ్వవిద్యాలయాన్ని కూకటివ్రేళ్ళతో పెళ్ళగించివేయ చూస్తున్న వ్యక్తులకు ఇది చక్కని అవకాశం అయింది. విద్యార్థి ఉద్యమంలో దూరి, వీరు గుండా చర్యలు, లూటీలు జరిపారు. సహజంగానే విద్యార్థులపై ఆరోపణలు వచ్చాయి. 1930 తొలి నెలలో స్థానిక కాంగ్రెసువాదులు ఎంత హంగామా చేశారంటే ఉద్యమానికి దూరంగా ఉండవలసిందిగా విద్యార్థులకు సలహా ఇచ్చే విషయం మాలవ్యాజీ ఆలోచించసాగారు. అయితే, నిజం ఎక్కువసేపు దాగలేదు. కాంగ్రెసులో చేరిన అరాచక శక్తుల కుతంత్రాలు బయటపడనే పడ్డాయి. ఈ సంగతి అప్పుడు కాంగ్రెసు అధ్యక్షుని పని చూస్తున్న సర్దార్ పటేల్ దృష్టికి వచ్చింది. ఆయన అరాజక శక్తులకు గట్టి హెచ్చరిక వేశారు. వాటిని అదుపుచేయవలసిందని స్థానిక నాయకత్వాన్ని ఆదేశించారు. ఆ రోజుల్లో కాంగ్రెసు అధ్యక్షుని ఆదేశం రాజాజ్ఞయే. స్థానిక కమిటీ క్రమశిక్షణ పాటించి పని చేయాలి, లేదా నిష్క్రియంగా కూర్చోవాలి అని సర్దార్ పటేల్ ఆదేశించారు. ఈ ఆదేశం విశ్వవిద్యాలయ వ్యతిరేకులను కొంతవరకు అదుపుచేసింది.

విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అక్కడక్కడ చర్చలు జరుగుతూ వచ్చాయి. వాటిలో వర్తమాన పరిస్థితులే కాక గతంలో జరిగిన సంఘటనలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. ఈ కాశీ యాత్రలో శ్రీరామ్ రాజకీయాలను, స్వరాజ్య ఉద్యమం లోని సమకాలీన పరిణామాలను నిశితంగా పరిశీలించాడు. మూడు నాలుగురోజులపాటు ఆ స్థలానికి వెళ్ళాడు. నగరం లోనికి ఒక మాతాజీ వచ్చారని ఆ సందర్భంగా ఆయనకు తెలిసింది. ఆమె సమాధి స్థితిలో ఉంటారని, ఆమె దర్శనం చేసుకొమ్మని అక్కడి వారు చెప్పారు.

సమాధి స్థితి ప్రస్తావన వినగానే, శ్రీరామ్‌లో ఉత్కంఠ ఉదయించింది. ఆమె రామాపురంలో ఒక భక్తుని గృహంలో బస చేశారు. ఆమెతోపాటు ఆమె భర్త కూడా ఉన్నారు. మాతకు సంతానం లేదు. మామూలు గృహస్థ జీవితం పట్ల ఆమెకు ఆసక్తిలేదని అక్కడివారు తెలిపారు. వివాహ సమయంలో సైతం ఆమె భావనసమాధిలోనే ఉన్నారు. ఆమె పేరు బహుకొద్ది మందికే తెలుసు. ఆమె మీరాబాయి అవతారమని కొందరు శ్రద్ధాళువులు చెప్పేవారు. ఆమె భర్త కూడా ఆమెను మాతాజీ అని పిలుస్తారు.

### మాతా ఆనందమయితో సమావేశం

శ్రీరామ్ ఆమెను కలుసుకోవాలని నిర్ణయించాడు. రామపురా చిరునామా తీసుకుని బయలుదేరారు. మాత పేరు నిర్మలాదేవి. ఆ ఇంటి రెండవ అంతస్థులో ఆమె బసచేశారు. ఆమె దర్శనం కోసం 25-30 మంది బయట నిలబడి ఉన్నారు. శ్రీరామ్ చేరే సమయానికి మాతాజీ సమాధిలో ఉన్నారు. ఇప్పుడు దర్శనం సాధ్యపడదని ఆమె సేవకులు చెప్పారు. సమాధి పూర్తయిన తర్వాత ఆమె స్వయంగా బయటికి వస్తారని వారు వివరించారు. శ్రద్ధాళువులు చాలాసేపు కూర్చున్నారు. సుమారు రెండుగంటల తర్వాత సమాధి పూర్తి అయింది. ఆమె బయటికి వచ్చారు. ఇంతటి తేజస్సు కలిగిన మహిళను ఎన్నడూ చూడలేదని శ్రీరామ్ అనుకున్నాడు. నిర్మలాజీ వ్యక్తిత్వం లోని దివ్య తేజస్సు ఆయనకు తొలి దర్శనంలోనే అవగాహన అయింది.

సనాతన ధర్మ ప్రచారంలో నిమగ్నులైన స్వామి దయానంద కూడా అక్కడికి వచ్చారు. స్వామీజీ తన లక్ష్యసాధన కోసం 'భారత ధర్మ మహామండలి' స్థాపించారు. కాశీలోని ప్రసిద్ధి పొందిన పలువురు సాధు, మహంత్‌లు ఆ సంస్థలో సభ్యులు. స్వామీజీ స్థాపించిన ఈ సంస్థ నుండి ఆ తర్వాత అనేక ధార్మిక సంస్థలు ఉదయించాయి. విద్వత్ పరిషత్, ధర్మప్రచార మండలి, సనాతన ధర్మ ప్రతినిధి సభవంటి సంస్థలను స్థాపించిన ధర్మా చార్యులు స్వామి దయానంద శిబిరం నుండి బయలుదేరారు. సనాతన ధర్మ ప్రవాహానికి తీవ్ర వేగాన్ని కలిగించిన కారణంగా విఖ్యాతులైన స్వామి దయానంద అక్కడ ఉన్న శ్రద్ధాళువులతో ఇలా చెప్పారు - మాతాజీ సాక్షాత్తు దేవి; ప్రపంచానికి సద్భావ సందేశాన్ని, భక్తి సందేశాన్ని అందించేందుకు దిగివచ్చింది. స్వామీజీ చేసిన ఈ ఉద్బోధ అక్కడ చేరిన ప్రజలను ఎంతగానో ప్రభావితం చేసింది.

**గడచిపోయిన క్షణం తిరిగి రాదు**

మాతాజీతో సంభాషణ జరపాలనే ఆకాంక్ష శ్రీరామ్ మనస్సులో జనించింది. ఆ రోజున ఆ అవకాశం దొరలేదు, మరునాడు 10-11 గంటలకు తిరిగి మాత నివాసానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఎక్కువ జనం లేరు. మాతాజీ జాగృత స్థితిలో ఉన్నారు. సులువుగా సమావేశం జరిగింది. అక్కడ ఉన్న వ్యక్తుల ఎదుటనే చర్చ జరపడానికి ఆమె అనుమతి ఇచ్చారు. శ్రీరామ్ "మీరు ఎవరు?" అని అడిగారు.

మాతాజీ ఇలా అన్నారు - "నేను ఏమి చెప్పను? మీరంతా అనుకున్నది సరైనదే అవుతుంది."

"మీరు నిరంతరం సమాధిలో ఉంటారని ప్రజలు చెపుతారు. ఆ సమాధి సవికల్పమా, నిర్వికల్పమా?"

"నేను చదువుకున్నదాన్ని కాను. శాస్త్రాలలో నాకు ప్రవేశం లేదు. కనుక - నేను ఏ భావదశలో ఉంటానో చెప్పలేను."

"మాతాజీ! ఈ యుగంలో కూడా సిద్ధ పురుషులు ఉన్నారా?" - అని ఒక సాధకుడు అడిగాడు.

మాతాజీ ఇలా అన్నారు - "ఎందుకుండరు? ఈ యుగానికి ఏమయింది? సిద్ధ పురుషులు ప్రతి యుగంలోనూ ఉంటారు. బ్రాహ్మీ స్థితిని పొందిన వ్యక్తుల వల్లనే ఈ జగత్తు స్థిరంగా ఉన్నది. వారు లేకపోతే జగత్తు లయం అవుతుంది."

ఆ సాధకుడు మళ్ళీ ఇలా అడిగాడు - "వారు ఉన్నప్పటికీ మన దేశం బానిసత్వంలో ఎందుకు ఉన్నది?"

మాతాజీ ఇలా జవాబిచ్చారు - "ప్రభువు ఇచ్ఛ. ఆయన తన లీలలోని తామసగుణంలో ఆనందం పొందుతున్నారు. ఇప్పుడు రజోగుణం మేలుకొన్నది కనుక, స్వాతంత్ర్య కాంక్ష రగిలింది. కొద్ది సంవత్సరాలలో దేశానికి స్వరాజ్యం వస్తుంది."

"అందుకోసం కృషి చేయవలసిన అవసరం లేదా మాతాజీ?" - అని శ్రీరామ్ అడిగారు. మాతాజీ జవాబు - "ప్రయత్నం చేయక తప్పదు. కోరుకొనకపోయినా, దేశ ప్రజలు ప్రయత్నిస్తారు. ఎందుకంటే - ప్రభువు తన మాయ యొక్క రాజస గుణాన్ని మేలుకొలుపుతున్నారు. సోమరితనం, పొరపడడం తామసగుణాలు. వాటిలోనికి వెళ్ళడానికి ఏ ప్రయత్నం అవసరం లేదు."

"మరి మనదేశం ఎన్నడైనా సత్వ గుణంలో స్థిరపడుతుందా?"

"స్థిరపడుతుంది, తప్పక స్థిరపడుతుంది. ఆ స్థితిలో నలువైపులా దివ్యభావం విస్తరిస్తుంది. దేశం తన గౌరవాన్ని తిరిగి సంపాదిస్తుంది. భగవానుడు ఎంపిక చేసిన గౌరవాన్ని సంపాదిస్తుంది."

ఈ సంభాషణ జరుగుతూ ఉండగా, మాతాజీ సమాధి లోనికి వెళ్ళిపోయారు. జనం అక్కడే కూర్చొని ఉన్నారు. సమాధి స్థితిలో ఆమె కళ్ళు మూసుకుని కూర్చున్నారు. ఆమె ముఖ మండలంపై అద్భుత శాంతి తాండవించింది. ఆమెలోని కణ కణం భగవానుని స్మరణ చేస్తున్నదని అనిపించింది. అరగంట సేపు ఆమె ఆ స్థితిలో ఉన్నారు. ఆ స్థితి నుండి మేలుకొన్న తర్వాత ఆమె దృష్టి శ్రీరామ్ మీద పడింది. ఆమె హఠాత్తుగా ఇలా అన్నారు -

"నువ్వు మీ ఊరికి ఎప్పుడూ వెళుతున్నావు, శ్రీరామ్? ముందుముందు హరిద్వార్‌లో నీతో సమావేశం జరగవలసి ఉన్నది. అప్పుడు నువ్వు గంగాతీరంలో దివ్యభావనను స్థాపిస్తూ ఉంటావు."

ఆ మాట విని, శ్రీరామ్ ఆశ్చర్యంలో మునిగిపోయాడు. మాతాజీ చెపుతున్నది ఏమిటి? ప్రస్తుతం హరిద్వార్ గురించి మనసులో ఎలాంటి సంకల్ప - వికల్పం కాని, భావం కాని లేదు. ఆశ్చర్యం కలిగించే మాతాజీ మాటలకు ఆయన తనకు తానే సమాధానం చెప్పుకున్నారు - సంత్-మహాత్ముల లీలలు విలక్షణంగా ఉంటాయని.

శ్రీరామ్ ఈ ప్రశ్నను ఊహించలేదు. జవాబుగా ఏమి చెప్పాలా అని ఆయన ఆలోచించసాగారు. ఆ తర్వాత ఇలా అన్నారు - "రెండు మూడు రోజులలోనే."

శ్రీరామ్ కాశీలో నెలరోజులు ఉండాలని సంకల్పించాడు. ఆ ప్రకారం ఇంకా 8-10 రోజులు కాశీలో ఉండాలి. కానీ త్వరగా తిరిగి వెళ్ళాలని శ్రీరామ్ నిన్న సాయంత్రమే ఆలోచించ సాగాడు. కాశీ హిందూ విశ్వవిద్యాలయానికి వెళ్తూ వస్తూ ఉన్న ఫలితంగా దేశ కాల పరిస్థితులను గురించి చాలా అవగాహన అయింది. ఆవల్‌ఖేడాకు తిరిగి వెళ్ళాలని అతని మనస్సు తహతహలాడింది. నలువైపులా వాతావరణం వేడెక్కు తోంది. దేశంలో జాతీయ భావనలు ఉప్పొంగుతున్నాయి.

**శ్రద్ధతో ఏ పని చేసినా విసుగు వెయ్యదు**

ఈ పరిస్థితులలో ఇక్కడ తీర్థాలను సేవిస్తూ ఉండడంలో ఔచిత్యం ఏముంది? మాతాజీ ఎదుట అతని నిశ్చయం వ్యక్తమయింది.

## స్వగ్రామానికి తిరిగిరాక

శ్రీరామ్ మరి రెండు రోజులు కాశీలోని ఇతర క్షేత్రాలను దర్శించాడు. ఆ తర్వాత సారనాథ్ మీదుగా ఆవల్‌ఖేడా తిరిగి వచ్చాడు. అనుకున్న సమయానికి ముందే అతను రావడం చూసి, తాఈజీ చకితులు అయ్యారు, మూడు వారాల తర్వాత తన కుమారుడిని చూసి, ఆమె ఆనందంతో పులకించిపోయారు. అతడి తలమీద చేయి ఉంచారు. వీపును, చేతులను తట్టారు. ఇలా అన్నారు – "ఇన్నాళ్ళు భోజనం చేయలేదా? ఎంత చిక్కిపోయావు?" కొద్ది రోజుల తర్వాత తన కుమారుడిని చూసిన తల్లికి కుమారుడు చిక్కిపోయినట్లు కనిపించడం మాతృ వాత్సల్యపు విశేషం. అయితే, సహచరులు కూడా ఆ మాటే అన్నారు. అసలు శ్రీరామ్ లావు కాదు, సన్నము కాదు. అతనిని చూచి సన్నంగా ఉన్నావని అనవచ్చు, పూర్వంకన్నా బాగున్నావని అనవచ్చు. సహచరుల వ్యాఖ్యలలో చింత ఉన్నది, ఆత్మీయత ఉంది. స్వచ్ఛంద సేవకుల దళంలోని సహచరులు ఎవరు వచ్చినా, సాయంత్రం విప్లవ కార్యాలయానికి రావలసిందని శ్రీరామ్ వారిని కోరాడు. ఒక్కొక్కరుగా సహచరులంతా వచ్చారు. రానివారికి ఇతర సహచరులు కబురు అందించారు. సాయంత్రం భవంతిలో ఉన్న కార్యాలయంలో అందరు సమావేశమయ్యారు.

శ్రీరామ్ తన కాశీ యాత్ర గురించి వివరిస్తాడని సహచరులు అనుకున్నారు. అలా జరగలేదు. సమావేశం ప్రారంభం కాగానే, శ్రీరామ్ అక్కడ జరిగిన ఉద్యమ కార్యకలాపాల గురించి అడిగారు. యువ కార్యకర్తలు శ్రీరామ్ ఊళ్ళో లేని సమయంలో కరపత్రాలు పంచారు, పోస్టర్లు అతికించారు. పరిసర గ్రామాలకు వెళ్ళి ప్రజలను సంపర్కం చేశారు. నిరక్షరాస్యులకు అక్షర జ్ఞానం కలిగించారు. సంతకం పెట్టడం నేర్పారు. నివేదిక తీసుకున్న తర్వాత శ్రీరామ్ ఇలా అన్నాడు.

"ఈ నిర్మాణాత్మక కార్యక్రమాలతోపాటు ఆంగ్ల పాలకులకు విరుద్ధంగా కూడా చర్యలు జరపాలి. యువకులలో సంఘర్షించే సాహసం ఉన్నదని ప్రజలకు తెలిసే విధంగా కొన్ని కార్యక్రమాలు నిర్వహించాలి. యువకులు తమను తాము ఆహుతి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని ప్రజలకు తెలియాలి. బలిదానానికి సంసిద్ధత చూసినప్పుడు ప్రజలలో ఉత్సాహం వస్తుంది. కార్యక్రమాలలో పాల్గొనడానికి వారు కూడా నడుం బిగిస్తారు."

## స్వరాజ్య ఉద్యమంలో భాగస్వామ్యం

ఆ రోజులలో భగత్‌సింగ్ జరిపిన విప్లవ చర్యలపై తీవ్రంగా చర్చ జరిగేది. భగత్‌సింగ్ యువకులకు ఆదర్శం అయ్యాడు. సాండర్స్ వధ, అసెంబ్లీలో బాంబు విసరడం, ఆయుధాగారాన్ని లూటీ చేయడం వంటి సంఘటనలు యువకులలో ఉత్సాహాన్ని నింపాయి. మహాత్మాగాంధీ నాయకత్వంలో సాగుతున్న సహాయ నిరాకరణ ఉద్యమం ఈ కార్యకలాపాలకు దూరంగా ఉన్నది. అయినా, ఉద్యమకారులలో పలువురు ఇలాంటి కార్యక్రమాలను ఉధృతం చేయాలని భావించేవారు. ఆవల్‌ఖేడాలోని స్వచ్ఛంద సేవకుల దళం రెండు విధాల కార్యక్రమాలలోను ఆసక్తి చూపసాగింది. ఆ దళం ఆయుధ ప్రయోగానికి దూరంగా ఉన్నది. అయితే టెలిఫోన్ తీగెలు కత్తిరించడం, పోలీసులను వేధించడం, అధికారులను మాయచేయడం వంటి పనులలో వారు తమ తెలివిని ఉపయోగించసాగారు.

దేశభక్తితో పొంగిపొరలే రచనలు చేసే పనిని శ్రీరామ్ ఉధృతం చేశాడు. అతని కవితలు 'సైనిక్' పత్రికలో ఎక్కువగా ప్రచురితం అయ్యేవి. అతని పేరుతోపాటు 'మత్త' అనే పదం జోడించబడింది. అది ఎందుకు జరిగిందో తెలిపే అద్భుత సంఘటన ఉన్నది. సందర్భం వచ్చినప్పుడు దాని వర్ణన జరుగుతుంది.

పట్టణాలలో ఆంగ్ల అధికారులు జరిపే అత్యాచారాలను గ్రామాలలో జాగీర్దార్లు, ఠాకూర్లు, సాహుకార్లు జరిపేవారు. బానిసత్వం ఒక ప్రవృత్తిగా మారింది. దీనికి మూలం తెల్ల అధికారులే, వారి నుండి జనం నేర్చుకున్నారు.

ఆవల్‌ఖేడాలో అవసరం ఉన్నవారికి వడ్డీకి అప్పు ఇచ్చేందుకై ఆగ్రా నుంచి ఒక షావుకారు వచ్చేవాడు. అతని పేరు బిరదీచంద్. గ్రామంలోని కమలసింగ్ అనే రైతు అతడికి ఏజెంటుగా పని చేస్తున్నాడు. వడ్డీల మీద వడ్డీలు పెరిగిపోయి

**ప్రణాళిక బద్ధంగా కొంచెం కొంచెం చదివితే కొండంత కోర్సు కూడా పూర్తి చేయవచ్చు**

– వంద రూపాయలు అప్పు తీసుకున్నవాడు జీవితమంతా వడ్డీ కట్టవలసి వచ్చేది. అసలు సొమ్ము అలాగే మిగిలిపోయేది. కొన్ని కుటుంబాల చిన్నపిల్లలు బిరదీచంద్ ఇంటిలో వెట్టిచాకిరీ చేసేవారు. వారికి తిండీ, బట్ట, పడుకోవడానికి బల్ల మాత్రమే ఇచ్చేవారు. ఒకే గదిలో పలువురిని ఉంచేవారు. ఈ పిల్లలలో పలువురు పొలంలోనే రాత్రింబవళ్ళు శ్రమించేవారు. నాగలి (హల్)తోనే జీవితమంతా గడపడం వల్ల వీరిని 'హాలీలు' అని కూడా పిలిచేవారు. ఆవల్‌ఖేడా పరిసరాలలో ఇలాంటి వెట్టిచాకిరీ చేసే చిన్నపిల్లలు ఆరుగురు ఉన్నారు.

స్వచ్ఛంద సేవకుల దళం విప్లవ పథకాన్ని తయారు చేస్తూ ఉండగా – వారి దృష్టి ఈ వెట్టిచాకిరి పిల్లల మీద పడింది. సమావేశం జరిగింది. ఈ పిల్లలను విడిపిస్తే, దేశీయ పెత్తందార్లకు మంచి గుణపాఠం అవుతుంది. ఆ పిల్లలలో నలుగురు పొలాలలో ఉంటారు, ఇద్దరు సాహుకారు ఇంటిలో ఉంటారు. పొలంలో పనిచేసే పిల్లలు రెండు వేర్వేరు పొలాలలో ఉన్నారు. నత్థూ, వృందావన్, గోపీనాథ్, రామ్‌సరన్ అనే నలుగురు స్వచ్ఛంద సేవకులకు ఈ విముక్తి పని అప్పగించ బడింది. ఈ నలుగురు పలుమారులు ఆ పొలాల చుట్టూ తిరిగారు. వివిధ సమయాలలో వీరిలో వేర్వేరు యువకులు పొలాల లోపలికి వెళ్ళారు. ఆ పిల్లలతో పరిచయం ఏర్పరచు కున్నారు. అక్కడ నుండి బయటపడాలనే కోరిక ఆ పిల్లలకు ఉన్నదో లేదో తరచి చూశారు. వారికి బయటపడాలనే ఉన్నది. అయితే, తాము నిస్సహాయులమని వారు వాపోయారు. ఈ నలుగురు జరిగిన పని నివేదికను శ్రీరామ్‌కు అందజేశారు. వారిని విడుదల చేయడానికి అది సరిపోతుందని చర్చించిన మీదట నిర్ణయం తీసుకున్నారు. వారిలో ఆ కోరిక ఉంటే, ఇతర ఏర్పాట్లు చేయడం ఏమంత పెద్ద విషయం కాదని వారు తీర్మానించారు.

### వెట్టిచాకిరి నుండి పిల్లల విముక్తి

పథకం తొలిదశలో ఒక ఉత్తరం తయారుచేయబడింది. భగత్ సింగ్ బ్రిగేడ్ తరపున ఈ ఉత్తరం వ్రాశారు. వెట్టిచాకిరి పిల్లలను మూడు రోజులలో విడుదల చేయమని ఆ ఉత్తరంలో సేఠ్ బిరదీచంద్‌ను కోరారు. ఇది హెచ్చరిక. విడుదల చేయకపోతే, తర్వాతి చర్య తీసుకుంటామని వ్రాశారు. మూడు రోజుల తర్వాత – 'ఇవాళ రాత్రి పిల్లలను విడుదల చేస్తాం' అని లేఖ వ్రాశారు. రెండు రోజుల తర్వాత మొదటి లేఖ సాహుకారుకు అందింది.

ఆ రోజు రాత్రి నత్థూ, రామ సరన్‌లు ఒక పొలానికి, వృందావన్, గోపీలు మరో పొలానికి వెళ్ళారు. విడిపించడంలో వారికి ఎక్కడా ఆటంకం రాలేదు. ఆ పిల్లలను ఎవరైనా విడిపిస్తారని షావుకారుకు అసలు అనుమానమే కలగలేదు. నత్థూ భగత్‌సింగ్ బ్రిగేడ్ తరపున మరో లేఖ వ్రాశాడు. ఈ పిల్లలు భగత్‌సింగ్ బ్రిగేడ్‌లో చేరారని, వారు స్వేచ్ఛ పొందారని, ఇక ముందు వారు స్వరాజ్యం కోసం పోరాడతారని, వారి కుటుంబాలను వేధించవద్దని, వేధిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆ లేఖలో వ్రాశాడు. మరునాడు ఉదయం పిల్లల నివాసంలో ఒక రాతి క్రింద ఉన్న ఈ లేఖను కమల్‌సింగ్ చదివాడు. ఆ లేఖ తీసుకుని సేఠ్ వద్దకు పరుగెత్తాడు. కానీ ఏమీ ప్రయోజనం, పిల్లలు వెట్టిచాకిరి నుండి విముక్తి పొందారు.

*(సశేషం)*

## పరమార్థంలోని ఆనందం

*సృష్టి యొక్క పునర్నిర్మాతకు వేయి సంవత్సరాల జీవితకాలం లభించింది. రాత్రింబవళ్ళు ఈయన ఈశ్వరుని కార్యక్రమాలలో లీనమై ఉండేవాడు. అంతిమ ఘడియలు దగ్గర పడగానే దేవదూతలు వచ్చి "అయ్యా! విసుగు, విరామం లేకుండా ఇంత ఎక్కువ జీవితకాలాన్ని ఏ విధంగా గడిపేవని?" ప్రశ్నించారు. ఆయన చిరునవ్వు నవ్వి "సోదరులారా! పరమార్థంలోని రసం అతిమధురమైనది. దానిని గ్రోలుతూ జీవించే వ్యక్తికి ఎంత ఎక్కువ జీవిత కాలమైనా క్షణంలో గడిచిపోయినట్లే అనిపిస్తుంది. నాకు వేయి సంవత్సరాలు జీవించడం ఏ మాత్రం విసుగనిపించక పోగా, ఇంత త్వరగా గడిచిపోయిందెలా అని బాధగా ఉంది. అయినా యాత్రికునికి సత్రం యొక్క ఒక ద్వారం గుండా ప్రవేశించి మరొక ద్వారం గుండా బయటకు పోక తప్పదు కదా! చావు పుట్టుకలనేవి కూడా ఇంతే మరి' అంటూ పరలోక ప్రయాణానికై సిద్ధమయ్యాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**ఈ రోజు నుంచి చేసిన తప్పులను నిజాయితీగా ఒప్పుకుందాం**

యుగ నిర్మాణ యోజన

# మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 19

ధర్మము, సదాచారములతో కూడిన ఆదర్శవంతమైన సిద్ధాంతములను నేర్పేందుకు ప్రవచనాలు, రచనలు పనికిరావు అనేది నిర్వివాద సత్యము. ఈ రెండు మాధ్యమాలు చాలా గొప్పవే. అయితే ఇవి అందుకు కావలసిన వాతావరణాన్ని నిర్మించేందుకు మాత్రమే ఉపయోగపడతాయి. **మనం చెప్పే ఆదర్శాలను జీవితంలో పాటించి చూపించినప్పుడే అవి ఇతరులను ప్రభావితం చేయగలుగుతాయి.** ఇవాళ మనం నూతన సమాజము, నూతన ఆదర్శములను ప్రజలలో స్థిరపరచాలను కుంటున్నాము. కాబట్టి యుగనిర్మాణ పరివార సభ్యులందరు ఆచరణ యోగ్యమైన ఆదర్శాలను పాటించి తీరాలి. ఈ సత్సంకల్పాలను ప్రచారం చేసేందుకు ఇది అత్యంత శ్రేష్ఠమైన పద్ధతి. ఇలా చేయకపోతే ప్రజల మనస్సులలో ఉన్నత దిశవైపుకు నడిచేందుకు ప్రేరణనివ్వడం, ప్రభావితం చేయగలగడమనేది అసంభవం. అందుచేత పరివార్ సభ్యులందరు ఈ విషయాన్ని గురించి ఆలోచించి తమ జీవితంలో అవ్యవస్థ, అనైతికత అనే బలహీనతలుంటే వాటిని సరిచేసుకోవాలి. ఆత్మచింతన చేసుకునేటప్పుడు ఏయే దోషాలు కనిపించాయో వాటిని సరిదిద్దుకునేందుకు సరైన ప్రణాళికను తయారుచేసుకొని ముందుకుసాగాలి. ఆత్మచింతన చేసుకోవడానికి మనలో ప్రతి ఒక్కరు ఈ క్రింద ఇవ్వబడిన ప్రశ్నలకు సమాధానాలు వ్రాసుకోవాలి.

1. జీవితమునందలి అమూల్యమైన సమయమును సవ్యముగా సదుపయోగం చేసుకోగలుగుతున్నామా? లేదా? బద్ధకంతో, నిర్లక్ష్యంతో సమయాన్ని వృథా చేసుకుంటున్నామా?
2. జీవిత లక్ష్యమును చేరుకోవాలనే విషయం గుర్తున్నదా? లేదా? శరీర అలంకరణపై ఉన్న మక్కువతో ఇంతటి అమూల్యమైన అవకాశమును చేజార్చుకుంటున్నామా? దేశము, ధర్మము, సమాజము, సంస్కృతి యొక్క సేవ చేయడమనే పరమపునీతమైన కర్తవ్యమును ఉపేక్షిస్తున్నామా?
3. మన ఆలోచనలను, పద్ధతులను ఇతరులను గ్రుడ్డిగా అనుకరించే పద్ధతిపై ఆధారపడి నిర్ణయించుకుంటున్నామా లేక వివేకము, దూరదృష్టి, ఆదర్శవాదములను అనుసరించి నిర్ధారించుకుంటున్నామా?
4. మనోవికారాలను, చెడు సంస్కారాలను నిర్మూలించేందుకు నిరంతరం పోరాడుతున్నామా? లేదా? చిన్న చిన్న కారణాలతో మానసికశాంతిని కోల్పోయి ప్రగతిమార్గములో ఆటంకములను కల్పించుకునే పొరపాటు చేస్తున్నామా?
5. కటువైన సంభాషణ, ఎదుటివారిలోని లోపాలను వెతకటం, అశుభమైన వాటిని ఊహించుకునే అలవాటును వదిలేసి నిరంతరం తృప్తితో, ప్రయత్నశీలురమై ముఖంపై చిరునవ్వును చెదరనీయకుండా ఉంచుకునే అలవాటు చేసుకుంటున్నామా? లేదా?
6. శరీరము, దుస్తులు, ఇల్లు, వస్తువులను స్వచ్ఛంగా, సువ్యవస్థితంగా ఉంచుకునే అభ్యాసమును ప్రారంభించామా? లేదా? శ్రమపడటం అంటే ఇష్టం ఉన్నదా? లేదా?
7. కుటుంబంలోని వారిపై దృష్టి ఉంచి వారిని సంస్కారవంతులుగా తయారు చేసేందుకు అవసరమైన సమయాన్ని కేటాయిస్తున్నామా? లేదా?
8. ఆహారము సాత్వికప్రధానంగా ఉంటున్నదా? చిరుతిండి తినాలనే అలవాటును మానుకుంటున్నామా? లేదా? త్వరగా మేల్కొనుట, అవసరమైన బ్రహ్మచర్యమును పాటించడం వంటి నియమాలు పాటిస్తున్నామా? లేదా?
9. ఈశ్వర ఉపాసన, ఆత్మచింతన, స్వాధ్యాయములకు నియమిత దినచర్యలో స్థానమిచ్చామా? లేదా?
10. సంపాదన కంటే ఎక్కువగా ఖర్చు చేయడం లేదు కదా? దుర్వ్యసనాలేవీ లేవు కదా? ఒకవేళ వాటి నుండి దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నామా?

పైన ఇవ్వబడిన పది ప్రశ్నలను మీకు మీరు ప్రశ్నించుకోండి. అప్పుడు మీరు ఇచ్చే జవాబును గురించి బాగా

**ఓటమిని ఎప్పుడూ ఒప్పుకోవద్దు**

ఆలోచించుకోండి. తప్పులేమైనా ఉంటే సరిదిద్దుకునేందుకు నిత్యం ప్రయత్నించండి.

ఆత్మను సరిదిద్దుకునేందుకు, సంస్కరించుకునేందుకు ఒక క్రమపద్ధతితో కూడిన ప్రణాళికను వేసుకొని ప్రయత్నిస్తేనే సాధ్యమవుతుంది. మనలోని దోషాలను, దుర్గుణాలన్నింటిని ఒక్కరోజుతో విడిచి పెట్టెయ్యాలనే ఉత్సాహము మనుష్యులలో ఒక్కోసారి కలుగుతుంది. కానీ సంకల్పశక్తి లేకపోవడం వల్ల వాళ్ళు ఎంత ప్రయత్నించినప్పటికీ అది చేయలేరు. అందువల్ల కొద్దికాలంలోనే పాత చెడు సంస్కారాలన్నీ తిరిగి వచ్చేస్తాయి. మాట నిలుపుకోలేకపోవడం వల్ల సంకల్పబలం క్షీణిస్తుంది. దానితో చిన్న చిన్న వాగ్దానాలను కూడా అమలు పరచలేరు. ఇలా చాలాసార్లు జరిగిన తరువాత మనిషి యొక్క ఆత్మ విశ్వాసము కూడా బలహీనపడుతుంది. అప్పుడతను ఆలోచించే విధానమే మారిపోతుంది. దానితో మనిషి తనలో అంత బలంగా పాతుకుపోయిన చెడు సంస్కారాల వలన తాను జీవితంలో ఉన్నతస్థితికి ఎదగడం అసంభవమని అనుకుంటాడు. ఆవేశంతో, ఉత్సాహంతో తమ దోషములను, దుర్గుణములను తక్షణమే త్యజించేస్తామని ఎవరు ప్రతిజ్ఞలు చేస్తారో వారు ఇటువంటి నిరాశకు, నిస్పృహకు లోనవుతారు. మనోబలం తగ్గిపోవడం చేత చిరకాలంగా పేరుకుపోయిన చెడు సంస్కారాలతో వ్యక్తి పోరాడలేడు.

ఆత్మశోధన అనే పని ఒకరకంగా చూస్తే దేవాసుర సంగ్రామం వంటిది. చెడు సంస్కారాలతో నిండిన అసురీ ప్రవృత్తులు గుమిగూడి ఒకచోట కూర్చున్నాయి. అవి సుసంస్కారములను ధారణ చేసేందుకు మనం చేసే అన్ని ప్రయత్నాలను నిష్ఫలం చేసేందుకు అనేక మాయోపాయాలు, మోసాలు చేస్తుంటాయి. అయినా సరే మనం వెనుదిరగకుండా ముందుకుపోవాలి. కొద్దిపాటి జాగ్రత్తతో వ్యవస్థీకృతమైన ప్రణాళికను సిద్ధం చేసుకొని దుర్గుణాలను ఓడించేందుకు ప్రయత్నించాలి. ముందు మీరు మీ చెడు అలవాట్లను, బలహీనతలను ఒక కాగితంపై వ్రాసుకొని ఉంచుకోండి. ప్రతిరోజు ఉదయాన్నే లేచి ఆ రోజు ఏదో ఒక బలహీనతను కొద్దిగానైనా తగ్గించుకునేందుకు తోడ్పడే కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. ఆ కార్యక్రమాన్ని గురించి ఆలోచించేటప్పుడు ఆ రోజు ఎప్పుడు, ఎన్ని, ఏయే కుసంస్కారాలు బలంగా ఉండేందుకు అవకాశం ఉందో గమనించుకోవాలి. ఆ బలహీన క్షణం ఎదురైనప్పుడు కొద్దిగా ఆదర్శములను పాటించాలని నిర్ణయించుకోవాలి. ఆ తరువాత ఆ రోజు మొత్తం తీసుకున్న నిర్ణయాన్ని అమలుపరచాలి. ఈ విధంగా చేస్తూ ఉంటే ప్రతిరోజు కొద్దికొద్దిగా ఆత్మను సంస్కరించుకోవడమనే లక్ష్యమును సాధించడములో విజయం పొందగలుగుతాము. సాహసం కూడా కొద్దికొద్దిగా పెరుగుతుంది. దోషాలన్నీ మెల్లిమెల్లిగా సమసిపోవడం జరుగుతుంది.

## చిన్న సంకల్పం - పెద్ద విజయం

ఈరోజు కొద్దిగానే ఆహారం తీసుకుంటాను, వ్యాయామం చేస్తాను, బ్రహ్మచర్యం పాటిస్తాను, బీడి, సిగరెట్‌లాంటివి రోజూ కంటే కొంచెం తక్కువ త్రాగుతాను, కొద్దిసేపు భజన, స్వాధ్యాయం చేస్తాను లాంటి చిన్నచిన్న సంకల్పాలను మీరు ప్రతిరోజు ఉద్యోగ వ్యాపారాలకై ప్రయాణాలు చేసే కొద్దిపాటి సమయంలోనైనా నెరవేర్చుకోవచ్చు. కానీ ఆరోజు వాటిని చాలా క్రమశిక్షణతో కఠినంగానే పాటించాలి. రెండవరోజు పరిస్థితిని అనుసరించి ఆరోజుకు తగిన మార్పులు దినచర్యలో చేసుకోవచ్చు. ఈ సమయంలో శారీరిక కార్యకలాపాలలోనే కాకుండా, మానసిక కార్యకలాపాలలో కూడా మార్పు తెచ్చుకోవాలనే విషయం మరచిపోకూడదు. ప్రతిరోజు చిన్న చిన్న విజయాలను పొందుతూ ఉంటే మనోబలం బాగా వృద్ధి చెందుతుంది. ఇలా వృద్ధి చెంది చెంది కొన్ని రోజుల తరువాత ఆత్మశోధనను కొన్ని రోజులే కాదు జీవితాంతం పాటిస్తామని నిర్ణయించుకున్నా చాలా తేలికగా పాటించవచ్చు.

ప్రతిరోజు ఆత్మచింతనతో కూడిన దినచర్యను నిర్ణయించుకునేందుకు ఒక నిర్ధారిత సమయాన్ని కేటాయించుకోవాలి. ఇందుకు ఉదయాన్నే లేవగానే బహిర్భూమికి (toilet) వెళ్ళక ముందు ఉండే సమయాన్ని కేటాయించుకుంటే బావుంటుంది. కొందరు లేచాక చాలా ఆలస్యంగా వెళతారు కనుక ఆ సమయం ఇందుకు అనుకూలంగా ఉంటుంది. ఇందుకై వీలునుబట్టి సమయాన్ని కేటాయించుకోవచ్చు. కానీ పైన చెప్పిన సమయం తీరికలేని పనులు ఉండే వారికి కూడా అనుకూలంగానే ఉంటుంది. ఈ రెండు ప్రక్రియల ద్వారా ఆత్మిక ప్రగతి అనే మార్గంలో సునాయాసంగా ముందుకు సాగవచ్చు.

**చేయవలసిన పనిని వాయిదా వేస్తే రావలసిన ఫలితం కూడా వాయిదా పడుతుంది**

## మరి ఇప్పుడు మనమేం చేయాలి?

ఈ వ్యాసాలను చదివిన తరువాత మీ మనస్సులోను, అంతఃకరణలోను దేశము కొరకు, ధర్మము కొరకు, సంస్కృతి కొరకు, మీ కొరకై మీరు ఎంతో కొంత చేయాలనే ఉత్సాహము జాగృతమయ్యే ఉంటుంది. అసలు ఇప్పుడు మేమేం చేయాలి? అని మీరు ఆలోచిస్తుంటారు. గాభరాపడకండి. శ్రేష్ఠమైన జీవితం గడిపేందుకు నిత్యజీవితమును చిక్కుల మయం చేసుకోనక్కర లేదు. సరళంగా, సహజంగా జీవిస్తూ కూడా మీరు సుఖశాంతులను పొందవచ్చు. వ్యక్తిత్వము యొక్క సంపూర్ణ వికాసము కొరకు మూడు విధానాలు అవలంభించాలి. 1.ఉపాసన 2. సాధన 3. ఆరాధన

ఉపాసన కొరకు ప్రతిరోజు ప్రాతఃకాలంలో స్నానాదులు పూర్తయ్యాక 15 నిముషాలు లేదా అరగంట సమయాన్ని కేటాయించుకుంటే సరిపోతుంది. దైవమందిరంలో ఈశ్వర సాన్నిధ్యంలో కూర్చొని దైవీశక్తుల యొక్క ఆశీర్వాదము, వారి కృప మనపై వర్షిస్తున్నదని, తద్వారా మనలోపల దైవత్వము వికసిస్తున్నదనే భావనను అనుభూతి చెందాలి. మీకు ఏ దేవత పట్ల, ఏ ఉపాసనయందు ఇష్టము, శ్రద్ధ ఉన్నాయో ఆ దైవీ గుణములు మీ లోపల వృద్ధి చెందుతున్నాయని భావించాలి. సాధనను ప్రతిక్షణం చేస్తూ ఉండాలి. జ్ఞానము, వివేకము అనే జ్యోతులను మన అంతరంగంలో నిరంతరం ప్రజ్వలింప చేసుకుంటూ ఉండాలి. నీచస్థాయికి దిగజారి పోకుండా మనలను మనం రక్షించుకుంటూ ఉన్నతస్థితికి ఎదిగేందుకు కావలసిన మనోబలాన్ని పెంపొందించుకోవాలి. **దుర్గుణముల నుండి దూరంగా ఉంటూ సద్గుణములను పెంపొందించు కునేందుకు తగిన సామర్థ్యమును పెంచుకోవాలి.** ఇదే సాధన యొక్క స్వరూపము. ఇందుకొరకు ప్రతిక్షణం మనలో మనమే తర్కించుకుంటూ, జాగృతపరచుకుంటూ ఉండడం తప్పనిసరి. దేశము, సమాజము మరియు సంస్కృతిని ఉన్నతం చేసేందుకు చేసే సేవాకార్యాన్ని ఆరాధన అంటారు.

పతనమును ఎదిరించి పోరాడటం అన్నింటికంటే గొప్ప సేవ. వ్యక్తి యొక్క ఆలోచనలలో ఉన్న వికృతమైన, అవాంఛ నీయమైన భావములన్నీ నిర్మూలించినప్పుడే సేవాసాధన ద్వారా రక్షింపబడడమనేది సంభవమవుతుంది. సేవ అనేది ఒక కోరిక. ఇది పూర్తిచేయాలంటే అత్యున్నతమైన శ్రద్ధ కావాలి. అందువల్ల ఈ స్థాయిలోనే సేవా కార్యక్రమం మొదలుపెట్టి కొనసాగిస్తూ ఉండాలి.

ఏ స్థాయిలో సేవాసాధన ఎలా చెయ్యాలి? అనే ప్రశ్న మీకు రావచ్చు. మానవుడు పతనం కాకుండా ఎలా ఆపగలగాలి? అక్కడి నుండి ముందుకు ఎలా తీసుకుపోగలం? అంటే ఆలోచనలు, భావనలను సంస్కరించడం వల్లనే ఈ పని సాధ్య మవుతుంది. దీని కోసం ఆలోచనలను సంస్కరించడమనే ప్రక్రియను మొదలుపెట్టాలి. ప్రగతిశీలమైన, ఉన్నతమైన సదాలోచనలను ప్రజలందరి వద్దకు చేర్చాలి. ఇప్పుడు సమాజంలో అమంగళకరమైన, అవాంఛనీయమైన పరిస్థితులే వైతే మనకు కనిపిస్తున్నాయో వాటికి ప్రజల యొక్క వ్యక్తిగత దోషాలే కారణమనేది సత్యం. ఈ దోషములన్నీ వ్యక్తిలో ఉన్న చెడు ఆలోచనలు, వికృతమైన దృష్టికోణం వల్లనే ఉత్పన్న మవుతాయి. భోగ ప్రధానమైన కోరికల వలన మనిషిలో అసంతృప్తి పెరిగిపోతుంది. అతను అత్యధికంగా సుఖసామగ్రిని పొందాలని కోరుకుంటాడు. స్వార్థం వలన మోసం, అబద్ధాలు, అవినీతి పెరిగిపోతాయి. ప్రజలకు కష్టపడకుండా ఆనందం అనుభవించాలనే కోరిక పెరిగిపోయినప్పుడు ఉచితాను చితములను వదిలివేసి చెడు మార్గంలోకి వెళ్ళిపోతారు. దీనివల్ల స్వయంగా వారు నష్టపోవడమే కాకుండా సమాజానికి కూడా హాని చేసినవారవుతారు. దూరదృష్టిలేని ఇటువంటి పనుల వలన ప్రపంచంలో దుఃఖము, దైన్యము విపరీతంగా పెరుగుతున్నాయి.

మనిషి పతనోన్ముఖుడు కాకుండా నివారించాలంటే అతని ఆలోచనావిధానం మార్చక తప్పదు. అలా మారాలంటే అతనికి జీవితమును చాలా ఉన్నతంగా చూడడం అలవాటు చెయ్యాలి. నీచమైన భావాలున్న వ్యక్తికి ఆత్మగ్లాని వల్ల వచ్చే బాధలు, వ్యక్తిత్వము కళంకితమవడం వల్ల వచ్చే అగౌరవము వంటివేవీ కష్టంగా అనిపించవు. సిగ్గులేకుండా చెడు పనులు చేస్తూనే ఉంటాడు. మానవుని యొక్క మానసిక స్థాయి ఎదిగినప్పుడు జీవితంలో శ్రేష్ఠత్వమనేది వస్తుంది. దీని ఆధారంగానే ప్రపంచ శాంతికి అవసరమైన మంగళకర పరిస్థితులు ఏర్పడతాయి.

ఈనాడు మానవ సభ్యత బాగా వికసించింది. దానితోపాటే మానవుడు మంచి ఆలోచనాపరుడిగా కూడా తయారయ్యాడు. కనుక అతనికి ఈ సత్యాలను అర్థమయ్యేలా వివరిస్తే విని

**శ్రమించడానికి సదా సిద్ధంగా ఉండాలి**

అర్థం చేసుకొని అంగీకరిస్తాడు. లోకసేవాపరాయణులు ఈ ప్రయోజనం నెరవేర్చేందుకై ఇంటింటికీ వెళ్ళాలి. ప్రజల విశ్వాసాలను, నమ్మకాలను, ఆలోచలనలను సంస్కరించేందుకు ప్రయత్నించాలి.

ప్రతివ్యక్తి మనం చెప్పిన సత్యాలను ఉన్నవి ఉన్నట్లుగా అర్థం చేసుకునేంత బుద్ధిని, ప్రతిభను కలిగి ఉండకపోవచ్చు. అంతేకాదు ఏయే పరిస్థితులలో ఏం చెయ్యాలనే విషయంపై మార్గదర్శనం కూడా చేయలేకపోవచ్చు. అందువల్ల తేలికగా అర్థమయ్యే సాహిత్యము ద్వారా ఆలోచనా విధానమును మార్చేందుకు ప్రయత్నించాలి. ఆ సాహిత్యమును తీసుకొని వెళ్ళి వారిచేత చదివించి దాని గురించి వారు ఆలోచించేలా ప్రేరణ ఇవ్వాలి. ఎక్కడైనా చదువు రానివారుంటే వారికి చదివి వినిపించడమో లేదా సాధారణమైన పలకరింపుల ద్వారానే వారికి ప్రేరణ ఇవ్వడమో చేయాలి. ప్రారంభంలో అందరికీ ఈ సాహిత్యము పట్ల అభిరుచి కలుగదు. ఈ జ్ఞానయజ్ఞం యొక్క ఆవశ్యకతను ఎవరైతే అర్థం చేసుకుంటారో వారే ఇలాంటి ఆలోచనా విధానమున్న సాహిత్యమును తీసుకొని స్వయంగా బయలుదేరాలి. దాహం వేసిన వ్యక్తి వద్దకు బావి రాదు. అతనే బావి వద్దకు వెళ్ళాలి. ఎండాకాలంలో నీటి సమస్య ఉత్పన్నమైనప్పుడు మేఘాలే ప్రతి ప్రదేశానికి వెళ్ళి వర్షాన్ని కురిపించక తప్పదు కదా! లోక సేవకులైన వారు కూడా సదాలోచనల, సత్ప్రేరణల వల్ల లభించే అతి చల్లని సుఖానుభూతితో కూడిన వర్షపు జల్లులను కురిపించేందుకై ప్రతివ్యక్తి వద్దకు వెళ్ళాలి. అందుకొరకు ప్రజలందరిలోను సదాలోచనల పట్ల శ్రద్ధను ప్రేరేపించాలి. అలా శ్రద్ధను కలిగించగలిగితేనే ఈ పని కొరకు ప్రతివ్యక్తిని కలవడం సాధ్యమవుతుంది. ఆ తరువాత మంచి ఆలోచలను, మంచి ప్రేరణలను వారికి నేర్పించాలి. ఇందుకు సాహిత్యము, క్రింద సూచించబడిన సేవాకార్యముతో మనం తలపెట్టిన ఈ పనిని పూర్తిచేస్తాము.

## శ్రీరామ్ సంచీ గ్రంథాలయము

మనకు ఆలోచనలలో క్రాంతి అనేది మొట్టమొదట ఎంతో అవసరమైన జ్ఞానయజ్ఞము. ఇది ఈ యుగంలో అన్నింటికంటే గొప్ప పుణ్యకార్యము. ఈనాటి పరిస్థితులలో జ్ఞాన దానమునకు మించిన దానం మరేదీ లేదు. జ్ఞానసాధనే ఈ యుగములో అన్నింటికంటే పెద్ద సాధన.

**ఈనాటి పరిస్థితులలో యుగమును మార్చి తీరాలి అనే బలమైన ప్రేరణను ఇంటింటికీ, వ్యక్తివ్యక్తికీ చేర్చేందుకు సరైన ఉపాయమే శ్రీరామ్ సంచీ గ్రంథాలయము. ఎవరు ఆలోచనా పరులో, ఎవరి మనస్సులో దేశము, ధర్మము, సమాజమును గురించిన బాధ ఉంటుందో; ఎవరు మానవీయ ఆదర్శములు పుష్పించి, పల్లవించాలని కోరుకుంటారో; ఎవరు సుందరమైన, సువ్యవస్థితమైన నవయుగానికి ఆకర్షితులవుతారో వారు శ్రమ అనుకోకుండా జీవన సాహిత్యమును తమ సంచిలో ఉంచుకొని తాము చదివి, విద్యావంతులందరిచేత చదివించాలి. ఎక్కడైనా చదువురాని వారుంటే వారికి చదివి వినిపించాలి.**

1. ఈ సంచీ గ్రంథాలయమమనేది సాహితీ అమృతాన్ని పంచేందుకు, ఈ ప్రకాశాన్ని అందరిలో నింపి శుభం చేకూర్చేందుకు మొదలుపెట్టబడిన ఒక గొప్ప ఉద్యమము. ఈ ధర్మకార్యము వల్ల అపరిమితమైన దానాలు చేసిన ఫలితం, లెక్కలేనంత పుణ్యఫలం చేకూరుతాయి. దీనిద్వారా మనం ఆత్మ యొక్క ఆకలిని, అంతఃకరణ యొక్క దాహమును తీర్చి ఎంత పుణ్యమును జమ చేసుకుంటున్నామంటే దీని ముందు కొన్ని కోట్లమందికి అన్నదానం చేసిన ఫలితము, కొన్ని లక్షల గజాల వస్త్రమును దానం చేసిన ఫలితం కూడా సరితూగదు.

## ఏం చెయ్యాలి? ఎలా చెయ్యాలి?

1. ఇప్పటివరకు ప్రజ్ఞా లఘు పుస్తకమాలలు, క్రాంతిధర్మీ సాహిత్యము, ఇంకా చిన్న చిన్న పాకెట్ పుస్తకాలు అచ్చు వేయబడి ఉన్నాయి. పరిజనులకు మా సలహా ఏమంటే మీరు శ్రీరామ్ సంచీ గ్రంథాలయము స్థాపించుకునేందుకు 12 మంది సభ్యులను తయారు చేసుకోండి. మీకు నచ్చిన పుస్తకాల సెట్‌ను కొనేందుకు పోస్టు ఖర్చులతో కూడా కలిపి ఎంతవుతుందో గాయత్రీ చేతనాకేంద్రము, హైదరాబాదు వారిని సంప్రదించండి.

2. ఉదాహరణకు గాయత్రీ చేతనాకేంద్రము, మూసాపేట అనే పేరుతో డబ్బు పంపి 100 ప్యాకెట్ల పుస్తకాల సెట్‌ను విడివిడిగా తెప్పించుకున్నారనుకోండి. ఇందులోనుండి వేర్వేరు అంశాలకు సంబంధించిన 8-8 పుస్తకాలను కలిపి 12 సెట్లుగా తయారు చేసుకోండి.

3. సభ్యుడి నుండి తగిన సొమ్మును తీసుకొని 8 పుస్తకాల సెట్‌ను అతనికి ఇవ్వండి. ఈ విధంగా 12 మంది సభ్యులను

**చేయవలసిన పనులను వాయిదా వెయ్యకండి**

తయారుచేసుకోండి. సభ్యులందరు దగ్గరదగ్గరగా అంటే ఒకే కార్యాలయంలో పనిచేసేవారు కానీ, ఒకే వీధిలో ఉండే దుకాణదారులు కాని, ఒకే బజారులో ఉండేవారు కానీ అయితే పుస్తకాలు ఇచ్చిపుచ్చుకునేందుకు సౌకర్యంగా ఉంటుంది.

4. సభ్యులుగా చేరే సమయంలో వారి నుండి మీరు పుస్తకాలు కొనేందుకై వెచ్చించిన ధనం నుండి కొంత డబ్బు తీసుకొని పుస్తకాలను నెలలోగా చదివి ఇస్తే మరో సెట్‌ను చదివేందుకు ఇస్తామని చెప్పాలి. ఈ ప్రకారంగా వారు తక్కువ ఖర్చుతో సుమారు 150 రూపాయలు ఖరీదు చేసే పుస్తకాలను సంవత్సరంలోగా చదవగలుగుతారు. ఈ ప్రణాళికను అమలు పరచేందుకు ముందుగా మీరు కొంత పెట్టుబడి పెట్టవలసి ఉంటుంది. కానీ సభ్యులు చేరిన వెంటనే ఆ డబ్బు మీకు తిరిగి వచ్చేస్తుంది.

5. సభ్యులందరికీ ప్రతినెలా పుస్తకాల సెట్టును మార్చి ఇచ్చేందుకు ఒక పద్ధతిని అవలంభించవచ్చు. పుస్తకాలయము ను నడిపే సభ్యుడు తాను ప్రతి నెలా పుస్తకాలు ఇచ్చే సభ్యుల సంఖ్యను పుస్తకాల సెట్టు మీద సభ్యుని సంఖ్య 1, సభ్యుని సంఖ్య 2, సభ్యుని సంఖ్య 3, సభ్యుని సంఖ్య 4 ... ఇలా వేసుకుంటూ చివరిగా సభ్యుని సంఖ్య 12 అని వేసి ఒకరిది మార్చి మరొకరికి ఇవ్వాలి.

6. కొంతమంది పరిజనులు అలా చదివిన పుస్తకాలను కొనుక్కోవాలనుకుంటారు. అలాంటివారికి వేరే పుస్తకాల సెట్టును తెప్పించి ఇవ్వాలి. ఒక్కొక్కసారి కొన్ని పుస్తకాలు పోతుంటాయి. అప్పుడు వాటి మూల్యమును తీసుకొని వెంటనే పుస్తకాన్ని తిరిగి పెట్టేసుకోవాలి. ఇందుకొరకు వేరుగా కొన్ని సెట్లు ఉండాలి. ఈ పద్ధతి ద్వారా పనిచేస్తే ఒక్కొక్క సోదరుడు, ఒక్కో సోదరి 1000 మంది సభ్యులున్న శ్రీరామ్ సంచీ గ్రంథాలయాన్ని తయారు చేయవచ్చు.

(సమాప్తం)

## నిజమైన మానవతావాది ఘన్‌శ్యామ్‌దాస్ బిర్లా

*ఒకరోజు ఘన్‌శ్యామ్‌దాస్ బిర్లా తన కార్యాలయానికి కారులో వెళ్తున్నారు. కార్యాలయానికి సకాలంలో చేరుటకై డ్రైవరు కారును వేగంగా నడుపుతున్నాడు. దారిలోని చెరువు వద్దకు కారు చేరుకునేసరికి అక్కడ జనం గుమిగూడి ఉండుట చూసి, డ్రైవరు కారువేగాన్ని తగ్గించాడు. కారులోనున్న బిర్లా ఎందుకు ఇంతమంది గుమిగూడారని డ్రైవరును ప్రశ్నించారు. డ్రైవరు కారుదిగి చూసి "అయ్యా! ఎవరో పిల్లవాడు చెరువులో మునిగిపోతున్నాడు" అని జవాబిచ్చాడు. వెనువెంటనే ఘన్‌శ్యామ్‌దాస్ బిర్లా కారు దిగి ప్రజల గుంపులోనుండి దారి చేసుకుంటూ చెరువుగట్టుకు చేరుకున్నారు.*

*అచ్చటి సన్నివేశాన్ని చూశారు. సుమారు పది సంవత్సరాల వయస్సుగల బాలుడు నీట మునుగుతూ కాళ్ళు చేతులు కొట్టుకుంటున్నాడు. చెరువు గట్టుపైనున్న వారిలో ఒక్కరు కూడా ముందుకు వచ్చి బాలుని రక్షించే ప్రయత్నాలు చేయక చోద్యం చూస్తున్నారు. పై పెచ్చు రక్షించండి-రక్షించండి అని కేకలు వేస్తున్నారు. ఘన్‌శ్యాందాస్ బిర్లా మేజోళ్ళతోనే నీళ్ళలో దిగి ధైర్యంగా బాలుని సమీపించి వానిని పట్టుకుని నీటి వెలుపలికి లాగి ఒడ్డుకు చేర్చారు, వెనువెంటనే బాలుని సమీపంలోని వైద్యశాలలో చేర్పించి, బాలుడు త్రాగిన నీటిని వెలికి కక్కించి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు. ఆ తడిసిన వస్త్రాలతోనే బిర్లా తన కార్యాలయానికి చేరుకున్నారు. ఈయనను ఈ స్థితిలో చూచి కార్యాలయ సిబ్బంది ఆశ్చర్యానికి లోనయ్యారు. తరువాత బిర్లా బాలుని ప్రాణాలు రక్షించాడని తెలిసికొని వారంతా ముక్తకంఠంతో బిర్లాను అభినందిస్తూ "అయ్యా! మీరు చాలా గొప్పవారు" అన్నారు. దానికి సమాధానంగా "దీనిలో గొప్పతనం ఏమి లేదు. అది నా కర్తవ్యం! దానిని నిర్వర్తించాను అంతే!" అన్నారు బిర్లా. వాస్తవంగా మానవత్వం అన్నింటికన్నా గొప్పధర్మం. ఎవరైతే తన స్వంత పనులనన్నింటిని అవసరమయినప్పుడు ప్రక్కనపెట్టి మానవతా ధర్మాన్ని పాటిస్తారో వారే నిజమైన మానవులు.*

*- 'వార్త' హిందీ దినపత్రిక సౌజన్యంతో*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**ఎవరికి హాని తలపెట్టకూడదు**

టీచర్స్‌డే ప్రత్యేకం

# ఆధునిక ఋషి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

1947వ సంవత్సరంలో డా॥ రాధాకృష్ణన్ భగవద్గీతపై ఒక అద్వితీయ టీకా తాత్పర్యాన్ని వ్రాశారు. దీనిని ముద్రణకై పంపించే ముందు, ధర్మ, ఆధ్యాత్మిక మరియు రాజనీతికి సంగమమైన మహాత్మాగాంధీగారికి చూపెట్టదలచారు. దీనికై ఆయన ముందస్తుగా గాంధీగారి అనుమతిని పొందుట సముచితమని తలచి, పుస్తకాన్ని తీసుకొని గాంధీగారి వద్దకు వెళ్ళారు. గాంధీజీ ఆ వ్రాతపతిని తెరచి చదవకుండానే దీనిలో ఎటువంటి అనుచితమైనవి ఉండనని నా విశ్వాసం అన్నారు. కాని నా అనుమతిని కోరుతూ వచ్చావు కాబట్టి, నాకు జిజ్ఞాస కలిగించే దానికి సమాధానం ఇవ్వాలి అని అన్నారు.

గాంధీగారి నోటి నుండి విన్న మాటలకు, రాధాకృష్ణన్ సంకోచంలో పడ్డారు. దీనిని గమనించిన గాంధీజీ ఆయనతో ఇలా అన్నారు! "మీరు సంకోచించవద్దు. ఈ సమయంలో నేను ఈ ధరాతలంపై అర్జునుని పాత్రలోనున్నట్లు, మీరు కృష్ణుని పాత్రధారిలా నాకు కనపడుతున్నారు. నా ఈ జిజ్ఞాసకు మీరు మాత్రమే సమాధానమివ్వగలరు"

గాంధీజీ యొక్క జిజ్ఞాసకు తగిన సమాధానమిచ్చుటకై రాధాకృష్ణన్ సంసిద్ధుడు కాగా, వారిరువురిమధ్య తర్కమీమాంసలు సాగాయి. రాధాకృష్ణన్‌గారు ఇచ్చిన సమాధానాలతో సంతుష్టుడైన గాంధీజీ, భగవద్గీత వ్యాఖ్య ముద్రణకు తన ఆమోదాన్ని తెలిపారు.

మద్రాసు పట్టణానికి 40 మైళ్ళ దూరంలో తిరుత్తణి గ్రామం ఉన్నది. ఈ గ్రామానికి రాధాకృష్ణన్‌గారి పూర్వీకులు సర్వేపల్లి నుండి వలస వచ్చారు. వారి వృత్తి పౌరోహిత్యం. సర్వేపల్లిలో ఈ వృత్తి సరిగ్గా సాగనందున, వారి పూర్వీకులు జీవనోపాధిని వెతుక్కుంటూ తిరుపతిదిశగా వచ్చి, సమీపంలోని గ్రామమైన తిరుత్తణిలో స్థిరపడ్డారు. రాధాకృష్ణన్ ఈ కుటుంబంలో 5 సెప్టెంబర్, 1888లో జన్మించారు.

రాధాకృష్ణన్ 12 సంవత్సరాల వయస్సు వరకు ఆ గ్రామంలోనే ఉన్నాడు. ధర్మ శాస్త్రాలలో ప్రసిద్ధ విద్వాంసుడైన తండ్రి వద్దనే ఉంటూ అక్షర జ్ఞానాన్ని పొందుతూ తద్వారా శాస్త్రగ్రంథాలను అధ్యయనం చేశారు. కుటుంబం ద్వారా ఆయనకు భౌతిక సంపదలేవి లభింపకపోయినా, ధర్మ-నిష్ఠ, జిజ్ఞాస, భగవద్భక్తి, మున్నగువానిని వారసత్వంగా పొంది, ఆ విరాట్ స్వరూపుని అనుగ్రహంతో లభించిన ఆత్మిక సంపత్తిని, భావనాత్మకతల ఆధారంగా ఒక అతి సామాన్య బాలకుడు, ఇంతింతై వటుడింతై అన్న రీతిలో దేశ ప్రథమ పౌరునిగా, రాష్ట్రపతి పదవిని అలంకరించి దానికి వన్నె తెచ్చిన కార్యదక్షుడు, ఆదర్శ జీవి. తండ్రియైన శ్రీ వీరస్వామి, కుమారునికి తనకు అందుబాటులోనున్న అక్షరజ్ఞానం మొదలు, శాస్త్రాభ్యాసం వరకు శిక్షణనిచ్చాడు. తదుపరి ఉన్నత శిక్షణకై ప్రయత్నంలో భాగంగా, తనకు గల క్రైస్తవ మిషనరీల పరిచయాన్ని ఉపయోగించి, కుమారునికి మిషనరీ కళాశాలలో ప్రవేశాన్ని కల్పించాడు. దీని వెనుక ఒక పరమార్థం ఇమిడి ఉన్నది. రాధాకృష్ణన్ బాల్యము నుండి భారతీయ ధర్మశాస్త్రాల సారాన్ని, భారతీయ తత్వజ్ఞానాన్ని ఆకళింపు చేసికొన్నాడు, తన కుమారునికి క్రైస్తవమత ధర్మసారాన్ని, పాశ్చాత్య జీవన విధానాన్ని కూడా దర్శింపజేయుట మంచిదని మిషనరీ పాఠశాలలో తండ్రి ప్రవేశం కల్పించాడు.

అటుపై ఎఫ్.ఎమ్. డిగ్రీకై శిక్షణ నిమిత్తం వెల్లూరులోని ఊరహీజ్ కళాశాలలో చేరదామని బయలుదేరి, చివరకు మద్రాసులోని క్రిస్టియన్ కళాశాలలో ప్రవేశించాడు రాధా కృష్ణన్. ఆ రోజులలో క్రిస్టియన్ శిక్షణా సంస్థల ప్రధాన ఉద్దేశ్యము, విద్యార్థుల మనస్సులలో, హిందూ ధర్మం మరియు భారతీయ సంస్కృతి పట్ల అయిష్టత పుట్టించి, తద్వారా క్రైస్తవ మతం పట్ల మరియు పాశ్చాత్య సభ్యత సంస్కారాల పట్ల మక్కువ పెంచేలా చేయటమే. రాధాకృష్ణన్ ఎదుట ఇదే పరిస్థితి ఎదురై ఆయన ప్రగాఢ విశ్వాసాలపై తీవ్రంగా ప్రభావాన్ని కలిగించింది. కాని ఆయనలోని దృఢతరమైన వ్యక్తిత్వం బాల్యం నుండి పాదుకొల్పబడిన సంస్కార పరిపక్వత వలన చలించక, దుర్భేద్యంగా నిలబెట్టింది ఆయనను.

**విజయానికి కావలసినది సరైన సదుపాయాలు కాదు, సరైన దృక్పథం**

ఇట్టి పరీక్షలకు ఎదురొడ్డి నిలచిన ఆయనను ఆర్థిక సమస్యలు పీడించసాగాయి. ఇంటివెలుపల, అదీ పట్టణ నివాసంతో కూడిన ఖర్చు, ఖరీదైన విద్య, కుటుంబ ఆర్థిక స్థితి, ఇవన్నీ రాధాకృష్ణన్‌ను స్థిమితంగా ఉండనివ్వలేదు. దీని వలన ఆయన ఆచితూచి అడుగువేస్తూ జ్ఞాన సముపార్జనతో కూడిన తన విద్యాభ్యాసాన్ని ఒక తపస్సుగా మార్చుకున్నాడు. తనకన్నా చిన్న తరగతుల వారికి విద్యాబోధన చేస్తూ తన ఆర్థికస్థితిని మెరుగుపరచుకొనేందుకు మార్గాన్ని చేపట్టిన వివేక సంపన్నుడు, దృఢ సంకల్పశాలి. అదే సమయంలో స్వామి వివేకానందుడు మద్రాసు నగరాన్ని సందర్శించాడు. వివేకానందుని ప్రవచనాలు, యువకుడైన రాధాకృష్ణన్‌పై విశేష ప్రభావాన్ని కలిగించాయి. దీనితో ధర్మనిష్ఠల పట్ల జిజ్ఞాస, ఆలోచనల తీవ్రత రాధాకృష్ణన్‌కు పెరిగింది. వివేకానందుని అద్భుత ప్రవచనాలు, రాధాకృష్ణన్‌పై తిరుగులేని ప్రగాఢ ముద్రను వేయుటతో, క్రైస్తవ మిషనరీల మత ప్రచార ప్రభావం ఆయనపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయింది.

స్వామి వివేకానందుని ప్రవచనాలు ఎంతటి తీవ్ర ప్రభావాన్ని రాధాకృష్ణన్‌పై చూపించాయంటే, ఆయన తన తదుపరి శిక్షణకై దర్శన శాస్త్రాలను అభ్యసించాడు. ఎమ్.ఎ.లో పరిశోధనకై వేదాంత విషయాన్ని ఎన్నుకొని, అనేక పరిశోధనా వ్యాసాలను వ్రాసి 20 ఏళ్ళ వయస్సులో ఎమ్.ఎ. పరీక్షలో ఉత్తీర్ణుడైనాడు. రాధాకృష్ణన్‌లోని అసమాన ప్రతిభను గుర్తించిన ఆయన శిక్షకుడైన ఆచార్య శ్రీ ఎ.జి.హాగ్ ఒక ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని కూడా ఇచ్చారు.

అటుపిమ్మట 1908లో ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కళశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవినలంకరించి, విద్యార్థులకు తర్కశాస్త్రంలో విద్యాబోధన చేశారు. రాధాకృష్ణన్ తన లక్ష్యాన్ని నిర్ధారించుకొని, భారతీయతత్వ దర్శనాన్ని ప్రపంచానికి పరిచయం చేయుటకై ఒక భవనాన్ని నిర్మించ సంకల్పించాడు. ఆ సమయంలో ఆ కాలంలో దేశంలోని క్రైస్తవ మిషనరీల పాఠశాలలో, కళాశాలలో, హిందూధర్మంపైన, సంస్కృతి సభ్యతలపైన ప్రజలకు (హిందువులకు సైతం) నమ్మకం సడలేలా శిక్షణలో భాగంగా విమర్శలు చేసేవారు. వీటిని విన్నంతనే రాధాకృష్ణన్ హృదయం రగిలిపోయేది. ఇతర అధ్యాపకులు వేసే ప్రశ్నలకు, ఆయన యదార్థస్థితిని తెలుపుతూ సముచిత రీతిని సమాధానాలు ఇచ్చేవాడు. దీనితో ఆ ఉపాధ్యాయుల నోళ్ళు మూతపడేవి. సముచిత వ్యవస్థ ఆధారంగా హిందూ నమ్మకాలపై ఉన్న మూఢత్వాన్ని తొలగించి, తిరిగి వానిని నిర్మించవలసిన అవసరాన్ని గుర్తించాడు. డా॥ రాధాకృష్ణన్ హృదయంలోనికి హిందూధర్మం మరియు భారతీయ తత్వదర్శనంపైనున్న విశ్వాసం మరింత దృఢతరం చేసుకొని, భారతీయ ధర్మ సంస్కృతి, సభ్యతల నమ్మకాన్ని మరింత పటిష్టపరచి, వానికి సరియైన రూపకల్పన గావించుటకై ఒక సంకల్పాన్ని తీసికొన్నారు.

డా॥ రాధాకృష్ణన్, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజిలో తను బోధించెడి విభాగములో బోధనను ఒక ప్రత్యేక వ్యాఖ్యానశైలిలో ప్రారంభించుటతో, పోకిరి-జులాయిల్లా తిరిగే విద్యార్థులు సైతం ఆయన తరగతికి హాజరయ్యేవారు. ప్రబోధాత్మకమైన వాగ్ధాటితో ఆయన బోధించే విషయాలు, శ్రోతలకు అర్థవంతంగా వినసొంపుగా ఉండి వారిని చక్కగా ఆకట్టుకొనేవి. అనేక తాత్విక విషయాలు, ధర్మశాస్త్ర మర్మాలు విద్యార్థులకు కరతలామలకం కాజొచ్చాయి.

డా॥ రాధాకృష్ణన్ తన శక్తి సామర్థ్యాల జోడించి, చింత లేనివాడై, తన ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకొంటూ, మరింతగా తన సామర్థ్యాన్ని వికసింపజేసుకునేవాడు. దీనిలో భాగంగా అధ్యయనం చేయుటతోపాటుగా తన రచనలు కూడా ప్రారంభించాడు. 1918 నుండి 1920 మధ్య కాలంలో ఆయన రెండు రచనలు ముద్రించబడ్డాయి. అది ఫిలాసఫీ ఆఫ్ రవీంద్రనాథ్ ఠాగూర్ మరియు రీజన్ ఆఫ్ రిలిజియన్ ఇన్ కాంటెంపొరరి ఫిలాసఫి. ఈ రెండు గ్రంథాల ద్వారా డా॥ రాధాకృష్ణన్ గారి యొక్క ప్రతిభ లోకానికి తెలిసింది. తూర్పు మరియు పాశ్చాత్య దర్శనాల రెండింటిని, వానిలో అధ్యయనం చేశారు. విదేశాల్లో ఈయన రచనలు ఆదరణను పొందాయి.

1926లో హైదరాబాద్ విశ్వ విద్యాలయం ద్వారా, విశ్వ దర్శనశాస్త్ర సమ్మేళనంలో రాధాకృష్ణన్‌గారు పాల్గొన్నారు. దీనిలో దేశ-విదేశాల నుండి వచ్చిన దార్శనికులు ఉన్నారు. వీరంతా డా॥ రాధాకృష్ణన్‌గారి వ్యాఖ్యానాలను, విశ్లేషణలను విని ముగ్ధులైనారు. దీని పర్యవసానమే ఆయనకు చికాగోలోని

**ఏదైనా సాధించాలనుకునేవారికి అవకాశాలు మెండుగా ఉంటాయి**

హన్కల్ కళాశాలలో ఉపన్యసించవలసినదిగా ఆహ్వానం అందింది. అప్పటికే ఆయన రచనలు 3 నుండి 4 వరకు ప్రచురితమయ్యాయి. "ఇండియన్ ఫిలాసఫీ, ది హిందూ వ్యూ ఆఫ్ లైఫ్" అనే గ్రంథము ఆయనకు అంతర్జాతీయ స్థాయి వ్యక్తిగా గుర్తింపు తెచ్చింది. "ది హిందూ వ్యూ ఆఫ్ లైఫ్" అనే గ్రంథములోని వ్యాఖ్యానాలను ఆధారంగా చేసికొని 1926లో లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయ పరిధిలోని మాంచెస్టర్ కళాశాలలో "జీవితము పై హిందువుల దృష్టి కోణము" అనే విషయంపై ప్రసంగాలు ఇచ్చుటకై రాధాకృష్ణన్‌ను ఆహ్వానించుట జరిగింది.

ధోవతి మరియు తలపాగా ధరించి, అత్యంత సాదాసీదా భారతీయ సనాతన వేషధారియై, సరళ స్వభావుడు, సహనశీలి అయిన డా॥ రాధాకృష్ణన్, లండన్‌లోని మాంచెస్టర్ కళాశాలలో ప్రసంగాలిచ్చుటకై వెళ్ళగానే, ఆయన రూపం, అలనాటి స్వామి వివేకానందుని విజయయాత్ర జ్ఞప్తికి తెచ్చింది. ఆ రోజులలో విదేశాలకు వెళ్ళి శిక్షణను (విద్యనభ్యసించుట) పొందుట మిగుల గౌరవప్రదమైన దానినిగా గుర్తించేవారు. కాని డా॥రాధాకృష్ణన్ గారికి అట్టి అవసరం కలుగలేదు. అయినప్పటికీ విదేశాలకు వెళ్ళి అభ్యసించే ఒక విశిష్ట గౌరవం, అవకాశం ఆయనకు లభించగా ఆయన రాగానే అక్కడి పండితోత్తములు, జ్ఞానశీలురు, తమ శిరస్సులు వంచి, గౌరవ సూచకంగా లేచి నిలబడ్డారు. డా॥ రాధాకృష్ణన్‌గారి ప్రసంగం లోని వ్యాఖ్యానాలను విన్న ప్రఖ్యాత పత్రికా విలేఖరి డా॥జేమ్స్ హర్బట్ జర్నల్ (హర్బట్ పత్రిక)లో ఇలా వ్రాశారు. "డా॥ రాధాకృష్ణన్ భారతదేశం వెలుపల ప్రప్రథమంగా మన విద్యాలయంలో ప్రసంగించి తన మరియు మన గౌరవాలను పెంచారు" అని కొనియాడారు.

కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో కూడా ఆయన ప్రసంగాలు వినిపించుట జరిగింది. ఆయన ప్రసంగాన్ని అక్కడి జ్ఞాన సంపన్నులు ముక్తకంఠంతో ఇలా ప్రశంసించారు. "ప్రొఫెసర్ రాధాకృష్ణన్‌గారి జ్ఞానం అత్యంత లోతైనది మరియు విశాలమైనది, విస్తృతమైనది. భారతీయ మరియు పశ్చిమ-రెండు దర్శనాలలో మహాపండితుడు. హిందూధర్మంపైన సర్వసమర్థ ప్రసిద్ధ విద్వాంసుడు."

హిందూ ధర్మ విషయాలపై సాధికారికంగా, ధైర్యంగా విస్పష్టంగా చెప్పగలిగినవారు ఆయన ఒక్కరే. ఆ రోజులలో డా॥ రాధాకృష్ణన్‌ను లండన్‌లోని మాంచెస్టర్ కాలేజిలో వివిధ మతధర్మాలపై లోతైన అధ్యయనం గావించుటకై ఏర్పాటు చేసిన పీఠానికి అధ్యక్షునిగా చేసి ఆయన ప్రతిభకు పట్టం కట్టారు. అమెరికా మొదలు బ్రిటన్, జర్మనీ మున్నగు దేశాలలోని విభిన్న విశ్వ విద్యాలయాలలో విభిన్న ఆధ్యాత్మిక విషయాలపై ప్రసంగించవలసిందిగా ఆహ్వానించారు. ఆయన తన ప్రసంగాలలో సజీవ ఉదాహరణలతోపాటుగా ఆధ్యాత్మిక విషయాలను ప్రేక్షకుల హృదయాలలో నాటుకొనేలా విశదీ కరించి చెప్పేవారు. ఈ రీతిగా ఆయన భారతీయ ధార్మిక జీవన విధానాన్ని, దాని విశిష్టతలను పాశ్చాత్య ప్రపంచానికి మరో వివేకానందునిలా చాటిచెప్పారు.

1918 వరకు ఆయన విభిన్న విశ్వవిద్యాలయాల్లో ఉన్నత పదవులను అధిష్టించారు. మధ్య మధ్యలో ఆయనకు విదేశాలలో ప్రసంగించే అవకాశాలు వచ్చాయి. 1913 నుండి 1935 వరకు ఆయన ఆంధ్ర విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ (ఉప కులపతి) గా పనిచేశారు. 1931లో ఆయన అంతరాష్ట్రీయ బుద్ధిమాన్ సహయోగ సమితి (అంతర్జాతీయ ఇంటెలెక్చ్యువల్ కో ఆపరేషన్ కమిటీ) లో సభ్యునిగా నియమింపబడ్డారు. దీనివలన ఆయనకు అంతర్జాతీయ తాత్వికులతో సంబంధాలు పెంపొంది భారతీయ ధార్మిక విలువలకు మరింత గుర్తింపు లభించింది. డా॥ రాధాకృష్ణన్ గారి ఏకైక లక్ష్యము అశాంతితో కుమిలిపోవుతున్న మానవ సమాజానికి శాంతిని, సుఖ సంతోషాల చేకూర్చుటే. మానవాళి అశాంతి ఆయనను నిరంతరం బాధిస్తూ ఉండేది.

బనారస్ విశ్వ విద్యాలయానికి కులపతిగా మరియు భారతీయ విశ్వవిద్యాలయాల కమీషన్ అధ్యక్షునిగా పనిచేశారు. 1941 నుండి 1952 వరకు రష్యాలో భారతీయ రాయబారిగా పనిచేశారు. ఇంతటి బహుముఖ ప్రజ్ఞాశాలి, నిర్భీతిపరుడు, నిర్మోహమాటియైన రాధాకృష్ణన్ వ్యక్తిత్వం రష్యా అధినేత స్టాలిన్‌పై ప్రగాఢ ముద్ర వేసింది. భారతదేశ రాయబారిగా ఆయన రష్యా నుండి తుది వీడ్కోలు తీసికొనుటకై స్టాలిన్‌ను దర్శించగా, రాధాకృష్ణన్‌ను చూడగానే, స్టాలిన్ నేత్రాలు

**ఎవరైతే బాగా కష్టపడతారో వారినే అదృష్టం వరిస్తుంది**

చెమ్మగిల్లాయి, ఎరుపెక్కాయి, గద్గదస్వరంతో స్టాలిన్ రాధాకృష్ణన్ ను ఉద్దేశించి ఇలా అన్నాడు "నాలోని మానవత్వాన్ని మేల్కొల్పిన మొట్టమొదటి వ్యక్తి మీరే! మీరు మమ్ములనందరిని విడచిపెట్టి వెళ్తున్నారు, ఇది నన్ను ఎంతగానో బాధించుచున్నది."

1952లో భారతదేశ ఉపరాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నుకొనబడ్డారు. తిరిగి రెండవ దఫా ఉపరాష్ట్రపతిగా ఎన్నుకోబడ్డారు. 1956లోనే రాష్ట్రపతిగా ఉన్న డా॥ రాజేంద్రప్రసాద్ తీవ్ర అస్వస్థుడు అయిన కారణంగా రాష్ట్రపతి విధులనన్నింటిని, ఉపరాష్ట్రపతిగా ఉన్న డా॥ రాధాకృష్ణన్ చూడుట ప్రారంభించారు. ఈ రీతిగా ఆయన రాష్ట్రపతి బాధ్యతలను, ఉపరాష్ట్రపతి పదవిలో ఉండగానే నిర్వహించే అరుదైన అవకాశం ఆయనకి లభించినది.

1962లో రాష్ట్రపతి కాగానే, చైనా దురాక్రమణ జరిపింది. ఈ సమయంలో రాష్ట్రపతిగా ఉన్న ఆయన అగ్ని పరీక్షను ఎదుర్కొనవలసి వచ్చింది. తదుపరి ఆయన ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, అమెరికా, ఇంగ్లాండు, రష్యా మరియు ఐర్లాండ్ దేశాలలో పర్యటించి సఫలీకృతులైనారు. తన రాష్ట్రపతి పదవీకాలంలో అనేక సవాళ్ళను విజయవంతంగా ఎదుర్కొన్నారు.

1967లో డా॥ రాధాకృష్ణన్ తిరిగి రాష్ట్రపతి పదవికి పోటీ చేయుటకు తన అయిష్టతను చూపారు. ఆయన భారతదేశ రాజకీయ మరియు వ్యవస్థల పట్ల నిరాసక్తుడైనాడు. ఇట్టి తన హృదయంలో వ్యథాభరిత స్థితిని ఆయన 25 ఫిబ్రవరి 1967 గణతంత్ర దినోత్సవం (రిపబ్లిక్ డే) రోజున రాష్ట్రపతి పేరున ఇచ్చే సందేశంలో దేశ ప్రజానీకానికి ఇట్లు వ్యక్తపరచారు. "వర్తమాన సవాళ్ళను ఎదుర్కొనుటకై సంపూర్ణ పరివర్తన మనలో కలుగవలసి ఉన్నది. దీనికి మనమంతా సహాయ సహకారాలను అధికాధికంగా అందించి తోడ్పడాలి" అన్నారు.

భారతదేశ రాజకీయ జీవితం నుంచి సన్యసించి, ఆయన మద్రాసులో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. జీవితంలోని అంతిమదశలో దేశ పరిస్థితుల చూసి ఆయన హృదయం రోదించేది. 17 ఏప్రిల్, 1975లో ఆయన స్వర్గస్తులైనారు. ఆయన మానవాళికి అందించిన సేవలు, భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతి వ్యాప్తికై, దాని ఔన్నత్యానికి సల్పిన పోరాటాలు ఆయన ఆలోచనలు, ఆయన రచించిన గ్రంథాలు ఆయన ధార్మిక చింతన ఆయనను అమరునిగా చేశాయి.

*– పూజ్య గురుదేవుల వాఙ్మయం 51 (4.45) నుండి*

*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## అనుమానానికి తావివ్వకు

*నీకున్న అనుమానాలతో సహజీవనం చేస్తున్నావా? నీ అనుమానాలు నీ జీవితంలో సింహభాగమై నిన్ను వెనుకంజ వేయిస్తున్నాయా? మిత్రమా! అనుమానమనేది ఒక అభిప్రాయము మాత్రమే. దీనిని గుర్తుంచుకో! అనుమానాలకు తర్కానికి, కారణాలు ఉండవచ్చు. అంతమాత్రాన అవి తప్పక నిజమై ఉండాలని లేదు.*

*అనుమానాలు ఉన్నప్పుడు కూడా, మన కర్తవ్యాన్ని విడువరాదు, చేష్టలుడిగి కూర్చొనరాదు. మన మనస్సును అనుమానాలతో నింపుకొన్నప్పుడు, మనకు వచ్చే ధనాత్మక (పాజిటివ్) అవకాశాలు, విజయాలు తెరమరుగవుతాయి. అందువలన మనము అనుమానాల పట్ల తగిన జాగరూకులమై ఉంటూ, యదార్థాలకు చోటివ్వాలి. అదేవిధంగా మన శక్తి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు చక్కగా బేరీజు వేసికొంటూ ఉండుట తప్పనిసరి.*

*అనుమానాలతో కాలము వెళ్ళదీసేకంటే వానిని నివృత్తి చేసికొనుట ఉత్తమం. వివేకంతో, ధైర్యంతో అనుమానాలను విశ్లేషించుకుంటూ, వానిని నివృత్తి గావించుకొంటూ ప్రగతి పథంలో పయనించుట ఉత్తమం. మనస్సులోని అనుమానాల తొలగించుకొంటూ జీవన ప్రగతి పథంలో, పయనిస్తూ మన జీవన లక్ష్యాన్ని చేరుకుందాం.*

*– అఖండజ్యోతి (ఆంగ్లం), మార్చి-ఏప్రిల్ 2014*

*అనువాదం: ఎ. శారద*

**అనుకున్నది సాధించాలంటే అహోరాత్రులు శ్రమించాలి**

దేవి నవరాత్రుల ప్రత్యేకం

# ఆత్మబల అభివృద్ధికి అద్భుత అవకాశం

రాత్రి, పగలు కలిసే సమయాలు ఉదయ సంధ్య, సాయం సంధ్య. ఇవి ఉపాసనకు మహత్తరమైనవి. శుక్ల పక్ష, కృష్ణ పక్షములు, పూర్ణిమ, అమావాస్య, దీపావళి, హోళి, గురు పూర్ణిమ, శ్రావణపూర్ణిమ వంటి పండుగలు ఈ సంధి సమయాలలోనే వస్తాయి. శీతాకాలం, గ్రీష్మ ఋతువుల సంధి కాలం సంవత్సరంలో రెండుసార్లు వస్తుంది. చైత్ర మాసంలో, ఆశ్వీయుజ మాసంలో. శరీరక్షాళనకు, కాయకల్ప చికిత్సకు ఈ సంధికాలాలు ఉత్తమమైనవని ఆయుర్వేద శాస్త్రం చెపుతోంది. అలాగే చైత్ర నవరాత్రులు, ఆశ్వీయుజ నవరాత్రులు అనుష్ఠానాలకు ఉత్తమమైనవి. నవరాత్రులు ప్రకృతి జగత్తులో ఋతువులకు ఋతు కాలములు. ఈ సమయాలలో వేడి, చలి సమతూకంలో ఉంటాయి. పృథ్వి యొక్క వేగం తగ్గుతుంది.

నవరాత్రులు దేవత్వం భూమిపై ఆవిర్భవించి జాగృత ఆత్మలలో దైవీ ప్రేరణను నింపే సమయం. ఈ తొమ్మిది రోజులలో ప్రకృతి యొక్క సూక్ష్మ అంతరాళం, మానవ శరీరంలోని సూక్ష్మభాగం విశిష్టమైన పరివర్తన ప్రక్రియకు లోనవుతాయి. శరీరంలో సుడిగుండాల వంటి సంచలనాలు కలుగుతాయి. శరీరంలో పేరుకుపోయిన వికారాలను, మానసిక వికృతులను తొలగించడానికై జీవశక్తి తుఫానులా తీవ్ర సంఘర్షణ జరుపుతుంది. ఆత్మిక ప్రగతికై ఆంతరిక ప్రేరణలు సహజంగా ఉత్పన్నం అవుతాయి.

నవరాత్రులలో సూక్ష్మజగత్తునుండి దైవీప్రేరణలు వర్షిస్తాయి. సంస్కరించబడిన ఆత్మలు తమలోపల సముద్ర మథనం వంటి సంచలనాలను అనుభవంలోనికి తెచ్చుకుంటాయి. ఈ సంచలనాలను సద్వినియోగపరచుకునే సాధకులు అదృశ్యమైన ప్రేరణా శక్తిద్వారా ప్రోత్సహించబడి, ఆత్మకళ్యాణ, లోకకళ్యాణ కార్యకలాపాలలో పాల్గొంటారు; అమూల్యములైన ఆధ్యాత్మిక రత్నరాశులను సంపాదిస్తారు; కృతకృత్యులు అవుతారు.

ఈ సంధి కాలంలో సాధకులకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఊహకందని ఫలితాలు అందుతాయి.

నవరాత్రులకు గూఢార్థం ఉన్నది. మానవ శరీరం అనే అయోధ్యలో నవ ద్వారాలు అనగా తొమ్మిది ఇంద్రియాలు ఉన్నాయి. అజ్ఞానంవలన దుర్వినియోగపరచిన కారణంగా వాటిపై ఆవరించిన అంధాకారాన్ని అనుష్ఠానం ద్వారా తొలగించవలసి ఉన్నది. ఒక్కొక్క రాత్రి ఒక్కొక్క ఇంద్రియంపై ఆలోచన చేయాలి. వాటిపై సంయమనాన్ని సాధించాలి. వాటిలో ఇమిడి ఉన్న సామర్థ్యాలను వెలికి తీయాలి. వాస్తవానికి ఇదే నవరాత్రి సాధన. రాత్రి అంటే చీకటి. ఈ నవద్వారాలనే తొమ్మిది ఇంద్రియాల విషయాలపట్ల మెలకువ వహించే సాధకుడు వాటిలో మునిగిపోడు; వాటిని దుర్వినియోగపరచి తన ఓజస్సును, తేజస్సును, వర్చస్సును వృథాచేయడు. అజ్ఞాన అంధకారం నుండి వెలుగులోనికి పయనించుటయే నవరాత్రి జాగరణ.

నవరాత్రి నవదుర్గ ఉపాసనతో ముడిపడి ఉన్నది. దోష దుర్గుణాలను, కషాయ కల్మషాలను నిర్మూలించే మహాశక్తి దుర్గ. మన ఇంద్రియ చేతనను ఆవరించిన దుర్గుణాలను నశింపచేస్తుంది కనుక దుర్గను తొమ్మిది రూపాలలో ఉపాసన చేస్తాము. మనిషిలోని పాపప్రవృత్తుల ప్రతిరూపమే మహిషా సురుడు. నవరాత్రులలో మానసిక సంకల్పం ద్వారా ఆ ప్రవృత్తులపై అంకుశాన్ని ప్రయోగిస్తాము. సంయమశీల మయిన ఆత్మనే దుర్గగా, మహాకాళిగా, గాయత్రిగా అభివర్ణిస్తారు. ప్రాణ చేతన సంస్కరించబడినప్పుడు ఈ శక్తియే మహిషాసుర మర్దిని అవుతుంది.

ఆ మహాశక్తికి గాయత్రి, ఆదిశక్తి, దుర్గ, మహాకాళి, మహాలక్ష్మి మున్నగునవి వివిధ రూపాలు. కనుక నవరాత్రులలో గాయత్రీ అనుష్ఠానం అత్యధిక ప్రాధాన్యతను సంతరించు కున్నది. కనుకనే 24 వేల గాయత్రీ మంత్ర అనుష్ఠానానికి నవరాత్రులలో విశేష ప్రాముఖ్యత ఉన్నది.

నవరాత్రి అనుష్ఠానం వల్ల శరీరంలో, మనస్సులో నిండి ఉన్న వికారాలు క్షాళన అవుతాయి. ఎందుకంటే – నవరాత్రి పర్వం ఆత్మ చేతన యొక్క సంస్కరణకు, క్షాళనకు అనువైన పర్వం.

★★★

బాగా కష్టపడితే మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకోవచ్చు

భావసంవేదనల గంగోత్రి-3

# మీరాబాయి

మీరా జవజీవాలు గల మహిళామణి. ఆమె తన జీవితంలో ఎదురైన ప్రతి పరీక్షలోను విజయం సాధించింది. ఆమె చిత్తోడ్ మహారాణి. వైభవము, పదవి, అధికారము, గౌరవములతో పాటు మనిషి కోరుకున్నవన్నీ ఆమెకు పుష్కలముగా లభించాయి. ఆమెకు లేనిది ఒకే ఒక్కటి. అదే మానవునికి హితము చేయుటకు అవకాశము స్వేచ్ఛ. లోకములో చలామణి అవుతున్న బూటకపు కట్టుబాట్లతో ఆమె మరిది, ఆడపడచు, సమస్త రాజ కుటుంబము - అందరూ ఆమె ఆత్మ యొక్క గొంతును నొక్కారు. మీరా జన మానసంలో విప్లవ బీజాలు నాటడం, మహిళల చేతనకు వెలుగు నిచ్చే దీపంగా ముందుకు సాగటం వారికి నచ్చలేదు.

ప్రేతాలకు, మనుష్యులను అన్ని విషయములలోను వైరుధ్యమే. ప్రేతాలకు చీకటి నచ్చుతుంది. మనుష్యులకు వెలుగు నచ్చుతుంది. ఒకరికి ఇతరులను బాధించటము నచ్చుతుంది, రెండవవారికి ఇతరులతో సహకరించుట ఆనందము. కానీ, మనుష్యులలో ప్రేతాలు ఉండటము చాలా బాధాకరము. ఒకవైపు అవరోధము. మరోవైపు అంతరంగంలోని తహతహ, అశాంతి, వేదన వీటన్నిటితో మీరా మనస్సుపై పెనుభారం పడింది. దీనిని అనుభవజ్ఞులే అర్థం చేసుకోగలరు. ఆమె రాజమహలులో ఉండి కూడా ఇలా బిగ్గరగా ఏడుస్తూ ఉండేది-ఘాయల్ లేగతి ఘాయల్ జానే కీ జిగ్. ఘాయల్ హోయ్ సూలీ ఊపర్ సేజ్ హమారీ కిస్ విధి సోవణ్ హోయ్ (దెబ్బ తిన్నవాడే దెబ్బతిన్నవాని బాధ తెలుసుకోగలడు. ఈ ముళ్ళ పరుపుమీద ఎలా పరుండగలను?).

అశాంతి, ఛాంధస భావాలలో చిక్కుకున్న సమాజము గురించి ఆమె యొక్క దుఃఖము, బాధ సమస్త స్త్రీ జాతివి. మన అవసరాలను మరచిపోయి ఇతరుల అవసరాలను గుర్తించడమే కరుణకు తార్కాణం. ఆమె హృదయము కరుణతో నిండిపోయింది. ఆమె బంధనాలను త్రెంచుకున్నది. రాజమహలును వీడి భావ సంవేదనలు అనే సంజీవనితో ప్రజలలో ప్రాణశక్తిని మేల్కొల్పుటకు ముందుకు నడిచింది.

ఆమె ఇంటినుండి బయటకు వచ్చి ఇంటింటికి వెళ్ళి, స్త్రీ పురుషులు ప్రతి రంగములో సమానమని చాటిచెప్పింది. స్త్రీలు ఆమెను ఆశ్చర్యముతో, గర్వముతో చూసారు. ఒక రాజస్థానీ స్త్రీ కేసరిబాయి "సోదరీ! నీవు పురుషుల పని ఎందుకు చేస్తున్నావు" అని ప్రశ్నించింది?

"ఇది పురుషుల పనా?"

"మరి కాకపోతే ఏమిటి?"

"నిజం చెప్పాలంటే ఇది స్త్రీల పని".

"ఎలా?"

"లోతయిన భావనా శ్రద్ధయే మహిళకు గల విశిష్టత. ఆమెలో ఇచ్చే ప్రవృత్తి ఉన్నది. ఇతరుల మేలు కొరకు స్వార్థమును తిరస్కరించుట ఒక్క స్త్రీకే స్వంతం. అందువలననే ఆమె తన ప్రాణములను పణంగా పెట్టి బిడ్డకు జన్మనిస్తుంది. కష్టాలను ఓర్చుకొని కుటుంబమును సంఘటితంగా ఉంచుతుంది. దీనిని మరింతగా వ్యాప్తిచేయుట ఎంతో అవసరము".

కేసరిబాయి సరేనన్నది. ఆమెకు యథార్థము అర్థమైనది.

మీరాబాయి ప్రయత్నాలను భగ్నం చేయుటకు కుట్ర దారులు ప్రయత్నములు మొదలుపెట్టారు. విష ప్రయోగాలు, కుతంత్రాలు చేయగా దైవీచేతన అందించిన రక్షణతో మీరాబాయి బయట పడింది.

మీరాకు ఎంతవరకు సఫలత లభించింది అనేది ప్రశ్న కాదు. ఆమె లోపలి ఆవేదన, పతనమును బంధనములను త్రుంచవలెననే తహతహ ఆమెలో పెల్లుబికాయి. పాదాలు క్రియాశీలతవైపు సాగాయి. ఈ సఫలతల ముందు ఇతర సఫలతలన్నీ దిగదుడుపే.

విక్రమశకం 1630 వరకు ఆమె జీవించింది. జీవించి ఉన్నది అనే దానికి అర్థము - ఉచ్ఛ్వాస నిశ్వాసముల చలనం కాదు. ఆరిపోయిన అనేక జీవితాలలో నూతనజ్యోతిని వెలిగించే దీపమువలె ఆమె జీవించింది. ఇంటింటికి వెళ్ళి తన వేదనను పంచింది. ప్రతి ఒక్కరి అంతరాళంలో ఒక స్పందనను, ఒక తపనను రగిల్చింది.

*- అనువాదం: డి.వి.ఆర్.మూర్తి*

**ఆలస్యం చేయడం వలన అమృతం కూడా విషంగా మారుతుంది**

మెస్మరిజం-12

# సమ్మోహన విద్య యొక్క చమత్కారములు

ఏసుక్రీస్తు, బుద్ధభగవానుడు తమ చేత్తో స్పృశిస్తేనే రోగాలు మాయమైపోయాయని చాలామంది చెప్పారు. యువకులను మాయచేసి వశీభూతం చేసుకొని తమ మతంలోకి మార్చు కుంటున్నాడని ఒకప్పుడు సుకరాతునిపై అభియోగం మోప బడింది. ఇటువంటి మహాపురుషులను రాస్పుటిన్, మెస్మర్‌వంటి వ్యక్తులతో కలిపి ఉల్లేఖించడం చాలా అనుచితమైన పని. అయితే చరిత్రలో ప్రసిద్ధికెక్కిన రాస్పుటిన్ కళ్ళల్లో ఎటువంటి సమ్మోహన శక్తి ఉన్నదో తెలిపేందుకు చరిత్రే సాక్ష్యముగా నిలుస్తుంది.

ఇటువంటి వ్యక్తులకు మన దేశంలో కూడా కొదవేమీ లేదు. వారు ఎవరి మృత్యువు ఎప్పుడు అనేది తిథులతో సహా చెప్తారు. వారు చెప్పిన ఆ భవిష్యవాణులు నిజమైనప్పుడు మన ఆశ్చర్యమునకు అంతుండదు. మెస్మర్, రాస్పుటిన్ వంటి వ్యక్తులు ఇప్పటికీ అద్భుతవ్యక్తులుగా, విడదీయలేని చిక్కు ముడులుగా మిగిలిపోయారు. రాజరిక విప్లవమునకు ముందు మెస్మర్ తన అలౌకిక చమత్కారములను చూపించడం మొదలు పెట్టాడు. అందరూ ఆయన ఆలోచనలు సరైనవి కావని నిందించారు. అలా నిందించినవారు, వారిని సమర్థించినవారు కూడా ఆయన స్పర్శతో రోగవిముక్తులై ఆయన ఆలోచనలు సరైనవే అని ఒప్పుకున్నారు. రహస్యమయ శక్తులను గురించి ఇలాంటి ఆలోచనలు ఎవరైనా చేస్తే మంచివారెవ్వరైనా ముందుగా అనుమానిస్తారు. ఎందుకంటే సైతాన్ శక్తి ఈ రూపంలో దైవీశక్తిని ఉపయోగించుకుంటున్నదేమోననే అనుమానంతో ఎవరూ ఇష్టపడరు. పతితులైనవారు కొందరు తమ స్వార్థము కొరకు ఈ శక్తులను ఉపయోగించుకున్నారు. కొందరు సంపద కోసం, తమ గొప్పతనాన్ని చూపించడం కోసం, స్త్రీల మానమర్యాదలు కొల్లగొట్టేందుకు కూడా ఈ విద్యను ఉపయోగించుకున్నారు. ఇక్కడ విషయం మెస్మర్ గురించి కాదు, ఆయన రూపొందించిన విధానాన్ని తమ స్వార్థం కోసం దురుపయోగం చేసుకున్నవారి గురించి మాత్రమే. రాస్పుటిన్ శక్తిని ఎవ్వరూ కాదనలేరు. ఆయన యొక్క ప్రభావం ఆధునిక యుగంలో అన్నింటికంటే గొప్పదిగా చెప్పవచ్చు. రష్యా దేశానికి చెందిన జార్ చక్రవర్తి యొక్క యావత్ పరివారముపైన, వారి రాకుమారి యొక్క అనారోగ్యంపైన రాస్పుటిన్ యొక్క ప్రభావం ఫలించిన తరువాత ఆయన చూపించిన అద్భుతాలను చూచి ప్రజలు ఆశ్చర్యచకితులైనారు. ఇటువంటి ఈ శక్తిని ప్రశంసించినప్పటికీ, శక్తిని దురుపయోగం చేసే సాధనాలను ఎవరు ప్రశంసిస్తారు? అందుచేతనే ఈ రోజు రాస్పుటిన్ నిందకు పాత్రుడు కావలసివచ్చింది. ఈ విధంగా పైశాచిక ప్రవృత్తులు చేసే లీలల వల్ల సమ్మోహన విద్య ప్రయోగించే వారెందరో దండనార్హులుగా మిగిలిపోయారు, ఉరికంబాలకు వ్రేలాడారు, సజీవదహనం కూడా చేయబడ్డారు.

అందువల్ల వైజ్ఞానికులు సమ్మోహన విద్య తెలిసినవారందరి ముందు ఉంచిన ప్రశ్న ఏంటంటే 'అసలు ఈ విద్య వల్ల ఉపయోగం ఉందా, లేదా?' అని. దీని ఉనికిని గురించిన ప్రశ్న కంటే ముందు దీని వలన కలిగే ఉపయోగమేమిటి అనే ప్రశ్న ప్రాధాన్యతను కలిగి ఉన్నది. అప్పటినుండి సమ్మోహకులు తమ విద్యపై వైజ్ఞానిక దృష్టి సారించారు. ఒకప్పుడు పొడవాటి దుస్తులు ధరించి, కళ్ళు ఉరిమి రెప్ప కొట్టకుండా చూసే కళ్ళతో అవతలివారిని సమ్మోహనం ద్వారా అచేతనులను చేసి తమ ఇష్టప్రకారం చేయించే చర్యలే చమత్కారాలని, ఈ విద్యకు అదే చివరి మెట్టు అని సమ్మోహకులు భావించేవారు. కానీ ఈనాడు నైతికతను నిలబెట్టుకుంటూ సమాజ, మానవ కళ్యాణములే ముఖ్యము అనే సిద్ధాంతమునకు తెరతీయబడింది కనుక ఇందుకు కట్టుబడి సమ్మోహకులు తమ ప్రామాణికతను నిరూపించుకోకతప్పని తమ స్థితిని అర్థం చేసుకున్నారు.

లండన్‌లోని అలెగ్జాండ్రియా ప్యాలెస్‌లో ఒక రోజున కైసన్ అనే ఒక కొత్త సమ్మోహకుడు తన చమత్కారములతో అందరినీ ఆశ్చర్యచకితులను చేశాడు. వార్తాపత్రికలో అతనిని గురించిన కథనాలను చదివినవారంతా విస్మయులైనారు. 24 సంవత్సరాల ఈ యువకుడు మనందరివలె చూసేందుకు చాలా సాధారణంగా

మనిషి జీవితంలో బద్ధకమే పెద్ద శత్రువు

కనిపిస్తాడు. అయితే తీక్షణమైన అంతర్భేదన దృష్టి కలిగిన కేసిన్ తన స్పర్శతో అలౌకిక చమత్కారములను చేసాడు. అతను అక్కడ ఉన్న వారిని తాను ఏమి చేయమని అడిగినా కాదనలేని స్థితిలోకి తీసుకుని వెళ్ళాడు. వారిని తమ స్వేచ్ఛ, చేతన కోల్పోయేలా చేసి విభిన్న లోకాలకు యాత్ర చేయించాడు. అయితే ఈ స్థితిని చేతనత్వం లేని స్థితి అని చెప్పలేము. 33 సంవత్సరాల ఒక మహిళను అతను ఒకసారి ఆమెకు 5 సంవత్సరాల వయస్సున్న స్థితిలోకి తీసుకెళ్ళి అక్షరాలు వ్రాయించి తరువాత 6 సంవత్సరాలకు, తరువాత 24 సంవత్సరాల వయస్సులోకి, ఇలా విభిన్న స్థితులలోకి తీసుకెళ్ళి చివరగా వర్తమానస్థితికి తీసుకువచ్చి ఆమెతో సంతకం చేయించాడు. పరిశీలిస్తే ఆ సంతకం ఈ ప్రస్తుత వయస్సులో ఆమె సంతకానికి సరిపోయింది.

కేసన్ ఆధునిక దృష్టికోణంతో సమ్మోహన విద్యను అధ్యయనం చేశాడు. ఎన్నో రకాల విద్యలను అధ్యయనం చేశాడు. ఎన్నో రకాల రోగాలకు సమ్మోహమనే విద్యను ఉపయోగించవచ్చని అతను ప్రతిపాదించాడు. శస్త్రచికిత్స చేసే సమయంలో కూడా ఈ విద్యను ప్రయోగించడం వల్ల వారికి ఆ చికిత్స జరుగుతున్నట్లు కూడా తెలియదు. నిద్రలేమితో బాధపడేవారు కూడా ఈ విధానం ద్వారా మంచి నిద్రను పొందగలిగారు. ఆగస్ట్‌పేరోల్ అనే పేరుగల మరో సమ్మోహకుడు మ్యూనిచ్‌లోని పిచ్చాసుపత్రిలో ఉండే రోగుల గోలతో ఇబ్బందులు పడుతున్న పనివారు నిద్రపోయే సమయంలో వారిమీద సమ్మోహనమును ప్రయోగించాడు. ఆ ప్రభావంతో వారు గాఢనిద్రలోకి జారుకునేవారు. ఆ తరువాత ఎంత గొడవ జరిగినా నిర్ధారిత సమయమునకు ముందుగా వారికి నిద్రా భంగము కలుగలేదు.

ఆపరేషన్ చేసే సమయంలో సమ్మోహనవిద్యను ఉపయోగించడమనేది 1740వ సంవత్సరం నుండి ప్రారంభ మైనది. తరువాత క్లోరోఫామ్ కనిపెట్టబడిన తర్వాత దీని ఉపయోగం తగ్గిపోయింది. సమ్మోహనం ద్వారా చేసే చికిత్సా విధానంలో ఒక చిన్నలోపం ఉన్నది. అదేమిటంటే చికిత్స చేసేటప్పుడు ఒక్కోసారి అద్భుతమైన రీతిలో రోగము నయమై పోతుంది. కానీ రోగికి తన బాధ సమూలంగా తగ్గిపోయిందా లేక ఇంకా కొంచెమైనా ఉందా అనే విషయముపై అవగాహన ఉండదు. అయినప్పటికీ స్నాయు సంబంధమైన రోగాలను నయం చేసేప్పుడు సమ్మోహనము చాలా ప్రభావమును చూపిస్తుంది అని నిరూపించబడింది.

అసలైన సమ్మోహనవిద్యకు సంబంధించిన విషయాలు ఖచ్చితంగా చెప్పడమంటే కొంచెం కష్టమైనపనే అవుతుంది. దీని ఆధారము మనోవైజ్ఞానికమైనది. మానవుని ఇచ్ఛాశక్తిపై ప్రభావమును చూపించి, స్వేచ్ఛగా నడిపించే విధానాన్ని మనో వైజ్ఞానికులుగాని, మనస్తత్వ సిద్ధాంతము కాని వ్యతిరేకించదు. దీని ఉపయోగము మరియు అవాంఛనీయతలు ఎలాంటివి అనే ప్రశ్న విభిన్నమైనది. విషము ప్రాణాలను తీస్తుంది కానీ 'విషస్య విషమౌషధమ్' అనే సిద్ధాంతానుసారము భయంకరమైన అనేక రోగాలకు, విషముతో చేసిన మందులనే వైద్యులు వాడతారు. అందువల్ల సమ్మోహనవిద్యను సదుపయోగము చేయవచ్చు, దురుపయోగము చేయవచ్చు, రెండూ సంభవమే. సమ్మోహనవిద్య అనేది తమాషా విద్య కాదు. దీని ఆధారము మనోవైజ్ఞానికమైనది. దీని కేంద్రము ఇచ్ఛాశక్తి. ఇందుకు సాధనము స్నాయుపరమైన విధానము.

### సమ్మోహనము ద్వారా మనస్సుకు చికిత్స

తాంత్రిక విధానంలో రహస్య విజ్ఞానమునకు సంబంధించి 6 ప్రముఖ అంగాలు ఉన్నాయి. 1) మారణం, 2) మోహనం, 3) ఉచ్చాటనం, 4) వశీకరణ, 5) ఆకర్షణ, 6) స్తంభన. పాశ్చాత్య దేశాలలో ఈనాడు మోహినీవిద్య ఎక్కువగా ప్రయోగిస్తున్నారు. మోహనము అనగా సమ్మోహనము. ఆంగ్లములో దీనినే 'హిప్నోటిజం' అంటారు. గ్రీకుభాషలో దీనినే 'హిప్నోస్' అంటారు. అసలు ఇదేమిటి? దీనిని ఉపయోగ కరంగా ఎలా ప్రయోగిస్తారు? ఈ దిశగా పాశ్చాత్యదేశాలలో చాలా ప్రయత్నాలు జరిగాయి.

సమ్మోహనవిద్యలో భాగంగా వ్యక్తి శరీరమును స్పృశించ కుండానే కృత్రిమనిద్రను తెప్పించవచ్చు. వ్యక్తిని మోహనిద్రలోకి పంపేందుకు సర్వశ్రేష్ఠమైన ఉపాయము ఒకటి వైద్యులకు తట్టింది. సమ్మోహకులు వ్యక్తి యొక్క మానసికస్థితిని బాగా పరిశీలించి తమ ఇచ్ఛాశక్తితో సంకేతాలు, సూచనలు, సంప్రేషణ (పంపుట) అనే పనులు పూర్తి చేస్తారు.

న్యూయార్క్‌లోని రూట్‌జెర్స్ యూనివర్శిటీకి చెందిన విజ్ఞాన

**అభివృద్ధి కావాలనుకునే వారు ముందు బద్ధకాన్ని వదిలించుకోవాలి**

వేత్త డా॥ గ్రిఫిథ్ విలియమ్ 'ఎక్స్‌పెరిమెంటల్ హిప్నోసిస్' అనే తన పుస్తకములో ఈ వాస్తవాన్ని ప్రకటించారు. కొందరు వ్యక్తులు కొన్ని సమయాల్లో ఎందుకు భావవిహ్వలులౌతారు? (emotional out burst) ధర్మసంబంధమైన ఉత్సవాలలో, హరికథాశ్రవణాదులలో భజన-కీర్తనలు జరిగేప్పుడు, మధురమైన సంగీతము విన్నప్పుడు తమనితాము మర్చిపోయి సమ్మోహనస్థితిలోకి వెళ్తారు, ఎందుకు? ఆయన ఇందుకు కారణం చెప్తూ - 'అటువంటి సమయాల్లో ప్రాణచేతన తను కోరిన వ్యక్తి లేదా వస్తువు పట్ల నిర్దిష్టంగా ప్రేరేపింపబడి ఆకర్షితమౌతుంది' అన్నారు. ఈ సమ్మోహకస్థితిని ఆయన 'సోమ్నాంబులిజమ్' అనే పేరుతో పిలిచారు. ఆయన కథనం ప్రకారం ఏ వ్యక్తి అయినా తన చేతనాత్మకస్థితి నుండి విస్మృతి (మరుపు) చెంది అచేతనస్థితిలోకి వెళ్ళే ఆ స్థితిని హిప్నోగౌజిక్ అని, జాగృతస్థితిని హిప్నోవామ్పుక్ అని అన్నారు. ఈ రెండు రకాల స్థితుల కలయికలో వచ్చే స్వరూపమును 'హిప్నో ఇడాల్ ట్రాన్స్' అని పిలుస్తారు. జిడ్డు కృష్ణమూర్తి ఈ స్థితిని 'ఛాయిస్‌లెస్ అవేర్‌నెస్' అని చెప్తారు. ఏం చేయాలి, ఏం చేయకూడదు అనేది తెలియదు. ఇటువంటి స్థితిలో వ్యక్తి యొక్క గతజన్మల గురించి చాలా సులభంగా తెలుసుకోవచ్చు.

భారతీయ మానసికశాస్త్ర విశేషజ్ఞుల ప్రకారము వ్యక్తి యొక్క మనోసంస్థానము యొక్క కార్యకలాపాలను నడిపించేందుకు జాగృతి, స్మృతి, ధృతి అనే మూడురకాల స్థితులు మనకు కనిపిస్తాయి. జాగృతావస్థలో మనస్సు ప్రత్యక్షంగా జ్ఞానేంద్రియములను అనుభూతి చెందుతుంది. జన్మ జన్మాంతరాల నుండి ప్రోగుపడిన జ్ఞాన-సంపద 'స్మృతి' ద్వారా మనకు తెలుస్తుంది. 'ధృతి' అనేది మనస్సునందలి సూక్ష్మాతి సూక్ష్మమైన స్థితి. ఇందులో ఆలోచనలను సంగ్రహించే విధివ్యవస్థ ఏర్పాటై ఉండి ఒక వ్యక్తి యొక్క స్థితి మరొక వ్యక్తికి తెలుస్తూ ఉంటుంది. హఠయోగప్రదీపికలో వ్రాసిన ప్రకారము ఏకాగ్రచిత్తముతో మనిషి ఏదైనా ఒక సూక్ష్మ వస్తువును దగ్గర ఉంచుకొని కళ్ళల్లో నీళ్ళు వచ్చేంతవరకు చూస్తూ ఉండాలి. యోగవిద్యా నిష్ణాతులు దీనిని త్రాటక సాధన అంటారు. దీనివల్ల నేత్రరోగాలు, తంద్ర (మత్తు), బద్ధకము అనేవి దూరమౌతాయి. ఇతరుల మనస్సులోని మాటలు తెలియుట, ప్రభావితం చేయుట, వారిని స్పృహ తప్పేలా చేయడం దీని ద్వారానే సాధ్యమవుతుంది. యోగ గ్రంథాలలో వర్ణించిన నాదబిందు సాధన ఇదే. ఇందులో కళ్ళు మూసుకోకుండా రెండు కనుబొమ్మల మధ్య దృష్టి నిలిపి ధ్యానించాలి. పాశ్చాత్య చికిత్సకులు దీనినే 'సెల్ఫ్ హిప్నోటిజం' లేదా 'ఆటో హిప్నోటిజం' అంటారు.

కొలంబియా యూనివర్శిటీకి చెందిన వైద్యులు, విజ్ఞానవేత్త అయిన డా॥ హర్‌వర్ట్ స్పెగల్ సమ్మోహనవిద్యపై చాలాకాలం పరిశోధనలు చేశారు. ఆ తరువాత సమ్మోహన విద్యకు సంబంధించిన సాఫల్యము అనేది ఆ సమ్మోహకుని యోగ్యత, కౌశలముపైనే ఆధారపడి ఉంటుందని తేల్చారు. సమ్మోహన విద్యలో నిష్ణాతులైన వారి ప్రధానమైన కార్యమేమిటంటే రోగికి కృత్రిమ విధానములో నిద్రయొక్క అనుభూతిని కలిగించడం. ఆ తరువాత అతని అంతర్మనస్సులోకి సంకేతాలను, సూచనలను పంపడము. నిద్రావస్థలో శరీరము దాదాపు నిష్క్రియంగా ఉండిపోతుంది. కానీ మనస్సు పని చేస్తూనే ఉంటుంది. అప్పుడు మనస్సును ప్రాపంచిక విషయాల నుండి దూరం చేసి ఆలోచనా రహితంగా తయారు చేయాలి. ఆ తరువాత మస్తిష్కములో సత్ప్రవృత్తులను ప్రవేశ పెట్టేందుకు అవకాశము లభిస్తుంది. వ్యక్తిలో ఆత్మవిశ్వాసమును ఉత్పన్నము చేసి అతని మానసిక బలహీనతలను తొలగించేందుకు ఇది సర్వోత్తమమైన చికిత్సగా చెప్పబడుతుంది.

న్యూయార్క్‌లోని మౌంటీఫెయిర్ హాస్పిటల్‌కు చెందిన మానసికవైద్యుడు, శారీరిక క్యాన్సర్ స్పెషలిస్ట్ (ఆంకాలజిస్ట్) డా॥ పాలసేసరడోట్ ప్రకారం సమస్త వ్యాధులకు మానసిక వికృతులే ప్రధాన కారణమని చెప్పారు. **సమ్మోహన చికిత్స యొక్క అసలైన ప్రయోజనము మనస్సనే సంస్థానమునందలి ధృతి క్షేత్రములోని ఈ వికృతిని సంస్కరించి బాగుచేయాలి. తత్ఫలితంగా రోగి తను చేసిన చెడుకార్యములను గురించి మరింత బాధపడకుండా ఉండేందుకు కావలసిన సంకల్పబలం ఉత్పన్నమై ఆరోగ్యమనే లాభం కలుగుతుంది.** తన ప్రయోగాలు, పరీక్షల వలన ఆయన చెప్పింది ఏమంటే సమ్మోహనం ద్వారా దీర్ఘకాలంగా వస్తున్న మానసిక ఆవేదనలయందు ఇరవైశాతం సంపూర్ణమైన తగ్గుదల, అరవైశాతం పాక్షికమైన తగ్గుదల కనిపించింది. ఈ విద్యను శారీరికమైన, మానసికమైన రోగాలలో విజయవంతంగా ప్రయోగించవచ్చు. ఉబ్బసపు

**సత్కార్య నిర్వహణకై బాగా ప్రయత్నించాలి**

వ్యాధి, ప్రేగువాపు, బలహీనత, నపుంసకత్వం, అధికరక్తపోటు వంటి రోగాలకు కొంత ఉపశమనం కలిగించవచ్చు. ఇంతేకాదు మానసిక అలసట నుండి విముక్తిని పొందేందుకు ఈ విధానాలు చాలా తోడ్పడతాయి. హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లోని సమ్మోహన విద్యా విశేషజ్ఞుడు, మానసిక చికిత్సకుడు డా॥ ఫ్రెడ్ ఫ్రాంకల్ సమ్మోహనచికిత్సలో ధ్యానముద్రను అత్యధిక ప్రభావశాలిగా చెప్పారు. దీనివల్ల కండరాలలో ఉండే అలసటను కొంతవరకు తగ్గించవచ్చు. ఆ తరువాత రోగి తనయొక్క కూడని ఆలోచనా సరళిని మార్చుకొని ఆ స్థానంలో మంచి ఆలోచనలను నింపుకుంటాడు. రోగ ఉపశమనమునకు సంబంధించిన ఈ విధానములో ఆయన 'సెల్ఫ్ సజెషన్' అనగా 'ఆత్మ-నిర్దేశన' అనే పేరు పెట్టారు. ఈ పద్ధతిలో నాలుగు విధానాలుంటాయి. 1. ఇండక్షన్, 2. డీప్‌నింగ్, 3. సజెషన్, 4. కమింగ్ అవుట్ మొదలైనవి. ఇండక్షన్ అనగా రోగి ముందుగా శిథిలీకరణ ముద్రను వేయాలి. దానివల్ల శారీరిక, మానసిక అలసట తగ్గిపోతుంది. సమ్మోహనమునందు 'డీప్‌నింగ్' అనే పద్ధతిలో మనస్సు లోతులలోకి వెళ్ళడం జరుగుతుంది. దాని ఫలితంగా వ్యక్తి తన మూలరూపాన్ని అర్థం చేసుకుంటాడు. **భారతీయ యోగవిద్యలో మనస్సును సంస్కరించేందుకు జపం చేయడమనే విధానము ఉన్నది.** పాశ్చాత్యదేశాల్లో ఈ ప్రయోజనాన్ని నెరవేర్చేందుకే 'డీప్‌నింగ్' అనే విధానాన్ని నిర్ధారించారు. 'సజెషన్' ఇచ్చుకోవడమనే విధానాన్ని క్రియాన్వితం చేయాలంటే వ్యక్తి తన అచేతన మనస్సుకు అవసరమైన పోషణను ఇస్తాడు. ఈ నియమిత పోషణతో మనస్సు నెమ్మదినెమ్మదిగా దానిని స్వీకరించి తాను స్వయంగా ఆ రూపమే అనే అనుభవాన్ని పొందుతుంది. 'కమింగ్అవుట్' అనేది సంపూర్ణప్రక్రియ యొక్క చివరి మరియు నాలుగవ చరణము. దీనితో ఈ ప్రక్రియ సమాప్తమైపోతుంది.

సుప్రసిద్ధ సమ్మోహన చికిత్సకుడు మరియు 'సెల్ఫ్‌హిప్నోసిస్' అనే పుస్తక రచయిత జె. ఓస్కి భారతీయ యోగశాస్త్రమును చాలా లోతుగా అధ్యయనం చేశాడు. అందులో వర్ణించబడిన ధ్యానబిందుయోగమును గురించి చెప్తూ 'ఇది కూడా హిప్నోసిస్ వంటిదేనని, సమ్మోహనము వల్ల ఏ లాభాలనైతే పొందగలమో దీని ద్వారా కూడా అవి పొందవచ్చును' అని తీర్మానించారు. ఈ కారణం చేతనే ఆయన దానికి 'సెల్ఫ్ హిప్నోసిస్' అని పేరు పెట్టారు.

భారతదేశానికి చెందిన ఈ ప్రాచీనవిద్యను ప్రశంసిస్తూ 'నార్త్ వెస్ట్ మెడిసిన్' అనే ప్రముఖ అమెరికన్ పత్రికలో శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డా॥డేవిడ్ చీక్ ఇలా చెప్పారు-'ఇది చాలా సంతోషించవలసిన విషయం. ఈనాడు ఈ ప్రాచీన విద్య యొక్క లాభమును ప్రపంచమంతా పొందుతున్నది'. కాలిఫోర్నియాలోనే ఈ విద్యకు సంబంధించిన 930 మంది డాక్టర్లున్నారు. వీరంతా విభిన్నరకాల శారీరిక, మానసిక రోగాలను నయం చేయడంలో మంచి సఫలతను పొంది ఉన్నారు. చీక్ ఇంకా ఇలా అంటారు- ఈ విద్యను సరిగ్గా ఉపయోగించుకోగలిగితే దీర్ఘకాలిక వ్యాధులు, నయంకానివిగా చెప్పబడే మానసిక వ్యాధులన్నింటి నుండి, మనోవికారాల నుండి విముక్తిని పొందవచ్చు. ఇదే ఈ రోజు ప్రజలందరి మనస్సులలో గూడు కట్టుకొని ఉన్నది. ఈ చికిత్సను వ్యావహారికస్థాయిలో ఉపయోగించి ప్రజలందరికీ సులభంగా అందుబాటులోకి తేగలిగితే మానవజాతికి మంచి సేవ చేయగలిగినవారమౌతాము.

*- అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## అంతః సౌందర్యంలోనే నిజమైన అందం

*అందవిహీనుడైన సుఖ్‌రాత్ ఎల్లవేళలా అద్దంలో ముఖం చూసుకొంటూ ఉండటం చూసి ఆశ్చర్యచకితుడైన ఒక మిత్రుడు ఇది ఏమి విడ్డూరమని ప్రశ్నిస్తాడు. సుఖ్‌రాత్ చిరునవ్వుతో, "మిత్రమా! ఈ కురూపితనానికి ప్రతిరూపంగా నేను మీ అందరికంటే ఎక్కువ మంచి పనులను చేయవలసి ఉన్నది. దానికి కావలసిన ప్రేరణ లభించాలంటే పదే పదే నన్ను నేను అద్దంలో చూసుకోవాలి. కురూపితనం నా బాధ్యతను గుర్తు చేస్తుందని పదే పదే ముఖాన్ని నేను అద్దంలో చూసుకొంటూ ఉంటాను. ఇదే విధంగా నీ వంటి సౌందర్యవంతుడు కూడా నాలాగే పదే పదే అద్దంలో ముఖాన్ని చూసుకొంటూ ఈశ్వరుడు ప్రసాదించిన ఈ నా సౌందర్యంలో చిన్నమచ్చ కూడా పడకుండా ఉండాలని కోరుతూ ఆ ప్రయత్నంలో నిమగ్నుడై ఉండాలి" అని తెలియజేస్తాడు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**పనులను వాయిదా వేసే పద్ధతిని వదలివేయాలి**

వామన జయంతి ప్రత్యేకం

# భగవంతుడే యాచకుడిగా మారిన వేళ

వామనుడు అంటే మరుగుజ్జు లేదా పొట్టి అని అర్థం. శరీరం ఎత్తు తక్కువున్నవారిని, పరిణామంలో చిన్నగా కనిపించే వారినే కాదు, వ్యక్తిత్వపు ఔన్నత్యం తక్కువ ఉన్నా, మనసు అంతఃకరణాల్లో కుట్ర, మోసం, కపటం నిండి ఉన్నా కూడా వారిని వామనులనే అంటారు. ఎంతటి బుద్ధిమంతులైనా, తెలివైనవారైనా, సంపన్నులైనా; ఎన్ని అలౌకిక శక్తులు, సిద్ధులు, బుద్ధులు, నిధులు ఉన్నప్పటికీ తమ మోసాల వల్ల, అశుద్ధ భావాల వల్ల ఎప్పటికీ వామనులనే పిలవబడతారు, భావింప బడతారు.

విరాట్ స్వరూపుడైనా కూడా తన మోసం వల్ల స్వయంగా భగవంతుడు కూడా వామనుడు అని పిలిపించుకున్నాడు. విష్ణుమూర్తి స్వయంగా పరమ ధర్మాత్మ బలిచక్రవర్తి దగ్గరకు యాచకుడై, వామనుడి రూపంలో వెళ్ళవలసి వచ్చింది. భోగ విలాసాలలో మునిగిపోయిన స్వర్గాధిపతి ఇంద్రుడిని ధర్మ పరాయణుడైన బలి చక్రవర్తి ఓడించి, దేవ వ్యవస్థను చక్కబరిచి నిర్వహించాడు. స్వర్గాధిపతిగా ఎదిగినా కూడా బలి నిరంతరం తపస్సు, యజ్ఞాలలో నిమగ్నమై ఉండేవాడు. భోగాల మీద కాకుండా, చక్కటి శాసనం, విష్ణుభక్తి, తపోయజ్ఞాలపైనే అభిరుచి కలిగి ఉండేవాడు. బలి మహాభక్తుడు ప్రహ్లాదుని పౌత్రుడు, దానశ్రేష్ఠుడైన విరోచనుడి కుమారుడు. దైత్యవంశంలో జన్మించి నప్పటికీ వారు అనన్య భగవంతుని భక్తులు. ఆయన నరనరాల్లో తండ్రి, తాతల శ్రేష్ఠ గుణాలు ప్రవహించాయి. అపారమైన గురుభక్తి వారిలో నిండి ఉన్నది. శుక్రాచార్యునికి ఎనలేని సేవ చేసేవారు.

బలి గురుభక్తికి, నిష్కామ సేవకి ప్రసన్నుడైన శుక్రాచార్యుడు అతనిని ఒక యజ్ఞం చేయమని ప్రేరేపించాడు. దాని పేరు అభిజిత్ యజ్ఞం. ఆ ప్రత్యేక యజ్ఞాన్ని చేయడం అందరి తరం కాదు. శుక్రాచార్యునికి ఈ యజ్ఞం తెలుసు, వారి మార్గదర్శనంలో ఈ విశిష్ట యజ్ఞం సుసంపన్నమైంది. యజ్ఞం జరిగేడప్పుడు యజ్ఞకుండం నుండి ఎన్నో విలువైన వస్తువులు బైటికొచ్చాయి. ఒక కవచం, రథం, ధనస్సు, ఎప్పటికీ ఖాళీ కాని పాత్ర వాటిలో ముఖ్యమైనవి. బలి చక్రవర్తి పితామహుడు స్వయంగా వచ్చి ఒక పూలమాలను బహుకరించాడు. ఆ మాలకున్న పూలు ఎప్పటికీ వాడిపోవు. బలి శ్రద్ధగా, వినమ్రంగా ఆ మాలని, కవచాన్ని ధరించాడు. రథాన్ని అధిరోహించి, ధనుర్బాణాలను చేతపట్టి పృథ్వి, పాతాళ లోకాలపై తన ఆధిపత్యాన్ని స్థాపించుకున్నాడు. అతని సైన్యం నిరంతరం పెరుగుతు, బలపడసాగింది.

బలి న్యాయప్రియుడు, నీతిపరాయణుడు. పృథ్వి మీద, పాతాళంలోనూ మంచి రాజ్యాన్ని స్థాపించాడు. వారి ఆధీనంలో ప్రజలు సుఖంగా, సంతృప్తితో ఉండేవారు. ఏ రాజ్యంలో ప్రజలు సుఖశాంతులతో ఉంటారో, ఆ రాజ్యాన్ని పాలించే రాజుకు అపారపుణ్యం లభిస్తుందని అంటారు. ఇందుకు విరుద్ధంగా దుఃఖాలు, కష్టాలు అనుభవించే ప్రజలున్న రాజ్యాన్ని పాలించే రాజు ఘోరనరకాల పాలవుతాడు. బలి పుణ్యాత్ముడు. సరళత్వం, నిష్కపట భావన అతని గొప్ప ప్రత్యేకతలు. మోసం, కుట్ర వంటి వాటికన్నా ముఖాముఖీగా యుద్ధం చేయడాన్ని నమ్మేవాడు. తన గురువు శుక్రాచార్యుని మోసపూరిత యుద్ధాన్ని ఎప్పుడూ సమ్మతించలేదు. ధర్మయుద్ధాన్నే విశ్వసించేవాడు. తన అపార బలం, శౌర్యం, పరాక్రమం, అనన్య ప్రభుభక్తి వంటి గుణాల దుర్లభ సమ్మేళనం అతన్ని ఎప్పుడూ అజేయంగా నిలబెట్టింది. ఎప్పుడూ ఓటమి ముఖం చూసి ఎరుగడు.

ఇంద్రలోకంలోని ఘోరమైన అవ్యవస్థ, దేవతల భోగవృత్తి, విచ్చలవిడితనం గురించి బలి చక్రవర్తికి బాగా తెలుసు. భోగించడం వల్ల పుణ్యం నశిస్తుంది, ఆత్మవిశ్వాసం తడబడుతుంది, ధైర్య సాహసాలు సమసిపోతాయి. భోగాలలో మునిగి తేలుతున్న దేవతల పరిస్థితి కూడా ఇప్పుడు ఇదే అయింది. సృష్టి సంచాలనకు బాధ్యులైన దేవతలు ఇప్పుడు రంభ, ఊర్వశి, మేనక మొదలైన అప్సరసల రూపలావణ్యం, నాట్యవిన్యాసాల నడుమ కాలం గడుపుతూ అన్నీ మరచిపోయారు. అందుకు పరిణామంగా భూమి మీద సకాల వర్షాలు లేకుండా క్షామం ఏర్పడి, వాతావరణ చక్రంలో

**ఎవరు ఎలాంటి ఆలోచనలు చేస్తారో అలాంటి ఫలితమే వస్తుంది**

మార్పులు రాసాగాయి. ఇంద్రలోకపు పరిపాలనను మంచిగా మార్చడానికి బలి తన విశాల సైన్యంతో దండెత్తాడు. నిస్తేజులైన దేవతలు బలి శౌర్య పరాక్రమాల ఎదుట ఎక్కువ సేపు నిలవలేక ఓటమి పాలై పారిపోయారు, కాని బలి వారిని పారిపోనివ్వలేదు.

న్యాయప్రియుడు, మంచి శాసనానికి మారుపేరైన బలి ఇంద్రలోకపు వ్యవస్థనే మార్చేసాడు. భోగ విలాసాలతో నిండిన స్వర్గంలో మొదటి సారి తపోవెలుగులు విరజిమ్మాయి. రోజంతా నాట్య ఝంకారాలు వినిపించే చోట, ఇప్పుడు వేదమంత్రాల దివ్య ఉచ్చారణ జరుగుతోంది. రకరకాల యజ్ఞాలతో వాతావరణంలోని దివ్యత్వం, సౌందర్యం అనేకరెట్లు పెరిగింది. రాజసిక వాతావరణం సాత్వికంగా మారిపోయింది. స్వర్గంలోని వనరులు, పరికరాలు అన్నీ కూడా తపోయజ్ఞాలకు ఉపయోగించబడసాగాయి. దాని వల్ల స్వర్గపు సౌందర్యం, ప్రకాశాలలో పవిత్రత, దివ్యత్వం నిండసాగాయి. బలి చక్రవర్తి స్వయంగా దేవతలను పిలిపించి వారి కర్తవ్యాలను, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఒత్తిడి చేసి, ఆదేశిస్తుండేవాడు. వాయువు, వరుణుడు, ఇంద్రాది దేవతలందరూ తమ బాధ్యతలను నెరవేర్చవలసి వచ్చింది. ఎవరూ, ఎప్పుడూ బద్ధకంగా ఉండడానికి కానీ, నిర్లక్ష్యంగా ఉండడానికి కానీ వీలుకుదరేది కాదు. అందువల్ల భూమి మీద పర్యావరణంలో సంతులన నెలకొనసాగింది. సమయానికి వర్షాలు, ఋతుపవనాల వలన, ధాన్యం, పళ్ళు, పాలు సమృద్ధిగా ఉత్పత్తి కాసాగాయి.

త్రిలోకాధిపతి బలిచక్రవర్తి పాలనలో ముల్లోకాలలో సుఖశాంతులు, సమృద్ధి నెలకొన్నాయి. ఒక్క దేవతలు తప్ప అందరూ ప్రసన్నంగా ఉన్నారు, భోగ విలాసాలకు అలవాటు పడ్డ దేవతలకు త్యాగం, తపస్సులు ఏం రుచిస్తాయి! భోగాలను త్యజించడమే తపస్సుకు ఆరంభం; కాబట్టి దేవతలంతా ఇంద్రుడితో కలిసి విష్ణుమూర్తిని దయ తలచి తమకు దేవలోకం తిరిగి ఇప్పించమంటూ ప్రార్థించారు. భగవంతుడు తీవ్ర అయోమయంలో పడ్డాడు. ధర్మపరాయణుడు, పరమభక్తుడు అయిన బలితో యుద్ధం చేయడం కుదరదని తెలుసు.

అయినప్పటికీ వామనావతారం ఎత్తవలసి వచ్చింది. కశ్యప మహర్షి యొక్క ధర్మపరాయణురాలైన భార్య అదితికి పుత్రునిగా విష్ణుమూర్తి వామన రూపంలో అవతరించారు. పెద్ద కళ్ళు, మెరిసే ముఖ వర్చస్సు, విశాల వక్షస్థలం, పెద్ద భుజాలు, ఒత్తైన జుట్టుతో బాలసూర్యుడితో సమానంగా భాసించాడు. కాని బలిని మోసం చేసే తన ఉద్దేశం ఏమాత్రం తృప్తినివ్వటంలేదు. వామనుడు తల్లికి నమస్కరించి బలి చక్రవర్తితో పాటు భక్తులందరు అశ్వమేధ యాగం చేస్తున్న నర్మద నదీ తీరానికి చేరాడు.

వామనుడు చక్కగా నడికట్టు, జంధ్యం, పాదుకలు, తల మీద అందమైన గొడుగు ధరించి ఉన్నాడు. యజ్ఞ మండపంలో అడుగుపెట్టగానే భృగువంశీయ బ్రాహ్మణు లందరూ లేచి స్వాగతం పలికి సత్కరించారు. బలి స్వయంగా నిల్చుని వామనుడికి వినమ్రంగా స్వాగతం పలికి, శ్రద్ధగా నమస్కరించి, రత్నఖచిత సింహాసనంలో కూర్చోబెట్టి, కాళ్ళు కడిగి, ఆ నీటిని స్వీకరించి, ఆయనతో "దేవా! ఇక్కడికి విచ్చేసి మమ్మల్నందరిని కృతార్థులను చేసారు. దయచేసి మీ రాకకు కారణం చెప్పగలరు." అని విన్నవించుకున్నాడు.

వామనుడు జవాబుగా – "బలి చక్రవర్తి! నీవు పరమ భక్తుడవు. మీకు కుల ప్రతిష్ఠ, పరంపరల గురించి బాగా తెలుసు, దాన్ని మీరు తగురీతిన నిర్వహిస్తున్నారు కూడా. మీ తాతగారు ప్రహ్లాదుడు పరమభక్తుడు, మహాదాని, ధర్మాత్మ. మీ తండ్రి విరోచనుడు సర్వశ్రేష్ట దానులలో ఒకరు. మీరు స్వయంగా పరమధర్మాత్ములు, శ్రేష్ఠ పుణ్యాత్ములు. నేను బ్రహ్మచారిని. ఒక బ్రహ్మచారికి డబ్బు, ఐశ్వర్యం, వైభవాలతో ఏం పని. నేను మూడడుగుల భూమిని కోరుతూ మీ దగ్గర కొచ్చాను. మీరు నన్ను నిరాశపరచరని ఆశిస్తున్నాను."

ఐదేళ్ళ మహాతేజస్సు కలిగిన ఆ బ్రహ్మచారిని యజ్ఞ మండపంలో అడుగు పెడుతూనే బలి గుర్తుపట్టాడు. ఒక్క క్షణంలో తన ఆరాధ్యుడిని, ఇష్టదైవాన్ని గుర్తుపట్టాడు. మూడు అడుగులు అడిగిన వామనుడిని తనేలా కాదంటాడు. దానానికి సిద్ధపడి దోసిట్లో నీళ్ళు తీసుకుంటుండగా దైత్య గురువు, మహాతాంత్రికుడు అయిన శుక్రాచార్యుడు అడ్డుపడుతూ, "బలి, ఆగు! వామనుడి వేషంలోని విష్ణువు ఇతను. వామన రూపానికి తగ్గట్టుగా ఈయన ఉద్దేశం కూడా మోసపూరిత మైనదే. కుటపూరిత అంతఃకరణంతో నిన్ను మోసం చేయడానికి వచ్చాడు. మూడడుగుల భూమి కాదు, నీ ముల్లోకాలు కొలుచు కుని తీసుకుపోయి నిన్ను బికారిని చేయడానికి వచ్చాడు."

**ఎక్కడ ఉదారత, ఓర్పు ఉన్నాయో అక్కడ ఎంతో కొంత మంచి జరుగుతుంది**

బలి బదులిచ్చాడు – "గురుదేవా! మీ సందేహం ఖచ్చితంగా నిజమే కాగలదు. మోసంతో ముల్లోకాలు హరించడానికి వచ్చినా, భక్తుడి కోసం సర్వస్వం అర్పించే దేవుడు ఈ రోజు యాచకుడై వచ్చాడు. యాచకుడిగా వచ్చిన భగవంతుడిని నేను ఖాళీ చేతులతో ఎలా పంపించను? ఇంటింటికీ వెళ్ళి అడుక్కోవలసిన పరిస్థితి వచ్చినా నేను నా దేవుని కోరిక తీర్చి తీరతాను." బలి నిర్ణయానికి ఖిన్నుడైన గురువు అతడిని తేజహీనుడిని కమ్మని శపించాడు. దానిని కూడా బలి ప్రసన్నంగా స్వీకరించి దానానికి సిద్ధమయ్యాడు.

బలి ఒప్పుకున్న వెంటనే వామనుడు విరాట్ స్వరూపం దాల్చి రెండు అడుగుల్లో ముల్లోకాలను కొలిచాడు. మూడో అడుగు ఎక్కడ వేయమంటావు బలి? అని అడుగుతూనే బలిని తన వరుణపాశంతో బంధించాడు వామనుడు. "ప్రభు, రెండు అడుగులలో ముల్లోకాలు కొలిచారు. ఇవ్వడానికి నా దగ్గర స్థలం లేకపోయినా నా మస్తిష్కం ఉంది. మూడో అడుగు నా తలపై వేయండి" అని బలి విన్నవించుకున్నాడు. వామనుడు బలిని కూడా కొలిచాడు.

దానమిచ్చిన బలి అన్నీ ఇచ్చేసినా ప్రసన్నంగా ఉన్నాడు. కాని భగవంతుడికి మాత్రం తాను చేసిన మోసం వల్ల క్షోభ మిగిలింది. అధర్మాన్ని నిర్మూలించడానికి పలుమార్లు అవతరించే భగవంతుడు ఈసారి తానే అధర్మాన్ని, మోసాన్ని ఆశ్రయించాడు. కృశించుకుపోతున్న అంతరంగంతో వామనుడు, **"వత్సా! ఈ సాటిలేని దానం వల్ల నీ కీర్తి అమరమవుతుంది. నా మోసం వల్ల నన్ను మాత్రం ఎప్పుడూ వామనుడు అనే అంటారు." అని బలితో అన్నారు. ఇందుకు ప్రాయశ్చిత్తంగా తాను బలి చక్రవర్తి నగరానికి కాపలాదారుడిగా ఉండవలసి వచ్చింది.**

*– అఖండజ్యోతి, ఆగస్టు 2010*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

---

## ముందు చిన్న లక్ష్యాలను సాధించు

*ఛత్రపతి శివాజీ, మొగలాయిల సామ్రాజ్యాలపై ఆకస్మికంగా దాడులు చేస్తూ, యుద్ధం చేస్తున్న కాలం నాటి మాట. ఒకరోజు శివాజీ దాడి చేసి అలసిపోయి, ఒక వనవాసి వృద్ధురాలి నివాసానికి చేరుకొని, భోజనం పెట్టమని ప్రార్థించాడు. ఆమె ప్రేమపూర్వకంగా కిచిడి తయారుచేసి వేడి వేడిగా శివాజీకి వడ్డించింది. అమిత ఆకలితోనున్న శివాజీ కిచిడీని తినాలనే తొందరలో వేడి కిచిడిలో చెయ్యి పెట్టాడు. దీనితో ఆయన చేతివ్రేళ్ళు కాలాయి. దీనినంతా చూస్తున్న ఆ వృద్ధురాలు బాధపడుతూ ఇలా అన్నది. "నీ చేష్టలు చూస్తుంటే శివాజీ మహరాజులా ఉన్నాయి. అలాగే నీ పనులు కూడా శివాజీ పనుల వలె మూర్ఖతతో కూడి ఉన్నాయి". ఈ మాటల విన్న శివాజీ స్తబ్ధుడైనాడు.*

*స్తబ్ధత నుండి తేరుకున్న శివాజీ వృద్ధురాలితో "నేను చేతివ్రేళ్ళను కాల్చుకున్నందుకు మూర్ఖుడనన్నావు. బాగుంది. కానీ శివాజీ ఎట్టి మూర్ఖపు పనులు చేశాడు?" అని ప్రశ్నించాడు. దీనికి సమాధానంగా వృద్ధురాలు ఇలా అన్నది "నీవు అంచులందు చల్లగా ఉన్న కిచిడీలో చేయిపెట్టుటకు బదులు బాగా వేడిగానున్న మధ్యభాగాన వేళ్ళు పెట్టి కాల్చుకున్నావు. ఇట్టి మూర్ఖపు పని శివాజీ కూడా చేస్తున్నాడు. ఆయన మొగల్ సామ్రాజ్య కేంద్రానికి దూరంగా ఉన్న చిన్న చిన్న కోటలను అవలీలగా జయించ వీలున్న చోట, వాటిని విడచిపెట్టి బలంగా ఉన్న పెద్ద పెద్ద కోటలపై దాడికి ఉపక్రమిస్తూ ఓటమి పాలవుతున్నాడు." దీనిని విన్న శివాజీకి జ్ఞానోదయమైంది. రణనీతిలోగల తన తప్పు తెలిసి వచ్చింది. ఆ వృద్ధురాలికి శివాజీ ధన్యవాదాలు తెలిపి ఆమె నుండి సెలవు తీసికొన్నాడు. తదుపరి తన యుద్ధ తంత్రాన్ని తగిన రీతిగా తిరిగి రూపొందించుకొని, తొలుత చిన్న చిన్న కోటలను జయిస్తూ చివరకు పెద్ద వానిని జయించుటలో సఫలత నొందుచూ సుస్థిర మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించాడు.*

*మారిన శివాజీ రణనీతి మన జీవన పోరులో కూడా ఆవశ్యం అనుసరణీయం. తొలుత మనం చిన్న లక్ష్యాల సాధిస్తూ తదుపరి ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ఆత్మవిశ్వాసంతో పెద్ద పెద్ద లక్ష్యాలను చేరుకోగలం.*

*– అఖండజ్యోతి, సెప్టెంబర్ 2013*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

---

**ఇతరులు చేసిన ఏనుగంత తప్పును ఆవగింజంత తప్పుగా చూడు**

బోధ కథ

# పాఠం నేర్వని రావణుడు

రాక్షస సామ్రాట్టు రావణుడు రుద్రాభిషేకానికి సంకల్పం తీసుకొని ముందుగా గౌరీ-గణేశ్‌లకు పంచోపచార పూజతో అభిషేకించిన తరువాత వరుణ దేవతను ఆవాహన చేసి పంచామృతంతో అభిషేకించాడు. దీని తరువాత అతడు ఈ సమస్త బ్రహ్మాండానికి నెలవైన 'శివలింగానికి' ఈ విధంగానే పంచ ద్రవ్యాలతో అభిషేకం నిర్వర్తిస్తూ ఉంటాడు. ఎప్పటిలాగానే ప్రతినిత్యం రుద్రాభిషేక పూజ నిర్విఘ్నంగా నిర్వహించే విధానంగానే, ఈరోజు కూడా పూజా-అభిషేకానికి తయారై నర్మదానదికి చేరుకున్నాడు. నర్మదానదీ జలం ప్రశాంతంగా-నిర్మలంగా ఉన్నది. నది ఒడ్డు అందంగా ప్రకృతి సౌందర్యంతో కళ-కళ లాడుతూ ఉంది. తెల్లటి పంచె ధరించి, భుజాల మీద శ్వేత ఉత్తరీయం కప్పుకొని, నుదుట భస్మధారణతో రావణుడు గొప్ప విద్వాంసుడిగా కనిపిస్తున్నాడు. శివలింగానికి అభిషేక నిమిత్తం ఒక జింక కొమ్ములో నదిలోని నీటిని నింపు సమయంలో, నదీ జలాల్లో తీవ్రమైన అలలు ఉధృతంగా లేచిన కారణంగా చేతిలోని జింక కొమ్ము నీటిలో జారిపోవటమే గాక, అభిషేకానికి అవసరమైన సమస్త పూజా సామాగ్రి నీటిలో కలిసిపోయింది.

రావణునకు విపరీతమైన కోపం వచ్చింది. నిస్సహాయంగా కోపంతో మండిపోతూ కాళ్ళతో భూమిని తన్నుకుంటూ ఒడ్డు పైకి చేరి, దీనికి కారణమేమని నాలుగు ప్రక్కల కోపపు చూపులతో పరికించసాగాడు. కనుబొమలు చిట్లించి, అభిషేక మంత్రాల స్థానంలో భీషణ శబ్దాల అరుపులనే బాణాలు వదల సాగాడు. నర్మదానది ఇంత వేగంగా పొంగి, భీకరంగా మారటానికి కారణం గురించి తెలుసుకోగోరాడు. అదీగాక ఇంతకు క్రితమే అతడు బాగా విసిగిపోయి ఉన్నాడు. ఎందుచేత అనగా అగస్త్య ఋషి ఇతడిని ఇతడి మొత్తం రాక్షస జాతిని సరస్వతీ నదీ ప్రాంతం నుండి గెంటివేయటం జరిగింది. తన రాక్షససేనతో కలసి దక్షిణ దిశకు వెడలిపోవటం జరిగింది. అయితే నర్మదానది దక్షిణ భాగం మీద ఇంకా అతని అధికారం ఉన్న కారణంగా ఈశ్వరపూజ-అభిషేకాలను ఈ నది ఒడ్డునే నిర్వర్తిస్తున్నాడు.

ఇప్పుడు రావణుడు నదిలోని జలాల కల్లోలం గురించి తన దృష్టిని సారించగా, రాజా 'కృతవీర్య' పుత్రుడైన 'సహస్రార్జునుడు' తన వెయ్యి పడవలతో రాణి మృగావతితో కలసి నర్మదా నదిలో కేళీ విహారం కొరకు రావడం అతనికి కనిపించింది. ఇంత భారీ సంఖ్యలో ఒక్కసారిగా పడవలన్నీ రావటంతో, నర్మదానదీ జలం మథింపబడి ఒక్కసారిగా పొంగి పొర్లిపోయింది. ఈ కారణంగానే తాను చేయ తలపెట్టిన అభిషేక కార్యక్రమానికి విఘాతం ఏర్పడినట్లు రావణుడు గ్రహించాడు. అంతకు ముందు నుండే రావణునకు సహస్రార్జుని ప్రతిభా-ప్రతిష్ఠలను, అపార వైభవాన్ని చూసి ఘోరమైన ఈర్ష్యతో రగిలిపోతూ అతని మీద కక్ష పెంచుకున్నాడు. చాలాకాలం వెనుక నుండి అత్రి వంశం వారు హైహయ వంశం వారి మధ్య మైత్రీ బంధం పెనవేసుకొనిపోయి ఉన్న కారణంగా... హైహయ వంశపు రాజుగా ఉన్న అర్జునుని యొక్క ధనబలం జనబలంలో అపారవృద్ధి ప్రారంభమైంది. అంతేగాక అత్రేయులు వెయ్యి అందమైన నావలను అర్జునకు కానుకగా అందించారు. ఈ పడవలన్నీ అద్భుత సౌందర్యంతో తయారుచేయబడి, నీటిలో చేపలతో సమానంగా ఒయ్యారాలు ఒలకిస్తూ సాగిపోయేవి. అర్జునుడు వీటిని తన సహస్ర బాహువులుగా భావించినందున, అప్పటి నుండి ఈయన సహస్రార్జునుడనే పేరుతో పిలువబడుతున్నాడు.

సహస్రార్జునుని తండ్రి కృతవీర్య శాసనకాలంలో రాజ్యమంతా అత్యంత సమృద్ధి కలిగి సుదృఢంగా ఉండి, ఈ నర్మదానదీ ప్రాంతం కూడా అపార ధనసంపదలతో నింపే వారు. దాంతో రాజ్యంలోని ప్రజలందరు సుఖ-సంపదలతో ఆనందమయ జీవనం సాగించేవారు. ఈ వ్యాపారంలో 'భార్గవ వంశానికి' చెందినవారు భాగస్వాములుగా ఉండేవారు. 'శార్యాత వంశం' నిర్మూలమైన తరువాత భృగువంశం వారు, హైహయ వంశరాజులకు పురోహితులుగా వ్యవహరించేవారు. భృగు వంశంవారు వ్యాపారంలో ఎంతో నిష్ణాతులుగా ఉంటూ, హైహయ రాజులకు తమ సహాయ, సహకారాలను అందిస్తూ

**నువ్వు చేసిన తప్పును కొండంత తప్పుగా భావించు**

ఉండేవారు. వ్యాపారం ద్వారా పెరిగిన అంతులేని సంపదతో భృగువంశం వారు అతి విలాసవంత జీవితం గడిపేవారు. సంపద మీద వివేకం యొక్క అంకుశం తొలగిపోతే... అదే సంపద గొప్ప అనర్థాలకు కూడా కారణమవుతుంది. భృగువు, శుక్రాచార్యుడు, చ్యవన వంటి మహాఋషుల పరంపరను మరచారు. ఋషుల మార్గమైన తపస్సు, విద్య, సాధన, సంతోషం వంటి పరంపరలను వదిలిన కారణంగానే భృగువంశం వారు తరువాత కాలంలో వినాశనానికి గురయ్యారు.

ఒకసారి సరస్వతీ నదీ ప్రాంతంలో భయంకర కరువు, కాటకాలు ఏర్పడ్డాయి. కృతవీర్యుని రాజ్యం కూడా కరువుకు లోనయింది. కొన్ని సంవత్సరాలపాటు భూమి మీద ఒక్క నీటి చుక్క కూడా రాలలేదు. తెల్లటి మేఘాలు అలుముకొనటం చూసి అందరూ వర్షం కురుస్తుందని అనుకొనేవారు. కానీ అవన్నీ విసురుగాలికి ఎటో కొట్టుకుపోయేవి. దాంతో హైహయ రాజ్యంలోని సేద్యం-వ్యవసాయం నష్టమైపోయింది. పంట భూములన్నీ ఎండి బీటలు వారాయి. చెఱువులు, సరోవరాలలో బురద మాత్రమే మిగిలింది. నూతి జలాలు కొండలోయల్లోకి జారిపోయాయి. పశువులు వనాలను వదిలి ఎటో పారిపోయాయి. పక్షుల కిలకిలరావాలు ఆగిపోయాయి. ప్రజలంతా పాహి-పాహి అంటూ రోదించసాగారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితి ఎదురైనప్పటికి రాజా కృతవీర్యుడు అధైర్యపడలేదు. అన్ని విధాలా తన ప్రజలను ఆదుకొనే చర్యలను చేబట్టాడు. రాజ్యంలోని అన్ని ధాన్యాగారాల తలుపులను తెరచి, ప్రజలకు పంచటమే గాక, వ్యాపారుల నుండి ఇతర వస్తువుల స్థానంలో కేవలం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసి వితరణ చేయ సాగాడు. సంవత్సరాలు గడచిపోతున్నాయి. రాజ కోశాగారం ఖాళీ అవసాగింది. ఈ ప్రకారంగా 12 సంవత్సరాల పాటు ఈ కరాళ కాటకం కొనసాగింది. ఇటువంటి స్థితి దాపురించి నప్పటికి, భృగువులకు ప్రజల బాధలు కనిపించలేదు. తమ విలాస-భోగాలకు తాము ఆర్జించిన అపార సంపదను విచ్చలవిడిగా ఖర్చు చేయసాగారు. దుఃఖితులైన ప్రజల కడగండ్లు చూసి కూడా వారి మనసులు కరగలేదు. అయితే ఆకలి మంటలతో వేగిపోతున్న ప్రజలలో వివేకం నశించి పోసాగింది. ఆకలి మంటల వలన ఉచితానుచితాలు పోయి ప్రజలంతా ఒక్కుమ్మడిగా ఏకమై భృగువుల సంపదను లూటీ చేయసాగారు. వీరితో హైహయ సైన్యం కూడా చేరి అందినంత సంపదను దోచుకుపోసాగారు. ఎందువల్లనంటే భృగువులు చివర వరకు తమ సంపదలను పంచుటకు సిద్ధపడనందున సైనికులు, ప్రజలు కలసి వీరి సంపదను లూటీ చేశారు.

ఈవిధంగా హైహయ రాజ్యంలో సైనికుల-భృగువుల మధ్య భయంకర రక్తపాతం జరిగింది. చివరకు ఋషి 'ఆర్వ్' నేతృత్వంలో భృగువులంతా, తమ కొంపా-గోడులను, పశు సంపదలను లూటీ కొరకు వదలి, ఉత్తరం వైపునకు వెళ్ళిపోయారు. మరుసటి సంవత్సరంలో కురిసిన వర్షం కారణంగా భూమి జలధారలతో నిండిపోయి, హైహయ రాజ్యం తిరిగి ధనధాన్యాలతో నిండిపోయింది. అయితే విదేశీ వ్యాపారులకు మాత్రం భృగువులు అక్కడలేని కారణంగా, వ్యాపార పరంగా గట్టి దెబ్బ తగిలింది. ఇక్కడ సప్తఋషి మండల సదస్యులైన అత్రి-అనసూయ జ్యేష్ఠ సంతానమైన చంద్రుడు, దుర్వాసుని పెద్దన్న గారైన 'దత్తాత్రేయుల' వారి కుశల నేతృత్వంలో రాజా కృతవీర్యుని పుత్రుడైన సహస్రార్జుని దీక్షా-దక్షత-నిష్ఠా-గురుభక్తికి ప్రసన్నుడైన దత్తాత్రేయ స్వామి, సహస్రార్జుడిని ఈ సమస్త భూమండలానికి స్వామిని చేసి, సత్యపథం నుండి ఎన్నటికి తొలగని వానిగా ఆశీర్వదించి, హైహయ రాజ్యాన్ని సుభిక్షంగా పాలించమని ఆదేశమిచ్చాడు.

సహస్రార్జునుడిని తిన్నగా ఏ యుద్ధంలోను జయించుట సాధ్యము కాదని రావణునకు బాగా తెలుసు. సహస్రార్జునుడు స్వయంగా గొప్ప యోధుడు. సత్యపథం మీద దృఢంగా సాగుతున్న పథికుడు. ఆయనతో పాటు ఎన్నడూ వీడని 'సత్య' మనే బలముంది. ఇదే రావణ చింతకు కారణం... ఒకసారి సహస్రార్జునుడు తమతో జరిగే వ్యాపార మార్గానికి అడ్డు కర్కోటకులు-హైహయలు ఇరు బలగాలు గొప్ప గొప్ప యుద్ధ వీరులే. అయినప్పటికి యుద్ధనీతి విశారుదుడైన సహస్రార్జుని ఎదుట కర్కోటకులు తలదించుకోవలసి వచ్చింది. ఆయన వీరి రాజ్యాన్ని తన రాజ్యంలో కలుపుకొని కర్కోటక నాగాలనందరిని బందీలు గావించి, తన రాజధాని 'మహిష్మతీ' పురానికి తరలించాడు. వారందరిని గౌరవ-మర్యాదలతో తమ రాజ్యంలో నివసించేందుకు తగిన ఏర్పాట్లు చేసాడు. దాంతో కర్కోటకులందరు సహస్రార్జుని ఈ సహృదయతను మిక్కిలి కొనియాడి, ఆయనకు సహాయ సహకారాలను అందించుటకు సిద్ధమయ్యారు.

**మనస్సు నిండా కరుణ నింపుకోవడం అహింస యొక్క లక్షణం**

సహస్రార్జునుడు ఉత్తర-పశ్చిమ మొత్తం భూములను తన ఆధీనంలోకి తెచ్చుకొని, అన్నిచోట్ల శాంతి-సమృద్ధి వాతావరణం కల్పించేటట్లు చేసాడు. సప్తద్వీపాల మీద వరుసగా దండయాత్ర చేసి, వాటిని జయించాడు. ప్రతి ద్వీపాన్ని జయించిన తరువాత యజ్ఞం నిర్వహించాడు. ఈవిధంగా అతడు విశాలమైన సప్త యజ్ఞాలను సుసంపన్నం గావించాడు. ప్రతి యజ్ఞంలో బంగారపు యూపాన్ని, బంగారంతో తయారైన దేవతలను స్థాపన చేశాడు. వస్త్రదానం, సువర్ణదానం, అన్నదానం, గోదాన మిచ్చి సంతోషపెట్టాడు. అందుచేత ఆయనను 'సప్త దీపేశ్వర్' బిరుదుతో పిలవసాగారు. జగత్తులో ఆయనను అలలస్వామి అని కూడా పిలువసాగారు. ఆయన 'మాంధాత' కాలం నాటి స్వర్ణ యుగాన్ని తిరిగి భూమి మీదకు తెచ్చినట్లైంది.

సహస్రార్జునుడు ఈ ధరిత్రి మొత్తానికి 'స్వామి' అయ్యాడు. వారి యొక్క ఈ విశాల సామ్రాజ్యంలోని ప్రజలంతా సదాచారులుగా, న్యాయబద్ధులుగా, సంతోషపరులుగా ఆనందమయ జీవితాలను గడుపుతున్నారు. ఆయన స్వయంగా ఒక 'సంత్' వంటివారు. అందుచేత సంత్‌లను, మహాత్ములను ఎంతో గొప్పగా ఆదరించేవారు. ఆయన రాజ్యంలో అన్ని విద్యలు విస్తారంగా ప్రసారం చేయబడినందున అందరు విద్యావంతులే. ఆయన రాజ్యంలో విద్వానులకు, ప్రతిభా వంతులకు కొదవలేదు. అన్నింటికన్నా ముఖ్య విషయం ఆయనొక 'తాపసి' వంటివాడు. ఆయన చెంత అపార తపోబలం, ఆత్మబలం, సత్యబలం నిండుగా ఉన్నాయి. ఇన్ని యోగ్యతలున్న ఈయనను చూసి, రావణుని హృదయం ఈర్ష్యతో రగిలిపోసాగింది. అదను చూసుకొని, పొంచి ఉండి, ఆయన మీద ఏ విధంగానైనా ఆక్రమణ జరపాలని మనసులో గట్టిగా నిశ్చయించుకొన్నాడు.

నర్మదానదీ తీరమంతా స్వర్ణిమ సూర్యకాంతులు పరచు కొన్నాయి. సవితా దేవతకు రాగి కలశాలతో సహస్రార్జునుడు అర్ఘ్యమివ్వసాగాడు. ఇంతలో రావణుడు-తన సైన్యంతో ఈయనను నాల్గువైపుల నుండి చుట్టుముట్టి ఆక్రమణకు సిద్ధపడ్డాడు. అకస్మాత్తుగా చేయబడుతున్న ఈ ఆక్రమణను గమనించి, ఏ మాత్రం చలించకుండా ఆయన మొదటి అర్ఘ్యం సవితకు సమర్పించి, మందస్మిత వదనంతో రావణుని వంక చూడసాగాడు. ఆ చూపు ఎలా ఉందంటే ఎవరో ఒక అమాయకుని మీద దయ చూపుతున్నట్లుగా ఉన్నది. రావణుడు గర్జిస్తూ "సహస్రార్జునా! ఈ రోజు నీవు నాకు బందీవవ బోతున్నావు. నీ విశాల సామ్రాజ్యంగా నా స్వంతమవ బోతున్నది." సహస్రార్జునుడు దీనికెటువంటి జవాబివ్వలేదు. రావణుడు తిరిగి ముందు మాదిరిగానే ఉన్మాద ప్రలాపం చేయసాగాడు. అతని మాటలకు సహస్రార్జునుడు భయం చెందుటగాని, ప్రతివాదనం చేయుటగాని లేనందున, ఎందుకో తెలియని గాభరాకు లోనైపోతున్నాడు రావణుడు. రావణుని చేతిలో కరవాలం సూర్యకిరణాలలో తళ-తళా మెరవసాగింది. అతడి వేల సంఖ్యలో ఉన్న సైనికుల చేతులలో ఖడ్గాలు-బల్లాలు గాలిలో నాట్యం చేయసాగాయి. వీరందరి మధ్య ఒంటరిగా ఏ ఆయుధాలు లేని అర్జునుడు చిరునవ్వుతో నిలచి ఉన్నాడు.

ఇంతలో నర్మదానదిలో వేల సంఖ్యలో నావలు ప్రత్యక్ష మయ్యాయి. నదికి ఇరుప్రక్కల ఉన్న వనాల నుండి సహస్రాల సంఖ్యలో హైహయ సైనికులు-రావణుని సైన్యాన్ని నలుదిశల నుండి చుట్టి-ముట్టి దాడికి సిద్ధమవటంతో, రావణుని సైన్యం గాభరాపడి తమలో తామే త్రొక్కిసలాట జరిగే సమయంలో, హైహయసేన రెప్పపాటు సమయంలో రావణుని బందీగా చేసింది. అతణ్ణి బందిఖానాలో వేయటం జరిగింది. రావణుడు చాలా రోజులు బందిఖానాలో ఉండి, విడుదల కాలేక జరిగిన దానికి మండిపోతూ కాలం గడపసాగాడు. అతనిని ఎటువంటి యాతనకు గురిచేయటంగాని, లేక బాధించటంగాని చేయబడ లేదు. మీదు మిక్కిలి ఎంతో గౌరవంతోనే చూడసాగారు. ఈ గౌరవం అతని హృదయానికి గుచ్చుకొన్న ముల్లులాగా అనిపించి విలవిలాడిపోయాడు.

"మహరాజా! ఒక మహర్షి తమ దర్శనార్థం ద్వారం వద్ద వేచి ఉన్నాడు. వారు మిమ్మలను కలవాలనే కోరిక వెలిబుచ్చాడు" అని ద్వారపాలకుడు మెల్లగా విన్నవించినంతనే "వారిని సాదరంగా లోనికి తీసుకొని రా" అని అర్జునుడు ఆదేశించి నంతనే, ద్వారపాలకుడు ఆ వృద్ధ మహర్షిని రాజు చెంతకు తీసుకువచ్చాడు. రాజు తన ఆసనం నుండి లేచి వారికి స్వాగతం పలికాడు. "మహరాజా! మీతో నా ప్రార్థన ఒకటుంది" అని అనగానే రాజు ఆయన మాటకు అడ్డు వచ్చి "తమరు రావణుని విడిపించుకొని, తీసుకుపోవుటకు వచ్చారా..." మహర్షి! ఋషి అవునని అన్నంతనే "రావణుని- చెరసాల నుండి గౌరవ

**చిన్నప్రాణికి కూడా హాని కలుగకుండా జీవించాలి**

పూర్వకంగా తీసుకొని రాజదర్బారులో ప్రవేశపెట్టమని అనటంతో... ఆనతి పాలించి రావణుని ప్రవేశపెట్టారు. ఆ వచ్చిన రావణునకు పులస్త్య మహర్షితో సమానంగా స్థానమిచ్చి, ఆయన ఇలా అన్నాడు. "రావణా! బాగా గుర్తుంచుకో దురాచారి ఎంతశక్తివంతుడైనా ఏదో ఒకరోజు అతని గర్వమంతా అతడి దర్పమంతా అణగిపోగలదు. ఇది నిశ్చయం.. అతనిలో శక్తితో కూడిన దమ్ము ఎంతవరకు ఉంటుందంటే, అతని పుణ్యశేషం ముగిసేటంత వరకే... పుణ్యం సమాప్తమైన వెనుక అతని గర్వమంతా మేఘాలవలె తేలిపోగానే, ఇక మిగిలేది అతని పాపమే. నీవు నీ శక్తి మీద ఎంతో గర్వంగా ఉన్నావు. అది నీ పుణ్యం ఉండేంత వరకే. నీవు చేసే నీచకర్మల ద్వారా నీ పుణ్యాన్ని భారీగా కోల్పోతున్నావు".

చివరగా రావణునితో సహస్రార్జునుడిలా అన్నాడు. "రావణా! ఈవిధంగా నీచకర్మలకెందు కొరకు పాల్పడు తున్నావు? కాలం ఎవరిని క్షమించదు. నేను నిన్ను ఆ కాలానికే అప్పగిస్తున్నాను... నిన్ను వదులుట లేదు. నీ విద్వత్తును మాత్రం గౌరవించినప్పటికి నీవు చేస్తున్న నీచకర్మల మీద నాకు దయ కలుగుతుంది. నీ వినాశనం తొందరలో జరుగుతుందని స్పష్టంగా నాకు కనిపిస్తుంది. మర్యాదను, సత్యాన్ని పాలించే ఒక అవతార పురుషుడు నిన్ను త్వరలో శిక్షించి, నీ వినాశనానికి కారణమవగలడు... గుర్తుంచుకో... శక్తి కాదు. సత్యమే ఏనాటికైనా జయించి తీరుతుంది" అని మందలించాడు.

సహస్రార్జుని ఈ మధురవాణిని విన్న పులస్త్యుడు ఎంతో ఆనందం పొంది, మౌనం దాల్చాడు. రావణుని హృదయం మాత్రం అవమానభారంతో తుఫానుగా మారి చెలరేగి పోసాగింది. రాజు అతడిని విడుదల చేయుట జరిగింది. మహర్షి పులస్త్యునితో కలసి రావణుడు దర్బారు నుండి వెడలి పోయాడు.

దీని తరువాత అతడికి ఏమయ్యిందనేది... అందరికి తెలుసు.

*– అఖండజ్యోతి, జనవరి 2011*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

---

## అందరికీ ఆహ్వానం

*సూక్ష్మ ఉపస్థిత పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య మరియు పరమ వందనీయ మాతా భగవతీదేవిశర్మల దివ్యాశీస్సులతో, వారి దివ్య సంరక్షణలో గాయత్రీ తీర్థము, శాంతికుంజ్ హరిద్వార్ వారి సారథ్యంలో గాయత్రీ జ్ఞానమందిరం, స్వర్ణధామనగర్, పాత బోయినపల్లి, సికింద్రాబాద్ ప్రథమ వార్షికోత్సవం 21 సెప్టెంబర్ 2014న జరుగును.*

### కార్యక్రమములు

*20.09.2014* — *ఉదయం 5 గం॥ల నుండి మధ్యాహ్నం 3 గం॥ల వరకు గాయత్రీ అఖండ జపం, సాయంత్రం 4 గం॥ల నుండి కలశయాత్ర*

*21.09.2014* — *ఉదయం 9.30 గం॥ల నుండి నూతనంగా నిర్మించిన స్వర్ణధామనగర్ కాలనీ గాయత్రీ ప్రవేశ ద్వార ప్రారంభం, ఉదయం 10 గం॥లకు 24 కుండములతో గాయత్రీ మహాయజ్ఞం మరియు పూజ్యులు డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్‌జీ గారి ప్రవచనం*

*సాయంత్రం 6.30 గం॥లకు దీపయజ్ఞం*

– ఇట్లు –
**గాయత్రీ జ్ఞానమందిర్ ట్రస్ట్,** *పాతబోయినపల్లి, స్వర్ణధామనగర్,*
*మిలటరీ డైరీ ఫారమ్ ఎదురుగా, సికింద్రాబాద్ – 500 011.*
***ఫోన్: 040-40269514, 8125790778, 7207682346***

---

**చేసిన పాపాలను పశ్చాత్తాపంతో కడిగేసుకోవచ్చు**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# జ్ఞానయోగము యొక్క తత్త్వదర్శనము - 3

*గత సంచికలో పరమపూజ్య గురుదేవులు 'యోగములోని ప్రతి అంశము -జ్ఞానయోగము యొక్క తత్త్వదర్శనమే' అని తెలియజేస్తూ, 'మన ఆలోచనలను సంస్కరించుకోవాలని, దృష్టికోణములో మార్పు ద్వారా మాత్రమే ఇది సాధ్యం' అని ప్రవచించినట్లు మీరు చదివియున్నారు. అనగా 'ఆత్మబోధ, మహాజాగృతి, ఆధ్యాత్మికత'లుగా మనము తెలుసుకొనవలెను. శరీరమునకు కావలసిన సుఖములను గురించి మాత్రమే ఆలోచిస్తూ, ఆత్మానందమును ఉపేక్షించడము వల్లనే మానవుడు ఆధ్యాత్మిక మార్గములో అడుగుముందుకు వేయలేకపోతున్నాడని, ఈవిధముగా శారీరిక సుఖముల కోసం పరుగులెత్తడము అనుచితమని, ఆత్మానందమును శోధించడము శ్రేయస్కరమని పూజ్యగురుదేవులు ప్రబోధిస్తున్నారు. ఈ మౌలికమైన ఆలోచనయే 'ఆధ్యాత్మికత!' ఆధ్యాత్మికత అంటే ఏదో గారడీ కాదు. గాయత్రీమంత్రము యొక్క మూడుచరణములను, సత్-చిత్-ఆనంద అని, అవే జ్ఞానయోగము, భక్తియోగము, కర్మయోగమని చెప్తూ యుగఋషియైన గురుదేవులు ఈ మూడు చరణములే ఆధ్యాత్మికత యొక్క మూలభూత సిద్ధాంతములని బోధిస్తున్నారు. రండి! దీనిని గురించి మరింత వివరముగా తెలుసుకుందాము.*

**దాంపత్య జీవితము**



మనము జీవితములోని ప్రతి ఒక్క అవకాశమును ఉపయోగించుకొనగలిగితే ఎంతో బాగుంటుంది. భార్యాబిడ్డల పట్ల మన కర్తవ్యమును సంతృప్తికరముగా నిర్వహించవలసిన అవసరము ఎంతైనా ఉన్నది. వేరొక తల్లిదండ్రుల గారాబు తనయ, మీ చెయ్యిపట్టుకుని మీకు భార్యగా మీ ఇంట అడుగుపెట్టింది. జీవితాంతము ఆమెను సంరక్షిస్తామని మీరు ఆమె తల్లిదండ్రులకు వాగ్దానము చేశారు. పెండ్లినాటికి ఆమె 9 వ తరగతి చదువుకున్నది. మీరు ఎమ్.ఎ ఉత్తీర్ణులయ్యారు. ఆమెను 10 వ తరగతి పరీక్షకు కట్టించడము మీ బాధ్యత. ఆ తరువాత 11, 12, వీలైతే ఎం.ఎ వరకూ కూడా ఆమెను చదివించండి. అలా చెయ్యడము ద్వారా మీ ధర్మపత్ని వ్యక్తిత్వము వికసించేటందుకు మీరు దోహదము చేసినవారవుతారు. అప్పుడు దాంపత్యజీవితములో మిమ్మల్ని 'ధర్మాత్ములు'గా చెప్పగలము.

అలాగే మీ బిడ్డలను సత్కర్మలు చేసేవిధముగా, గుణకర్మ స్వభావపరముగా వారు శ్రేష్ఠులుగా అయ్యేవిధముగా శిక్షణ ఇస్తుంటే మిమ్మల్ని 'ధర్మాత్ము'లని నిస్సందేహముగా చెప్పగలం. మీరు వాళ్ళకోసము ధనమును కూడబెట్టి వారిని చెడగొట్టవద్దు. అన్యాయార్జితమును పిల్లలకు అందించి వెళ్ళే తండ్రి వారి భవిష్యత్తును జూదములో పెట్టినట్లే! మీరు పిల్లల యోగ్యతను వృద్ధి చెయ్యండి. వారిని కుంటి వారిగానో, గ్రుడ్డి వారిగానో, కుష్ఠురోగులుగానో భావించి వాళ్ళను పనిచెయ్యటానికి అనర్హులుగా మీరే నిర్ణయిస్తూ వాళ్ళు జీవితాంతమూ తృప్తిగా తినటానికి కావలసిన ధనము మీరే సంపాదించి పెట్టడము చాలా తప్పు. తల్లిదండ్రులు, అన్న చెల్లెళ్ళు మొదలైన వారి ఎడల మీకున్న బాధ్యతలను సంపూర్ణముగా నిర్వహించిన తరువాతనే మీ గురించి ఆలోచించడము మంచిది. మానవునితో సమానమైన శక్తి మరి ఎవ్వరికీ ఉండదు. బాంధ్యవ్యాలతో అతని అణువణువు కర్తవ్యభరితమై ఉంటుంది. మీరు బంధము పట్ల అనాసక్తిని కలిగి ఉన్నా, కర్తవ్యములపట్ల విరక్తి చెందవద్దు. మానవుడు కర్మచేస్తూ, కర్మఫలమును పూరిస్తూ పొందగలిగే శాంతి మరేవిధముగాను పొందలేడు. అశాంతిని తొలగించి, అకర్మణ్యత్వమును పారద్రోలుతూ, విజయ రూపములో మనకు లభించే శాంతి స్థిరమైనది. ఈవిధమైన కర్తవ్యాలు, బాధ్యతలు ఆధ్యాత్మికవాదులకే వర్తిస్తాయి. మీరు ఆధ్యాత్మిక వాదులు, గాయత్రీ ఉపాసకులు అయినట్లయితే మీరు తప్పకుండా

**అనుభవం లేని చదువుకన్నా, చదువులేని అనుభవం గొప్పది**

ధర్మాత్ములు కావాలి. 'ధర్మాత్ములు' అనగా కర్తవ్యనిష్ఠ కలిగిన వారు.

గాయత్రికి మూడు చరణములున్నాయి. వానిలో ఒకటైన త్రివేణికి మనము ధర్మాత్ములము, కర్తవ్య పరాయణులము అయివుండటమనేది చాలా ముఖ్యమైన అంశము. ఈ కర్తవ్య పథమునుండి మనలనెవ్వరు తప్పించలేరు. తన కర్తవ్యాలను సరియైన రీతిలో నిర్వహించడము, తనకున్న బాధ్యతలను చక్కగా పూర్తిచెయ్యటానికన్నా మించిన గౌరవము, కీర్తి, వర్చస్సు మానవునకు మరింకేమీ ఉండవు. కష్టాలను భరిస్తూ, బాధలకు తట్టుకుంటూ, నిందలను సహిస్తూ, ప్రత్యర్థులతో తలపడుతూ, పేదరికమును, లేమిని ఓర్చుకుంటూ కూడా తన కర్తవ్యాలను స్థిరనిశ్చయముతో నిర్వర్తించగలిగే మనిషి ధర్మాత్ముడనబడతాడు. గాయత్రిలోని 3 చరణములలో ఒక చరణమును అతడు అవగతము చేసుకున్నట్లే, అమలుపరచినట్లే! రెండవ చరణము ఆధ్యాత్మికత. త్రిపద అయిన గాయత్రీమంత్రములో 'తత్సవితుర్వరేణ్యం' మొదటి చరణము. భర్గోదేవస్యధీమహి- రెండవది. ధియోయోనః ప్రచోదయాత్-మూడవది

## గాయత్రీ మంత్రము రెండవ చరణము- ఆధ్యాత్మికత!

గాయత్రీమంత్రములోని రెండవ చరణము మనిషిని ఆస్తికుడిగా ఉండమంటుంది. **ఆధ్యాత్మికవాది అంటే తన బాధ్యతలనన్నింటినీ నిర్వహించగలిగినవాడు.** ముందుగా మీరు చేసిన తప్పులను గుర్తించండి. వాటిని నేను చక్కదిద్దుకొనగలను అని నిర్ణయించుకోండి. అజామీళుడు, వాల్మీకి, సూరదాసు, తులసీదాసు, అశోకుడు మొదలైనవారి వలె **'మనలను మనము మార్చుకొనగలము. మన భాగ్యమును నిర్మించుకోగలము'** అన్న మంత్రమును మీరు కనుక స్వీకరించగలిగితే ఆధ్యాత్మికతా వాదులు కాగలరు. ఆధ్యాత్మికవాదులు దేనికైనాసరే ఇతరుల మీద ఆరోపణలు చెయ్యరు. తమకు తామే బాధ్యత నిర్వహిస్తారు. తానే స్వయముగా బాధ్యత తీసుకున్న వ్యక్తి రోదించవలసిన అవసరము లేదు. ఆధ్యాత్మవాది అయిన వ్యక్తి తన కష్టములకు లేదా పతనమునకు తానే బాధ్యతవహిస్తూ, 'నేను ఈ తప్పు చేశాను, కాబట్టి శిక్షను అనుభవిస్తాను' అని ఆ తప్పును సరిదిద్దుకుంటూ, ధైర్యముతో ముందుకు సాగి తన భవిష్యత్తును ఉజ్జ్వలముగా తీర్చిదిద్దుకునే ప్రయత్నము చేస్తాడు. మీరు మీ తప్పును అంగీకరించకపోతే పిరికివారుగానే మిగిలిపోతారు.

## ఆధ్యాత్మికవాది అంటే స్వావలంబన, స్వాభిమానము కలిగి ఉండటము

ఆధ్యాత్మవాది అయిన వ్యక్తి తన తప్పులను సరిదిద్దుకొనటానికి, తనలోని లోపాలను చక్కబడుచుకొనటానికీ సిద్ధంగా ఉంటాడు. తనలోని అహంకారమును గాక, ఆత్మవిశ్వాసమును గుర్తిస్తాడు. పశువులు, సంపద మొదలైన భౌతిక-వస్తువులను చూసుకొని గర్వించేవాడు అహంకారి. అలాకాకుండా తన మనస్సాక్షిగా స్వావలంబనతో (తనకాళ్ళపై తాను నిలబడుట) జీవితమును గడిపేవారు, భగవంతుడు తమకు ప్రసాదించిన గౌరవమును కాపాడుకొనటానికి తమను తాము స్వావలంబులుగా, స్వాభిమానులుగా తయారుచేసుకొనగలగిన వ్యక్తులు మాకు ప్రశంసనీయులు కాగలరు. ఆధ్యాత్మికత అంటే స్వాభిమానము, స్వాలంబన! ఇవి రెండూ కనుక మీవద్ద ఉంటే, ఇక చెడుపనులు చేసి మిమ్మల్ని మీరు అగౌరవపరచుకొనవద్దు. కేవలము మీ గౌరవము పట్లనే దృష్టిసారించండి. భగవంతుని దృష్టిలో, మీ అంతరంగము ముందు, సమాజపరంగా కూడా మీరు అగౌరవమును కొనితెచ్చుకోవద్దు. కొంతమంది మిమ్మల్ని మెచ్చుకున్నా, అవి పైపై మాటలే. వాటికి మీరు పొంగిపోవద్దు. అలాగే కొంతమంది బయటకు మిమ్మల్ని హేళనచేసి అగౌరవపరచినా, లోపల వారికి మీపట్ల కొండంత గౌరవం ఉండవచ్చు. ఆ శ్రద్ధను, గౌరవమును గ్రహించండి. ఈ ప్రపంచములో పైన చెప్పిన రెండురకాల వ్యక్తులు ఉంటారు. కాబట్టి మిమ్మల్ని మీరు గౌరవించుకోండి. మీ ఆత్మ సాక్షిగా పరమాత్మసాక్షిగా జీవించండి. ఈ ఇద్దరి సాక్ష్యం చాలు మీకు! మిగిలినవారేమీ చెప్పినా వినవద్దు. ప్రపంచము అందించే సర్టిఫికెట్ కోసము తాపత్రయపడితే శ్రమతప్ప మరేమీ మిగలదు. మీ ఇంటిలోనివారు, వీధిలోనివారు ఎవరైనాసరే మిమ్మల్ని చంచలమనస్కులని అంటే, వారిని ఎదిరించండి. అప్పుడే మిమ్మల్ని 'ఆధ్యాత్మికవాదులు' అని చెప్పగలము. తులసీదాసు సలహామేరకు 'మీరాబాయి' సమస్తం త్యజించి వేసింది. ఫలితముగా సంపూర్ణముగా గిరిధారిని చేరగలిగింది. అదేవిధముగా మీరు కూడా మీ అంతరాత్మ-భగవంతుని యొక్క సలహాలను పాటించండి. ఇతరుల సలహాలను ప్రక్కన పెట్టి, తన తెలివితేటలు, నిజాయితి, భగవంతునిపై నమ్మకము మొదలైన అంశములను ఆధారముగా జీవితమును గడిపేవ్యక్తి మంచి ఆధ్యాత్మవేత్త కాగలదు. ఇతరుల సలహాలను వినవచ్చు,

**మంచి ఆలోచనలే మంచి కార్యాలకు నాంది**

కానీ ఆచరణలోపెట్టకూడదు. వినవలసినదల్లా ఒకటి 'నిన్ను నీవు', రెండవది 'భగవంతుడిని' మాత్రమే! ఈవిధముగా చెయ్యగలిగితే, మీరు జీవితములో అత్యంత శ్రేష్ఠమైన పనులను నిర్వహించగలరు. అలాకాకుండా గాలికి కదిలిపోయే ఆకు లాగా, ఎవరేది చెప్పినా వినడటము, ఆచరించడము మొదలు పెడితే సర్వనాశనము కావడమనేది తథ్యము. ఎందుకంటే పొగడ్తల పేరిట, సలహాలపేరిట వాళ్ళు మనచేత చెడుపనులు చేయిస్తారు. అంతేకాదు, తద్వారా మనము సంకల్పించుకున్న మంచిపనులకు విఘాతము ఏర్పడవచ్చు కూడా. కాబట్టి వీటన్నింటికీ దూరముగా ఉంటేనే, మీరు ఆధ్యాత్మికవాదులు కాగలరు.

## గాయత్రీమంత్రము యొక్క మూడవపాదము-ఆస్తికత

ఆస్తికత అంటే భగవంతునిపట్ల నమ్మకము. భగవంతుని పూజకూడా ఇందులో మిళితమై ఉంటుంది. కాని పూజ అనేది భగవంతునిపట్ల ప్రేమను కలిగి ఉండటము లేదా ప్రేమతో ఆరాధించడం అని చెప్పవచ్చు. ఆధ్యాత్మికత, ధార్మికత ఆరాధనను మనము పూజ అని చెప్పుకుంటున్నాము. ఇదికూడా అవసరమే. ఐతే ఇది ఆధ్యాత్మికతకు ప్రాణము కాదు, శరీరము మాత్రమే. దీనిని మీరు కొంచెము జాగ్రత్తగా అర్థము చేసుకోండి. ఆస్తికత యొక్క సారాంశమేమిటంటే భగవంతునిపట్ల నమ్మకమును కలిగి ఉండటము. భగవంతునికి పూజ, భగవంతునిపట్ల నమ్మకము ఈ రెండూ ఒకటిగానే అనిపిస్తూ ఉంటాయి, కానీ రెండింటి మధ్య భూమ్యాకాశముల మధ్య ఉన్నంత తేడా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఇవి పరస్పర విరుద్ధముగా కూడా ఉంటాయి. 'దోపిడీలో బాగా ధనము లభిస్తే, దేవికి మేకను బలి ఇస్తాను' అని చెప్పుకొని కేవలము మంచినీళ్ళుమాత్రమే త్రాగి ఉపవాసము ఉంటాడు ఒక దొంగ. వాళ్ళు నాస్తికులు. వాళ్ళకు మతముమీద, మానవత్వముమీద, సిద్ధాంతముల మీద నమ్మకము ఉండదు. వాళ్ళు దైవముతో కూడా బేరాలు సాగిస్తుంటారు.

దేవునిపేరిట, పూజల పేరిట ఎక్కడెక్కడ ఏమేమి జరగటము లేదు? జలాశయము ఒడ్డున ఒంటికాలు మీద కూర్చుని అర్ధ నిమీలిత నేత్రాలతో ధ్యానము చేస్తున్నట్లు కూర్చుని ఉంటుంది కొంగ. చేప బయటకురాగానే చటుక్కున కబళిస్తుంది. మూర్ఖులు, మోసగాండ్రు, దగాకోరులు చేసే పూజలు, ధ్యానాలు కూడా అలాంటివే. మీకు గనుక భగవంతుని మీద నమ్మకము ఉంటే, 'వెయ్యికన్నులు, వెయ్యిచేతులు, వెయ్యిభుజాలు' కలిగిన భగవంతుడు మీకు సర్వత్రా దర్శనమిస్తాడు. ఆయన న్యాయ కరవాలానికి ఎర కాకుండా ఎవ్వరూ తప్పించుకోలేరు, ఈ నమ్మకము కలిగినవాడే ఆస్తికుడు.

ఆస్తికత అంటే ఒక వ్యవస్థ, ఒక పరిపాలనావిధానము, ఒక నియంత్రణశక్తి. 'కర్మఫలమును అందించే అంకుశము లాంటి వ్యవస్థ ఒకటి ఉన్నది' అని నమ్మనివాడు నాస్తికుడు, నిష్పక్షపాతముగా ఆజ్ఞలను జారీచేసే న్యాయప్రియుడైన భగవంతుని యొక్క పాలనావ్యవస్థను నమ్మనివాడు నాస్తికుడు. భగవంతుని శాసనమును స్థిరముగా నమ్మే వ్యక్తి, చట్టముపట్ల, న్యాయముపట్ల దృఢవిశ్వాసము కలిగిన వ్యక్తి, ఈరోజుకాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి... ఏదో ఒకరోజు మానవుడికి తాను చేసిన మంచి-చెడు పనులకు ఫలితము లభించి తీరుతుంది అన్న నమ్మకము కలిగిన వ్యక్తి ఆస్తికుడు!

## కర్మఫల సిద్ధాంతము మీద నమ్మకమును కలిగి యుండటమే ఆస్తికత!

'మనలను పరిపాలించే శక్తి ఒకటి ఉన్నది. ఆ శక్తి 24 గంటలూ మనలను కాపాడుతూంటుంది. మనలను గమనిస్తూ ఉంటుంది. మనము చేసే ఏ పని అయినా ఆయన దృష్టినుండి తప్పించుకోలేదు' అన్న విషయము మీద నమ్మకము కలిగితే ఆ వ్యక్తి దుష్కర్మలు చెయ్యకపోవడమే కాదు, భగవంతుని పట్ల భయముతో ఆయనను పూజిస్తాడు. ఆయన న్యాయ స్థానమునుండి జారీచెయ్యబడ్డ ఆజ్ఞలబారినుండి ఎవ్వరూ తప్పించుకొనలేరు. ఇలాంటి దృఢవిశ్వాసమున్నవారికే మేము పూజ చెయ్యడము నేర్పించాము. ఇవన్నీ గుర్తుండటానికే మనలను రామనామమును జపించమంటారు. ఈనాడు మనము రామనామమునే కాదు, 'ఆయన మనకు ఈ మానవ జన్మనెందుకు ప్రసాదించారో' అన్న విషయము కూడా మరచి పోయాము. మానవజన్మ యొక్క ఔన్నత్యమును అర్థము చేసుకోండి. భగవంతుడు పశుపక్ష్యాదులకు, క్రిమికీటకాలకు, ఎవ్వరికీ ఇవ్వనటువంటి అత్యంత విలువైన అవయవములను మనకు ప్రసాదించాడు.

మానవునికిమాత్రమే ప్రసాదించబడిన ఈ విశిష్టతలు, సంపదలు, గౌరవము ఇవన్నీ ఈ ప్రపంచమును మరింత సుందరముగా, సమున్నతముగా తీర్చిదిద్దటానికే అని మనము

**చిన్న చిన్న కోపతాపాలు లేకపోతే జీవితం యాంత్రికం అవుతుంది**

అర్థము చేసుకోవాలి. తదనురూపముగా మీరు దీనిని ఉపయోగించుకోవాలి కానీ మీ సుఖసంతోషములకు, విలాసాలకు వ్యర్థము చేయరాదు. మానవజీవితము ఎంతో విలువైనది, అది ఒక ధనపురాశివలె మీకు అప్పగించబడినది. ఎన్నోరకములైన ప్రతిభాపాటవాలు బ్యాంక్‌లో జమచెయ్య బడిన డిపాజిట్ల వలె మానవుడి వద్ద నిక్షేపించబడినాయి. ఇవన్నీ అతడు స్వయముగా అనుభవించటానికిగాదు. ఎవరికివారు అనుభవించడానికే అయితే, ప్రతివొక్క ప్రాణికి, జీవికికూడా సమానరూపములో ఇలాంటి సంపదలు లభించాలి కదా! మరి ఒక్క మనిషికిమాత్రమే ఇంతటి అత్యధికమైన సంపద లభించింది అంటే, మానవుడు భగవంతుని యొక్క గారాబుపట్టి కావడమే అందుకు కారణము! భగవంతునికి పెద్దకొడుకు వంటి మానవుడు తనకన్నా చిన్నవారైన, అల్పులైన జీవులను చక్కగా చూడటానికీ, ఔదార్యముతో సహాయముచేసి వారికి సుఖసంతోషములను సమకూర్చటానికిమాత్రమే అతడు ఈ సంపదను సదుపయోగము పరచాలి. ఈవిధముగా జీవితము గడిపేవ్యక్తి ఆస్తికుడనబడతాడు. అలాకాక, దురాశకుపోయి ద్రోహానికి పాల్పడి, ఈ సంపదనంతా స్వంతము చేసుకొనటానికి ప్రయత్నించే వ్యక్తి నాస్తికుడని చెప్పబడతాడు. మనకన్నాపైన మనలను శాసించే ఒక పెద్ద అధికారి ఉన్నాడు. మనము ఆయన ఆజ్ఞను నిర్లక్ష్యం చెయ్యకూడదు' అన్న నమ్మకము లేకుండా, కర్మఫలముతో మనకేమి సంబంధము? మనము ఏమి చెయ్యాలనుకుంటే అది చెయ్యవచ్చు', అని కనుక మీరు భావిస్తుంటే, ఖచ్చితముగా మీరు నాస్తికులు. కాబట్టి మీరు 'నాస్తికులు'గా కాక, 'ఆస్తికులు'గా జీవించటానికి ప్రయత్నించడం ఎంతో అవసరము.

గాయత్రీ మంత్రమునకు మూడు చరణములున్నాయి. ఒకటి-ఆస్తికత, రెండు-ఆధ్యాత్మికత, మూడవది ధార్మికత. మేము ఎన్నో గ్రంథములు చదివాము, వ్రాశాము. వేద వేదాంగాలను, ఉపనిషత్తులను శోధించాము. వాటన్నింటి ద్వారా మాకు లభించిన జ్ఞానము ఒక్కటే, 'మనము ఆస్తికులము, ధార్మికులము' కావాలి. ఇప్పటివరకు మేము చేసిన సత్సంగము వలనగాని, దర్శించిన సాధుపురుషులవలనగాని, చేసిన మననము వలనగాని, పైన చెప్పిన మూడు తప్ప, నాలుగవదేదీ, మాకు ఎక్కడా దృష్టిగోచరము కాలేదు. మిఠాయిలు తయారు చేసే వ్యక్తి వద్దకు వెళ్ళితే అక్కడ మనకు మూడు పదార్థములే కనపడతాయి. అవి ఒకటి-పిండి, రెండు-పాలు, మూడు-పంచదార!

ఈ మూడింటితో మనిషి తన హస్తనైపుణ్యమును జోడించి రకరకాల మిఠాయిలను తయారుచేస్తాడు. ఒకసారి గులాబ్ జామ్ చేస్తే, మరొకసారి జిలేబీ, ఎన్నిరకాలు చేసినా వాటిలో పిండి, పాలు, పంచదార... ఈ మూడు తప్ప, నాలుగో పదార్థము ఉండదు. అలాగే వేదాలు ఎన్నో, పురాణములు ఎన్నో, సత్సంగములెన్నో. కానీ మిఠాయిల దుకాణములో వలె, మూడు అంశములే అందరిలో పనిచేస్తుంటాయి.

ధర్మము-సంస్కృతులకు మూలము గాయత్రి, అందుచేతనే గాయత్రీమంత్రమును బీజమంత్రం అన్నారు. గాయత్రీ మంత్రము 'ధర్మము-సంస్కృతి' ఈ రెండింటికి మూలమని కూడా చెప్పబడింది. మనము సత్యం-శివం-సుందరం అని చెప్పుకునే మూడు అంశములు గాయత్రీమంత్రము యొక్క మూడు చరణములలో ఇమిడి ఉండటము చేత గాయత్రిని ధర్మమునకు ప్రాణముగా చెప్పటము జరిగినది. ధార్మికత, ఆస్తికత, ఆధ్యాత్మికతలను జ్ఞానము, భక్తి, కర్మల రూపాలుగా చెప్పుకుంటున్నాము. ఇవే గాయత్రియొక్క మూడు చరణములు. వీనికి మన జీవితములో స్థానమును కల్పించి, ఆచరణములలో అవలంబించగలిగితే, మన జీవితము చరితార్థమైనట్లే! అప్పుడే మనము గాయత్రీభక్తులుగా చెప్పుకొనగలుగుతాము. అలా కానప్పుడు మనము కేవలము కర్మను చేసేవాళ్ళమే అవుతాము. మీరు 24,00,000 జపము చేసినాసరే, మీరు జీవితమంతా నియమాలు, సిద్ధాంతముల ఆధారముగా గడపనంతవరకు వాటితో జీవితము నిర్వహించగలమన్న నమ్మకము కలగనంత వరకు, అందుకు కావలసిన ధైర్యమును కూడదీసుకోనంత వరకు మేము మిమ్మల్ని గాయత్రీ ఉపాసకులని, ఆధ్యాత్మిక వాదులని చెప్పలేము. గాయత్రీమంత్రములోని జ్ఞాన-భక్తి-కర్మల రూపములోని నియమాలను, సిద్ధాంతములను ఆచరణలో పెడుతూ మీరు జీవితము గడుపగలిగితే గాయత్రి యొక్క అసలైన, నిజమైన సాధకులని అనిపించుకొనగలుగుతారు. గాయత్రి భక్తులకు లభించవలసిన సిద్ధులు, లాభములను పొందగలుగుతారు.

*- అఖండజ్యోతి, జనవరి 2014*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**బాధ్యత, ధర్మం, పరస్పర అనురాగం, అవగాహన దాంపత్యానికి మూలస్థంభాలు**

నా వారితో నా మాట

# మనలో ఎంత పరిపక్వత వచ్చింది?



### మనలో పెద్దరికపు లక్షణాలు ఉన్నాయా?

అసలు మనం పెద్దవాళ్ళమయ్యామా? ఈ ప్రశ్న మాకు, మీకు, అందరికీ. మనవాళ్ళందరు పరిశీలించుకోవాలి. కొన్ని సంవత్సరాలుగా పరమ పూజ్య గురుదేవుల ఆలోచనలలో, చైతన్యంలో తడిశాము. దానికి పరిణామంగా మనలో ప్రౌఢత్వం, పరిపక్వత ఈ పాటికే రావాలి. శారీరిక ప్రౌఢత్వం కాదు, వ్యక్తిత్వ ప్రౌఢత్వం.

వయసు పైబడ్డవారైనా, వారి దృష్టికోణం, అనుభవం, ధోరణిని బట్టి అవి పిల్లచేష్టలు అనే అంటాం. స్వామి వివేకానందుడు, ఆదిశంకరాచార్యులు, జ్ఞానేశ్వర్ వీరంతా చిన్న వయసులోనే, తల నెరవక ముందే వారి ప్రౌఢత్వాన్ని కనబరిచారు. వారి మార్గదర్శనంతో సంపూర్ణ మానవజాతి కృతార్థమైంది. వీరంతా పరిపక్వ మనఃస్థితిని సాధించారన్న దాంట్లో ఏ సందేహము లేదు.

### మానవ జీవితానికి గౌరవం - ప్రౌఢత్వం

ప్రౌఢత్వమే మానవ జీవితానికి, ఆధ్యాత్మిక వ్యక్తికి గౌరవం. ఈ ఆధారంగానే జీవితానికి విలువకట్టాలి. ఈ ఆంతరిక పరిపక్వత లేకుండా గొప్పవేవీ సాధించడానికి వీలుండదు. దీని మొదటి లక్షణం ఏమిటంటే మన భావుకతను అదుపులో ఉంచుకుని, దానిని అతిగా పోనివ్వకూడదు. వాస్తవాన్ని తెలియ చెప్పే వివేకం కూడా మటుమాయమయ్యేంతగా మెదడులో అలజడులను కమ్ముకోనివ్వకూడదు.

అందరి జీవితాలలో మంచిచెడు పరిస్థితులు ఎదురవుతుంటాయి. మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు అందరు తారసపడుతూ ఉంటారు. గెలుపుతో పాటు ఓటమిని చవిచూస్తాం. ఈ వెలుగు నీడలను ధ్యాసలో పెట్టుకోవాలి. ఇబ్బందులన్నిటికి సమాధానం వెతికి, లోటుపాట్లను పూరించడానికి పూర్తిగా ప్రయత్నించాలి. ఇబ్బందికర సందర్భాల వల్ల మానసిక సంతులనం కోల్పోరాదు.

సమస్యలన్నీ పరిష్కారాన్ని కోరుకుంటాయి. అనుమానాల అడ్డుకట్టకు ఉపాయం వెతుకుతాయి. కోల్పోయిన వాటిని పూరించుకోవటానికి ఉపాయాలు కావాలి. గడిచిపోయింది తిరిగి రాదు. కాబట్టి శోకంలో, బాధలో పడి ఉంటే లాభమేమిటి? భవిష్యత్తులో సమస్యలు స్తాయని బాధపడుతూ ఉంటే ఏమొస్తుంది? ఆక్రమణ జరుగుతుందేమో అని తీవ్రవాదానికి భయపడితే ప్రయోజనం ఏమిటి?

### మానసిక సంతులన ఉంటేనే సమాధానం దొరుకుతుంది

ఆవేశంతో, స్థిమితంగా లేని మెదడుతో పరిష్కారాలు వెతకడం అసంభవం. మానసిక స్థిరత్వం లాంటి చిన్నపని సాధించలేని వాడికి సమస్యల పరిష్కారానికి కావలసిన వనరులు ఎలా సమకూరుతాయి? ప్రగతికి ఉపాయాలు, అడ్డంకులకు సమాధానాలు వెతకగలిగే విధంగా మానసిక స్థితి ఉండి తీరాలి. ఆవేశం లేని మెదడే అందుకు ఉపయోగపడుతుంది.

నిజానికి ఆవేశమే ఒక విపత్తు, ఆవేశమే కొత్త కొత్త ఇబ్బందులను కలిగిస్తుంటుంది. ఆవేశంతో వేసే తప్పటడుగుల వల్ల మరిన్ని కొత్త విపత్తులు తలెత్తుతాయి. పరిష్కారాల బదులు అడ్డంకులను తీసుకొచ్చే ఈ ఆవేశమే అపరిపక్వతకు చిహ్నం. దీనిని నియంత్రిస్తేనే పెద్దరికంతో గౌరవింపబడతాం. ప్రేమ, ఉపకారాల సామర్థ్యాలను బట్టి ఈ పరిపక్వతను కొలవచ్చు.

ప్రేమ, సహాయం ప్రతి మనిషికి అవసరం అవుతాయి. ప్రతిఒక్కరు ఎదుటి వారి నుండి ఇవే ఆశిస్తారు. తాను స్వయంగా ఆ పని చేసినా చేయకపోయినా ఎదుటి వారి నుండి ఆశిస్తాడు. అందులో మనందరం కూడా వస్తాం. ప్రతి వస్తువుకు ఒక విలువ ఉంటుంది. ప్రేమ, ఉపకారాల మాధుర్యాన్ని పంచితే అవే మనకి తిరిగొస్తాయి.

### ఆత్మీయతను పంచండి, ఉదారులు కండి

మనలో ఉదారగుణం లేకపోతే, అవతలి వారి నుండి

ఛలోక్తులతో సంభాషణ చేయగలగాలి

ఔదార్యాన్ని ఆశించలేం. అలాంటి పరిస్థితుల్లో మనం ఎవరికి సహాయం చేయలేము. ప్రేమ పూరితమైన ఉదారత్వాన్ని పెంపొందించుకోవాలి. పిల్లలు ఔదార్యం చూపించకపోతే క్షమిస్తారేమో కాని, పెద్దలను మాత్రం ఊరుకోరు. పిల్లలు కూడా ప్రేమను ఇచ్చిపుచ్చుకుంటారు.

తన వరకు తాను చూసుకుని, మిగిలిన వారిని ఉపేక్షిస్తే మనిషి సమాజం నుండి దూరంగా ప్రయాణిస్తున్నట్టు. ఎదుటి వారి కష్టసుఖాలలో పాలుపంచుకోకపోవడం భావనాత్మక శూన్యత్వానికి లక్షణం. వీలైనంత సామాజికత ఇముడ్చు కోవడమే ప్రౌఢ లక్షణం. ఔదార్యం, మృదుత్వం, ఆత్మీయతతో నిండిన ఆచరణ ఉండాలి. అలాంటివారే ఇతరులకు సద్భావాలను పంచగలరు. అవే ఎన్నో రెట్లు పెరిగి తిరిగి మనకు అందుతాయి.

## ఆత్మసమీక్షతో పెద్దరికాన్ని స్వాగతిద్దాం

పెద్దరికం, పరిపక్వత సాధించడానికి సులువైన మార్గం ఆత్మసమీక్ష. మనం చేసే వాటిల్లో తప్పొప్పులను వెతికి సరిదిద్దుకునే పని స్నేహితుల సహాయంతో చేయవచ్చు. నిజానికి ఇది సరిపోదు. తప్పు కన్నా తప్పుడు ఉద్దేశం మరింత హానికరం. భ్రష్టుపట్టిన ఉద్దేశాలే తెలిసో తెలియకో తప్పుడు పనులు చేయిస్తాయి. వాటిని తప్పు అన్నంత మాత్రాన సరిపోదు.

మనిషిలోని ఉద్దేశ్యమే తన వ్యక్తిత్వాన్ని రూపొందిస్తుంది. వ్యక్తిత్వం ఆధారంగానే ఆలోచనలు రూపుదాలుస్తాయి, ఈ ప్రేరణతోనే పనులు జరుగుతాయి. ఈ ఉద్దేశాల సకారాత్మకతనే ఆధ్యాత్మికతలో శ్రద్ధ, విశ్వాసం అని అంటారు. మనో వైజ్ఞానికంగా దీనిని సంచిత సంస్కారాలు, దృష్టికోణం, అలవర్చుకున్న అలవాట్లు అని అంటారు. నిజాయితి అంటే కూడా ఇదే.

## ఆత్మనిరీక్షణ నిష్పాక్షికంగా చేసుకోవాలి

మనమేమి ఆలోచిస్తాం, ఏం చేస్తాం అన్నది దీని మీదే ఆధారపడుతుంది. తన ఉద్దేశాల నిజస్వరూపం తనకు మాత్రమే తెలుస్తుంది. అనైతికమైన, సమాజానికి విరుద్ధమైన వాటిని తానే స్వయంగా నిరాకరించాలి. ధైర్యంగా ఆత్మశోధన ప్రౌఢత్వం మాత్రమే చేయగలదు. ఎదుటి వారిని ఎంత నిశితంగా పరిశీలిస్తామో, మనలో సామాన్యంగా కనపడని లోపాలను కూడా అంత నిశితంగానూ పరిశీలించాలి.

ఎంతగా లోపాలకు అలవాటు పడిపోతామంటే, స్వభావంలో భాగమై పోవడం వల్ల లోటుపాట్లను కనిపెట్టడం కూడా కష్టమైపోతుంది. మన ఉద్దేశాల్లో మానవత్వానికన్నా తక్కువ స్థాయి తత్త్వాలన్నింటిని అర్థం చేసుకుని వాటిని రూపుమాపాలనే దృఢనిశ్చయం తీసుకోవాలి. ఆంతరిక ప్రౌఢత్వంలో మానవత్వం, ఉత్కృష్టత ఉండడం చాలా అవసరం. అంతఃకరణలో నికృష్టత నిండితే వ్యక్తిత్వంలో ఎప్పటికీ ప్రౌఢత్వం రాదు.

## ధైర్యంగా సవరించుకోవాలి

ఆత్మసమీక్ష తరువాత, మనిషి ప్రగతికి ఆధారమైన సద్గుణాలు మనకూ అవసరమని తెలుసుకోవాలి. అవి స్వభావంలో పూర్తిగా కలిసిపోయేంత వరకు కృషి చేస్తూ ఉండాలి. సాధారణంగా చెడ్డపని చేయాలని ఆలోచించాలన్నా భయం వేస్తుంది. అదే విధంగా మంచి వ్యక్తిత్వం సాధించడానికి కావలసిన ధైర్యం, తీక్షణత వికసించడం కూడా కష్టమని పిస్తుంది. చిన్న చిన్న సత్సంకల్పాలు నెరవేరకపోతే పెద్దవెలా నెరవేరతాయి. ఈ విధమైన భయాలున్న మనసుతో ఏది చేసినా పూర్తి కాదు.

## దృఢసంకల్పశక్తికి మారుపేరు పరిపక్వత

దృఢనిశ్చయం, ఆత్మవిశ్వాసంతో సద్గుణాల సంపదను పెంపొందించేందుకు ముందుకు సాగితే ఎలాంటి సమస్యలు రావు. చాలా మంది ఏ యోగ్యతా లేని వాళ్ళు, దేనికీ పనికిరాని వాళ్ళు అన్నట్టుంటారు. కానీ వాళ్ళు కూడా ఏదైనా చేయాలని సంకల్పించి నడుంబిగించినప్పుడు ఎన్ని అడ్డంకులు, ఓటములు ఎదురైనా వారి మార్గాన్ని ఆపలేవు.

పడుతూ లేస్తూ, కొట్టుమిట్టాడుతూ ప్రగతి కోసం నిరంతరం ప్రయత్నం కొనసాగించిన వారు సాఫల్యపు ఉన్నత శిఖరాలను అధిరోహించారు. దీన్ని బట్టే పెద్దరికం తెలుస్తుంది. పరిపక్వత, దానితో ముడిపడ్డ సక్రియత, ఈ రెండూ మెదడులో ఊరికే కూర్చుని ఉండవు, కార్యక్షేత్రంలోకి రెండు వైపుల నుండి దూకుతాయి. ఒక వైపు మనలోని నాసిరకపు తత్త్వాలను నాశనం చేస్తూ, మరో వైపు శ్రేష్ఠ తత్త్వాలకు ఊపిరిపోస్తూ ఉంటాయి. ఆత్మోత్కర్ష సాధనలో నిరంతర ప్రయాస కొనసాగించే ప్రౌఢ వ్యక్తిత్వం కల మనిషిని మనస్వి లేదా తపస్వి అనవచ్చు.

**మిమ్మల్ని మీరు నమ్ముకోండి**

## ఆశావాదులు కావాలి, ఆత్రుత కూడదు

ప్రౌఢ వ్యక్తిత్వం కలవారు ఆశావాదులవుతారే తప్ప, ఆత్రుత ఉండదు అని పరమపూజ్య గురుదేవులు చెప్తుండేవారు. వస్తువులను విరగ్గొట్టి మళ్ళీ వాటికి వేరే రూపాలు ఇవ్వడం సులువే. కాని మనుషులను కాని, పరిస్థితులను కాని ఇష్టం వచ్చినట్టు అప్పటికప్పుడు మలచడం కుదరదు, ప్రయత్నిస్తూ ఉండాలి. సాధించిన దానితో సంతోషంగా, మరింత ఉత్సాహంతో ప్రయత్నం కొనసాగించాలి.

కాలం గడిచిపోతోందని ఆత్రుత పడకూడదు. అందరి సహకారం, సాధనలు, పరిస్థితుల మీద మార్పు ఆధారపడి ఉంటుంది. మన చేతిలో లేని వాటికి ఆత్రుతెందుకు. ధర్మం, ధైర్య సాహసాల కలయికే ప్రౌఢత్వాన్ని కనబరుస్తుంది. విత్తనాలు నాటినప్పటి నుంచి అది విశాలమైన వటవృక్షంగా మారేంత వరకు నిరంతరం కృషి చేస్తూనే ఉండాలి. దానితో పాటు అవకాశం కోసం ఓపిగ్గా వేచి ఉండాలి. అలాంటి వాళ్ళు నిరాశ అనే అంధకారంలో కూరుకుపోరు. ఆశాదీపం వెలుగుతూ ఉజ్జ్వల భవిష్యత్తుకు తగిన ప్రకాశం వెదజిమ్ముతూ ఉంటుంది.

## నిందలకు, పొగడ్తలకు విలువ ఇవ్వకూడదు

ప్రౌఢులు ఇతరుల నుండి తమ గురించి ప్రశంసలు వినాలని కోరుకోరు, అలాగే నిందిస్తే బాధపడరు. ప్రపంచంలో ఉన్నవారందరి ఆకారంతో పాటు వారి ప్రకృతి కూడా నానా రకాలుగా ఉంటుంది. పరిస్థితిని అర్థం చేసుకుని సమీక్షించే అవకాశం అందరికీ ఉండదు. అలాంటప్పుడు మనుష్యుల చెప్పుడు మాటలు, అవమానాలు, ప్రశంసలు, ఇవన్నీ కూడా ఏకపక్షంగా, అడ్డదిడ్డంగా, అవాస్తవికమైనవి అయి ఉంటాయి. అలాంటప్పుడు ఈ అమాయకపు మాటలను పట్టించుకుని పొంగిపోవడం కాని క్షోభపడడం కాని చేస్తే అది తెలివితక్కువ తనమే అవుతుంది.

చాలా మంది వారి స్వార్థం కోసం స్నేహం చేసి ములగ చెట్టెక్కిస్తుంటారు. ఇటువంటి వారు పొగడ్తల కళను ఉపయోగించి అవతలి వారి మానసిక దౌర్బల్యాన్ని లాభం చేసుకుంటారు. ఇటువంటి పొగడ్తలకి వెంపర్లాడడం, దాని ఆధారంగా లభించే పెద్దరికాన్ని చూసి గర్వపడడం ఒకరకంగా ప్రమాదకరం. చెప్పుడు మాటలు నమ్మితే శత్రుత్వానికి, ఈర్ష్య, అపోహలకు దారితీస్తాయి. నిందలను విని మనోబలాన్ని కోల్పోవడం, ఆత్మన్యూనతలో కూరుకుపోవడం ఇంకా ప్రమాదకరం.

నిందించినా, పొగిడినా ఆ మాటలన్నీ విని వాటిలో నిజం ఎంత? దాని వల్ల మనం నేర్చుకోవలసిందేమిటి? అనేది గమనించాలి. తప్పులను సవరించుకోవాలి. మంచివాటిని మరింత మెరుగుపరుచుకోవాలి అనే ప్రేరణ కలగాలి. అనే వాళ్ళు వారి మానసిక స్థితిని బట్టి అంటూనే ఉంటారు. కాబట్టి అవి పట్టించుకోకూడదు, మన పనిలో మనం ఉండాలి.

బాల్యచాపల్యం నిందలకు, పొగడ్తలకు చాలా విలువ ఇస్తుంది. స్థిరత్వం కూడా కోల్పోతుంది. వాస్తవాన్ని అర్థం చేసుకుని, బాగుపడడానికి అవసరమైన ప్రేరణను మాత్రమే గ్రహించాలి. మిగిలినదాన్ని చెత్తకుప్పలోకి విసిరేయాలి. అనవసరంగా మెదడులో ఇరికించడం వల్ల సామాన్య కార్యకలాపాలు సాగించడం కూడా కష్టమైపోతుంది.

## గురుతర బాధ్యతలను స్వీకరించడానికి మనం ప్రౌఢులం కావాలి

పరిపక్వత విషయమై పరిజనులు ఎవరికి వారు పరిశీలించుకోవాలి. ఇన్నేళ్ళనుండి మనం పరమపూజ్య గురుదేవుల ఆలోచనలు, చైతన్యపు సాన్నిధ్యంలో ఉన్నప్పటికీ, మన జీవితాల్లో ఎలాంటి మార్పు వచ్చిందో పరిశీలించుకోవడానికి ఇదే సరైన సమయం. ఇన్నేళ్ళల్లో మనం పురోగమించామా, పరిపక్వత సాధించామా లేక ఇంకా పిల్లలగానే మిగిలి పోయామా అనేది పరిశీలించుకోవాలి. పిల్లలతో ఆట పాటలు, నవ్వులు ఆనందాలు పంచుకోగలమే కానీ, పెద్ద పనులు, గంభీరమైన కార్యాలలో వారిని పాల్గొననివ్వం కదా!

ఇప్పుడు యుగాంతర చైతన్యం మనకు గురుతర బాధ్యతను అప్పగించాలనుకుంటోంది. అందుకు మనలో ప్రతి ఒక్కరు ప్రౌఢులమవ్వడం చాలా అవసరం. అప్పుడే ఆత్మసంతోషం, ఆత్మ గౌరవం, ఆత్మ కల్యాణం సంభవమవుతుంది. జీవితానికి నిజమైన సాఫల్యం, అసలైన సార్థకత వ్యక్తిత్వంలో గొప్పతనం సాధించడమే. ప్రేరణాత్మక, అనుకరణ యోగ్యమైన వ్యక్తిత్వం ఉంటేనే మనం మహాకాలుని చైతన్యానికి వాహకులంగా, పరమపూజ్య గురుదేవుల నిజమైన సహచరులముగా పిలవబడే అరుదైన గౌరవాన్ని దక్కించుకోగలం.

*– అఖండజ్యోతి, ఆగస్టు 2014*

*అనువాదం: శ్రీ ఎం.వి. ప్రసాద్*

**మిమ్మల్ని మీరు నమ్మితే మీ తలరాతను కూడా మార్చేసుకోవచ్చు**

# స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 5

## శ్రీమతి బత్తినపాటి అనసూయమ్మ



1936 సెప్టెంబరు 24న పెదరావూరు, తెనాలి దగ్గర, గుంటూరు జిల్లాలో, శ్రీ కొండూరు నాదబ్రహ్మం – పేరిందేవమ్మ గార్ల 6వ సంతానంగా జన్మించారు. తండ్రి వడ్రంగం పనిచేస్తూ, కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవారు. ఆర్థికంగా పేదవారు అయినప్పటికి భగవద్భక్తి పరంగా సంపన్నులైన తల్లిదండ్రుల పోషణలో అనసూయమ్మ గారు, చిన్ననాటనే భగవద్భక్తిని పుణికిపుచ్చుకున్నారు. చిన్ననాటి నుండి తండ్రి పాడుచున్న బ్రహ్మంగారి సంకీర్తలను ఆలకిస్తూ తనకూని రాగాలతో తండ్రిని అనుకరించి పాడుటను చూసి తల్లి ముచ్చటపడేది. దీనితో మామూలు విద్యాభ్యాసంతో పాటు, తల్లి ప్రోద్భలంతో అనసూయమ్మగారు తన తొమ్మిదవ ఏట నుండే సంగీత శిక్షణ పొంది, పరీక్షలో ఉత్తీర్ణులైనారు. తన 12 ఏటనే శ్రీ బత్తినపాటి బ్రహ్మానందంగారితో వివాహం అయింది. భర్త బ్రహ్మానందం గారు, పేరుకు తగ్గట్టు బ్రహ్మంగారి ఆరాధకులు, వారు భక్తి గీతాలనాలపిస్తూ ఉండేవారు. దీనితో సహజంగానే భార్య అయిన అనసూయమ్మగారు భర్తతోపాటుగా తన గాన మాధుర్యాన్ని జోడించి, భర్తను అలరిస్తూ బ్రహ్మం గారిని కీర్తిస్తూ కీర్తనలు జనరంజకంగా పాడేవారు. ఈ రీతిగా వీరి దాంపత్య జీవితాన్ని, మనోరంజకంగా, సరస్వతీ సంపన్నంగా గడుపుతూ, ఆరుగురు సంతానానికి జన్మనిచ్చారు.

ఒకనాడు అనసూయమ్మగారు తన మహిళా సమాజ సభ్యులతో అమరావతి గ్రామంలో సామూహిక సత్యన్నారాయణ స్వామి వ్రతాన్ని చేయుటకు వెళ్ళారు. ఆ కార్యక్రమానికి గాయత్రీ పరివార్ ప్రముఖులైన శ్రీ తుమ్మూరి శివరామకృష్ణారెడ్డిగారు దీపయజ్ఞం చేయుటకై వచ్చారు. పూజ్యగురుదేవులు, వందనీయ మాతాజీల పరిచయం విన్న శ్రీమతి అనసూయమ్మ గారు గాయత్రీ ఉపాసన పట్ల ఆకర్షితులైనారు. తదుపరి పూజ్య గురుదేవుల ఆత్మకథ చదివి మరింతగా గాయత్రి పట్ల ఆకర్షితులైనారు. భర్త ప్రోత్సాహంతో తన గాన మాధుర్యాన్ని జోడించి, శ్రీ తుమ్మూరిగారి వెంట అనేక గాయత్రీ యజ్ఞాలలో, దీపయజ్ఞాలలో గురుదేవుల యుగ సంగీత పాటలను వినిపిస్తూ పరివార్ మనస్సులలో చెరగని తన ముద్రను వేసికొన్న గానకోకిల మన అనసూయమ్మ. అటు పిమ్మట గాయత్రీ చాలీసా పాటలను, యజ్ఞం కేసెట్‌ను తెప్పించుకొని వాని ద్వారా తన వాణికి పదునుపెట్టి, సరస్వతీ మాత అందించిన స్వర మాధుర్యానికి వన్నెలద్దారు, సభికులపై ఆనందపు జల్లుల వర్షింపజేసి వారి డెందముల పులకింపజేసిన విదుషీమణి అనసూయమ్మగారు.

పై రీతిగా పూజ్యగురుదేవుల కార్యక్రమాలను వాడవాడలా వ్యాప్తిగావిస్తూ సమర్పణతో చేయుచున్న అనసూయమ్మగారి పనిని సూక్ష్మశరీర ధారియై వీక్షించుచున్న పూజ్య గురుదేవులు తన కర్తవ్యాన్ని పూర్తిచేసే దిశలో ఆమె నలుగురి కుమార్తెల వివాహాన్ని అతి స్వల్ప వ్యవధిలో, ఆ దంపతుల మాధ్యమంగా చేసికొని, వీరికి ఆశ్చర్యంగొల్పే రీతిలో పూర్తి చేయించుట జరిగింది. "తన పనిని చేసే వారి బరువు బాధ్యతల తానే మోస్తాను" అనే పూజ్య గురుదేవుల భరోసా అక్షర సత్యంగా వీరిపట్ల రుజువైంది. 1970వ దశకంలో సంగీతం ఉపాధ్యాయురాలిగా బాలానంద కేంద్రంలోను, తదితర ప్రైవేటు స్కూళ్ళలో గుంటూరులో పని చేశారు.

మొదటి నుండి అనసూయమ్మగారి ఆరోగ్యం కొంచెం ఆమెను ఇబ్బంది పెడుతూ ఉండేది. దీన్నికై ఆమె నిత్యం ఇంజక్షన్లు తీసికొనుట ఆమె నిత్య జీవితంలో ఓ భాగంగా నిలచి పోయింది. ఈ ఇబ్బందితో తరచు ఆమె బాధ పడుతూ ఉండేది. పూజ్యగురుదేవుల పనిని సంపూర్ణ సమర్పణతో పనిచేయుట ప్రారంభించగనే క్రమక్రమంగా ఆమె ఆరోగ్యం కుదుటపడ సాగింది. చిట్టచివరకు ఇంజక్షన్లు తీసికొనే అవసరం లేకుండా పోయింది. అదేవిధంగా వందనీయ మాతాజీకి లేఖ వ్రాయగా భర్త మధుమేహవ్యాధి ఉపశమించింది. ఈ రీతిగా గురుయుగ్మం యొక్క కృపతో, అన్ని కుటుంబ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు తీరిపోగా 1992లో శాంతికుంజ్ వెళ్ళి వందనీయ మాతాజీని సందర్శించుకొని, ఆమె వద్దనే దంపతులిరువురూ గాయత్రీ

**ప్రణాళికతో జీవితాన్ని గడుపుకుంటే విజయాలు సాధ్యమవుతాయి**

మంత్రదీక్షను పొందుట జరిగింది. కాఫీ-టీ సేవనములను పూర్తిగా మానివేశారు. 1993 జనవరిలో భర్త స్వర్గస్థులయ్యారు.

ఈ విధంగా ఒంటరియైన అనసూయమ్మగారు గుంటూరు లోని గాయత్రీ ప్రజ్ఞాపీఠానికి తన సేవలనందిస్తూ కుమారునితో గడిపారు కొన్నాళ్ళు. 1994లో నారాకోడూరులో గాయత్రీ శక్తిపీఠ నిర్మాణం ప్రారంభం కాగానే తన నివాసాన్ని నారా కోడూరుకు మార్చి అచ్చటనే తన పూర్తి సమయాన్ని వెచ్చిస్తూ వచ్చారు. అటుపిమ్మట శ్రీ అశ్విని సుబ్బారావుగారి ప్రోత్సాహ ప్రోద్బలాలతో తన సేవలను గాయత్రీ చేతనా కేంద్రం, హైద్రాబాద్‌కు ఇవ్వ ప్రారంభించారు. ఆనాటి నుండి నేటి వరకు, 78 ఏళ్ళ వయస్సులో కూడా, మనోల్లాసాన్ని చేదోడుగా గొని గాయత్రీ చేతనా కేంద్రంలో తమ సేవలనందించుట మనందరికి ఆదర్శము మరియు స్ఫూర్తిదాయకం. వీరికి చక్కని ఆయురారోగ్యాల ప్రసాదించాలని యుగశక్తి గాయత్రి, పూజ్య గురుదేవులను, మాతాజీలను ప్రార్థించుచున్నది.

## శ్రీమతి కొండూరి కనక సుశీల



1939 జనవరిలో పేరుకలపూడి గ్రామంలో మాతామహుల ఇంట జననం. తండ్రి సూర్యారావు సిద్ధాన్తి తల్లి పార్వతమ్మగార్ల ద్వితీయ పుత్రికగా తల్లిదండ్రుల చెంత, తెనాలి పట్టణ సమీపంలోనున్న పెదరావూరు గ్రామంలో పెరిగి, అచ్చటనే ప్రాథమిక విద్యను 7వ తరగతి వరకు అభ్యసించారు. సంగీతంలో నామమాత్రపు ప్రవేశం, కూని రాగాలతో సరిపుచ్చుకున్నారు. తదుపరి కుటుంబ వ్యాపకమైన చరఖా వడకుట, ప్రత్తి దారము తీయుట, లడ్డీలు తయారు చేయుట మున్నగు పనులలో తల్లిదండ్రులకు చేదోడుగా నిలచి, వారికి సాయమందిస్తూ ఉండేవారు. ఈ దారాన్ని పెదరావూరులోనున్న చరఖా సంఘం వారికి చేర్చి, వీని కిమ్మత్తుకు సరిపడా కుటుంబ సభ్యులకు కావలసిన నూలు వస్త్రాలను తెచ్చుకుంటూ ఉండేవారు. అట్లే పాడిగేదెల పోషణలో తన వంతు సేవలనందిస్తూ, పశువుల పేడతో పిడకల తయారు చేసి వంట చెరకుగా వినియోగించే వారు. ఈ రీతిగా తనకు తెలియకుండానే ముమ్ముందు పూజ్య గురుదేవుల సంస్థలో తన సేవలనందించుటకై తనను తాను సిద్ధం చేసికొన్న ధన్యజీవి.

1957లో శ్రీ సత్తెనపల్లి శేషారావుగారితో వివాహం కాగా, సుశీలమ్మ అత్తవారింటికి వెళ్ళారు. దురదృష్టవశాత్తు వివాహ బంధం అతిస్వల్ప కాలములోనే (1959 నాటికి) బీటలు వారగా పుట్టింటికి చేరుకున్నారు సుశీలమ్మ. తదుపరి ఏలూరు సమీపంలోని కన్నాపురం వద్దనున్న కానుమల్లి వెంకట నర్సమ్మగారి సర్వీసు హోమ్‌లో చేరారు. అచ్చట పూలమొక్కల పెంపకం, కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ మున్నగు వృత్తులలో శిక్షణ పొంది అచ్చటనే 5 సం॥లు గడిపారు. తదుపరి జబ్బు పడగా పెదరావూరు చేరుకున్నారు. ఈ రీతిగా జీవితంలో తగిలిన ఎదురుదెబ్బలకు కృంగిపోక, కంటినీరు నింపుకొనక, "అగాధమౌ జలనిధిలో ఆణిముత్యమున్నట్లే శోకాల మరుగున దాగి సుఖమున్నది" అనే సత్యాన్ని దృఢంగా నమ్మిన ధీరగుణ సంపన్నురాలు. ఆ సమయంలో నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠము నుండి శ్రీ తుమ్మూరి శివరామకృష్ణారెడ్డిగారు, సుశీలమ్మ మేనత్తగారైన అనసూయమ్మగారు, పెదరావూరులో గాయత్రీ ప్రచారంలో భాగంగా దీపయజ్ఞాన్ని నిర్వహించారు. దీనిని చూచిన సుశీలమ్మగారు ప్రభావితులై, నెమ్మదిగా గాయత్రీ మంత్రాన్ని పఠిస్తూ, చాలీసా చదువుతూ, జపం చేయనారంభించారు. 2005లో తండ్రి కాలం చేయగా (1993లో తల్లిని కోల్పోయారు.) హైదరాబాదులోని సహోదరి ఇంటికి చేరారు. మేనత్తగారైన అనసూయమ్మగారి ప్రోద్బలంతో గాయత్రీ చేతనా కేంద్రములో ప్రవేశించి సేవ చేయుట ప్రారంభించారు.

తొలి నుండి సేవలనందిస్తూ, కష్టపడుటకు అలవాటు పడిన సుశీలమ్మగారు అతి సులువుగా చేతనా కేంద్రములో సేవలనందించసాగారు. వీరు గత దశాబ్ది నుండి అన్నపూర్ణాల యాన్ని నిర్వహిస్తూ పరివారానికి మాతృప్రేమనందిస్తూ, వేళకు అన్నీ సిద్ధం చేసి వండి వార్చి వడ్డిస్తూ ఉంటారు. అతిథులు, అభ్యాగతులు ఏ సమయంలో వచ్చినా, విసుగుచెందక, విరామం కోరకుండా వారికి సత్వరం భోజన ఏర్పాట్లు చేసి, వారి మోములోని సంతృప్తిని చూసి, తాను సంతృప్తి జెందుతూ, తన అలసటను మరచిపోతూ ఉంటారు. అటుపిమ్మట సమీపం లోని సోఫానే హంసతూలికా తల్పంగా భావించి, సేద తీరుతారు. పరివారమంతా భోజనం చేసిన పిదప మాత్రమే తాను భోజనం చేయుట పరిపాటి, ఆమె నియమం - భోజన

**చేద్దాంలే అని వాయిదా వేస్తే ఎప్పటికీ చేయలేకపోవచ్చు**

పదార్థాలను వృథా కానియ్యకుండా అత్యంత శ్రద్ధా నిష్ఠలతో వండి వడ్డించుట ఆమె స్వంతం. చలికాలంలో ఆయాసంతో కొంచెం బాధపడుతూ ఉంటారు. అయినప్పటికి పూజ్య గురుదేవుల పట్ల ఆమె విశ్వాసం వారిపట్ల ఆమె సమర్పణ ఆమెను ముందుకు నడిపిస్తూ ఉన్నాయి. "ప్రేమను పంచు-ప్రేమను పొందు" "శ్రమించి సేవలనందించు-మరు జన్మకు నాటుకో" అనెడి పూజ్యగురుదేవుల సిద్ధాంతాలను పరిపూర్ణంగా నమ్మి త్రికరణ శుద్ధిగా పనిచేస్తున్న ప్రేరణామూర్తి.

ఆమెకు దీర్ఘాయుస్సును ప్రసాదించవలసిందిగా పూజ్య గురుదేవులను, వందనీయ మాతాజీల ప్రార్థిస్తున్నది యుగశక్తి గాయత్రి.

## నిశ్శంకర వెంకట శివాజిరావు



నిశ్శంకర వెంకట శివాజిరావు గారు సంక్రాంతి పండుగ భోగి నాడు శ్రీ సుబ్బారావు-వెంకటరత్నమ్మ దంపతులకు విజయవాడలో 1956 సం॥లో జన్మించారు. వీరి తండ్రి అయిన సుబ్బారావుగారు భారతదేశ సైన్యంలో భారీ రవాణా వాహనాలపై పనిచేసి పదవీ విరమణ తరువాత విజయవాడ పట్టణంలో స్థిరపడ్డారు. శ్రీ శివాజిరావుగారు 10వ తరగతి వరకు చదివి ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ విజయవాడలో మెకానికల్ విభాగంలో మెషినిస్ట్‌గా శిక్షణను 1975లో పూర్తి చేశారు. తండ్రిగారి నుండి అబ్బిన ఆటోమొబైల్ రంగంలోని భారీ వాహనాల మరమ్మత్తుల అనుభవాన్ని పురస్కరించుకొని టాటా వాహనాల మరమ్మత్తులు, విడి భాగాల అమ్మకం విభాగాలలో దాదాపు రెండు దశాబ్దాల పాటు పనిచేశారు. 1986లో వీరి వివాహం జరిగింది. వీరికి ఇరువురు సంతానం. ఈ విధంగా యాంత్రికంగా సాగిపోవుచున్న శివాజిగారి భౌతిక జీవితం అనుకోని రీతిలో ఆధ్యాత్మిక దిశగా అడుగులు వేయుటకు ఒక వార్తా పత్రికలోని గాయత్రీ దీపయజ్ఞం అనే చిన్న ప్రకటన బీజాలను నాటింది. ఆ ప్రకటనలో గాయత్రీ దీపయజ్ఞము ఒకటవ టౌను విజయవాడలో శ్రీ విశ్వేశ్వరరావుగారి ఇంటిలో జరుగునని ఉన్నది. ఈ వార్తాపత్రికలోని ప్రకటన శివాజిగారి మదిలో ఉత్సుకతను రేకెత్తించగా ఎవ్వరితో పరిచయం లేకున్నను ధైర్యం చేసి ఆ దీపయజ్ఞంలో పాలుపంచుకున్నారు. అచ్చటి యజ్ఞాన్ని డా॥ తుమ్మూరి శివరామకృష్ణారెడ్డి గారు (నారాకోడూరు, గాయత్రీ శక్తిపీఠం) నిర్వహించారు. అచ్చట ప్రదర్శనలో పెట్టిన పుస్తకాలను కొనుగోలు చేసి గాయత్రీ పరివార్ మాసపత్రికకు చందాదారునిగా చేరారు. కొంత అశాంతికిలోనైన శ్రీ శివాజిరావుగారి మదిలో పరమపూజ్య గురుదేవుల సాహిత్య పఠనం శాంతిని నెలకొల్పసాగింది. దీనితో ఉత్తేజితులైన శివాజిగారు గాయత్రి పట్ల మరింత ఆకర్షితులు కాసాగారు. డా॥ తుమ్మూరిగారితో కలసి పనిచేయాలనే కాంక్ష వీరిలో రోజురోజుకు తీవ్రం కాగా తుమ్మూరిగారి అనుమతితో నారాకోడూరులో సమయదానం ఇచ్చుటకు తన కోర్కెను వెలిబుచ్చడం జరిగింది.

శ్రీ శివాజిరావుగారు అంచెలంచెలుగా తన ఆధ్యాత్మిక జీవనంలో వెలుగులు నింపుకుంటూ తన అంతర్జ్యోతి అందించే వెలుగులో వడి వడిగా అడుగులు వేస్తూ ముందుకు సాగారు. 1999లో నారాకోడూరులో నిర్వహించిన 9 రోజుల శిబిరంలో పాల్గొన్నారు. 18 నెలల పాటు అనగా 2002 వరకు నారాకోడూరు శక్తిపీఠంలో తన సేవలను అందించారు. 2001లో తిరుపతిలో జరిగిన గాయత్రీ అశ్వమేధ యజ్ఞ ప్రచార ఏర్పాట్లలో భాగంగా శ్రీ తుమ్మూరిగారి వెంట, జుజ్జూరి సాంబశివరావుగారితో కలసి ఇచ్ఛాపురం మొదలుకొని అప్పటి ఆంధ్రప్రదేశ్‌ను అంతా చుట్టివచ్చారు. సాహిత్య ప్రచారాన్ని అత్యంత సమర్థవంతంగా చేసి పూజ్య గురుదేవుల సందేశాన్ని సామాన్యుల వద్దకు చేర్చుటలో సఫలీకృతులై గురుదేవుల కృపకు పాత్రులైనారు.

తదుపరి 2003లో శాంతికుంజ్‌ను ప్రప్రథమంగా దర్శించారు. అప్పుడు 9 రోజుల శిబిరంలో పాల్గొని వెంట వెంటనే యుగశిల్పి మరియు పరివ్రాజక శిక్షణలను పూర్తి గావించారు. శాంతికుంజ్ దక్షిణ భారత విభాగంలో తెలుగు భాష మాట్లాడేవారి లోటును తీర్చుతూ అచ్చటివారి కోరికపై ఒక సంవత్సరం పాటు సమయదానాన్ని అందించారు. హిందీ భాషలో ధారాళంగా మాట్లాడజాలక కుటుంబంపై బెంగతో మనస్సులో దిగులు ఆవరించగా పూజ్యురాలైన శైలాదీదీగారి వద్ద తన గోడును వెల్లబుచ్చగా ఆమె చేరదీసి ధైర్యం చెప్పి సోదరి ప్రేమను పంచి ఇచ్చారు. దీనితో ధైర్యాన్ని చిక్కపట్టుకొని పూజ్యగురుదేవుల ఏకాంత సహచరుల గ్రంథంలోని

**చేపట్టిన పనులను సత్వరంగా చేయాలి, అభివృద్ధి పథంలో పయనించాలి**

విషయాలను మననం చేసుకుంటూ తనలో సాగే మనస్సు మల్లయుద్ధానికి స్వస్తి చెప్పి దిశానిర్దేశాన్ని పొంది గుండె దిటవు చేసుకొని క్రమక్రమంగా హరిద్వార్ శాంతికుంజ్ జీవన విధానానికి అలవాటు పడ్డారు. ఆనాటితో తన శేష జీవితానికి మార్గనిర్దేశనం లభించగా తన జీవన లక్ష్యమేమిటో ఆయనకు బోధపడింది. ఈ రీతిగా తన మనస్సును జయించి ఆత్మ నిర్దేశానుసారం నడక ప్రారంభించారు.

అటు పిమ్మట 2004, 2005 సంవత్సరాల మధ్య కాలంలో తిరిగి తెలుగు గడ్డపై హైదరాబాదులోని చేతనాకేంద్రానికి తొలి దినాలలో తన సేవలనందించారు. తన "తన్-మన్-ధన్" లను పూజ్యగురుదేవుల యుగనిర్మాణ కార్యక్రమానికై వెచ్చిస్తూ తనను తాను సంపూర్ణ సమర్పణ చేసుకొన్నారు. సూక్ష్మశరీర ధారియై వీక్షించుచున్న గురుదేవులు పరివారానికిచ్చిన తన వాగ్దానాన్ని నెరవేర్చే దిశగా శివాజిగారి కుటుంబాన్ని శివాజి ఇద్దరి బిడ్డలను విద్యాపరంగా ఉన్నత స్థితిలో నిలిపి కుమార్తె ఆస్ట్రేలియాలోను, కుమారుని జర్మనీలో స్థిరపడేలా చేసి తన వాగ్దానాన్ని అక్షరసత్యం గావించారు. శివాజిగారి జీవితం మనకందించుచున్న ప్రేరణ మరియు పరమపూజ్యగురుదేవులు తన వారిపై కురిపించే కరుణామృతానికి నిలువెత్తు ఉదాహరణ. శివాజిగారిని యుగశక్తిగాయత్రి మనసారా అభినందించుచున్నది.

## కనువిప్పు

*ఒక తల్లి తన కుమారునికి రెండు ముక్కల మిఠాయి ఇస్తూ పెద్ద ముక్కను తనను తినమని, చిన్న దానిని స్నేహితునికిమ్మని స్పష్టంగా చెప్పి పంపింది. కుమారుడు అలాగే "అమ్మా" అని తలూపి వెళ్ళి సమీపంలోనున్న స్నేహితునికి పెద్ద ముక్కనిచ్చి, చిన్న దానిని తాను తినసాగాడు. దీనినంతా దూరంగా ఉన్న అతని తల్లి గమనిస్తూ ఉంది. కొంతసేపటి తర్వాత, కుమారుడు తిరిగిరాగానే, "కుమారా! పెద్ద ముక్కను స్నేహితునికిచ్చి, చిన్న దానిని నీవు ఎందుకు తీసికొన్నావు? నేను చెప్పిన దానికి పూర్తి విరుద్ధంగా ఎందుకు చేశావు?" అని ప్రశ్నించింది.*

*జవాబుగా కుమారుడు ఇట్లు చెప్పాడు "ఇతరులకు ఎక్కువ పెట్టి, నేను తక్కువ తినుట ద్వారా నాకు ఎక్కువ ఆనందం కలుగుతుంది అమ్మా!" అన్నాడు. కుమారుని సమాధానాన్ని విన్న తల్లి ఆశ్చర్యంలో మునిగి ఇదే అసలైన మానవీయతకు, తార్కాణం" అన్న ఆలోచనలో పడి కుమారుని వంక తృప్తిగా ఒకింత గర్వంగా చూస్తూ అక్కున చేర్చుకుంది" ఇదే విశ్వశాంతికి తొలిమెట్టు. మనిషి తనకై అతి తక్కువ ఉంచుకొని, ఇతరులకు అధికంగా ఇస్తే ప్రపంచంలోని అన్ని వివాదాలు, సంఘర్షణలు, సమస్యలు తొలగిపోతాయి కదా" అని అనుకున్నది.*

*- అఖండజ్యోతి, మార్చి 2014*

*- అనువాదం: ఎ. శారద*

## శాంతికుంజ్‌లో కార్యకర్తలకు శిక్షణా శిబిరం

*2014 అక్టోబర్ 11 నుండి 19 వరకు గాయత్రీతీర్థ్, శాంతికుంజ్ హరిద్వార్‌లో జరుగనున్న కార్యకర్తల ప్రశిక్షణ శిబిరంలో యజ్ఞం, దీపయజ్ఞం, సంస్కారములు నిర్వహించే సోదర సోదరీమణులకు ఆహ్వానము. వచ్చేటప్పుడు తమతో తెలుగులో ప్రచురింపబడిన* ***కర్మకాండ భాస్కర్, యుగయజ్ఞ పద్ధతి, యుగ సంస్కార పద్ధతి, యుగ సంగీతం*** *పుస్తకములు తప్పక తెచ్చుకోవలెను. మీ రాకను ఈ క్రింది చిరునామాకు తప్పనిసరిగా లేఖ ద్వారా గాని, ఫోన్ ద్వారా గాని, ఫ్యాక్స్ ద్వారా గాని ఈ-మెయిల్ ద్వారా గాని (సెల్ నెంబర్‌తో సహా) తెలుప ప్రార్థన.*

*ప్రశిక్షణా శిబిరంలో హిందీ నుండి తెలుగులోనికి అనువాదం చేయగలిగే సోదర, సోదరీమణులకు కూడా సాదర పూర్వక స్వాగతం. మీ రాకను ఈ క్రింది చిరునామాకు తప్పనిసరిగా లేఖ ద్వారా గాని, ఫోన్ ద్వారా గాని, ఫ్యాక్స్ ద్వారా గాని ఈ-మెయిల్ ద్వారా గాని (సెల్ నెంబర్‌తో సహా) తెలుప ప్రార్థన.*

***చిరునామా:*** *సౌత్ ఇండియా జోన్, గాయత్రీ తీర్థ్,*
*శాంతికుంజ్, హరిద్వార్-249411*
*ఫోన్: 09258369479, 01334-260602*
*Ext. No. 180, Fax: 260865*
*E-mail: south@awgp.org*

**బద్ధకాన్ని వదలుకుంటేనే శ్రేయస్సు సాధ్యమవుతుంది**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## నారాకోడూరులో

2014, జులై 12 శనివారమునాడు గురుపౌర్ణమి సందర్భంగా నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠంలో నవకుండీ గాయత్రీ యజ్ఞము నిర్వహించబడింది. శ్రీ గద్దె శ్రీనివాసరావు, దంపతులు ప్రధాన యజ్ఞకర్తలుగా హాజరైనారు. దాదాపు 250 మంది యజ్ఞంలో పాల్గొని కర్మకాండను చక్కగా నిర్వర్తించారు. తదుపరి భోజన ప్రసాద వితరణ జరిగింది.

## నెల్లూరులో

గాయత్రీ పరివార్ నెల్లూరు జిల్లా శాఖ ద్వారా జూన్ 2014 మాసంలో గాయత్రీ జయంతితోపాటుగా వారాంతంలో యధావిధిగా యజ్ఞము నిర్వహించారు.

## గుంటూరు జిల్లాలో

గుంటూరు జిల్లా, కారుమంచి గ్రామవాస్తవ్యులు శ్రీ పి.వి.ఏ. కోటేశ్వరరావు-శ్రీమతి సుశీల దంపతుల కుమారుడైన చి॥ వెంకట సుధాకరరావు వివాహ సందర్భముగా రూ.12,050 విలువగల గురుదేవుల సాహిత్యాన్ని బంధుమిత్రులకు వివాహ ప్రాంగణములో జ్ఞాపికగా పంచి, జ్ఞానయజ్ఞానికి చక్కని మార్గం చూపించారు. వీరి కుమారుని వివాహము 13 ఆగస్టు 2014 బుధవారం, సింగరాయకొండ గ్రామం, ప్రకాశం జిల్లాలో వధువు ఇంట (శ్రీ బండారు రాంబాబు- శ్రీమతి లావణ్య దంపతుల కుమార్తె చి॥ల॥సౌ॥ రాగకీర్తి) జరిగింది. వీరిద్దరికి పూజ్యగురుదేవులు మరియు వందనీయ మాతాజీల దివ్యాశీస్సులు లభించుగాక.

## హైదరాబాదులో

సక్రియ గాయత్రీ పరివార్ కార్యకర్తయైన శ్రీమతి విమలమ్మగారి ప్రేరణతో, మరో కార్యకర్తయైన శ్రీమతి సుబ్బరావమ్మగారు వారి కుమార్తె గృహప్రవేశం (నిజాంపేట) సందర్భంగా రూ.4000/-ల విలువగల పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని బంధుమిత్రులకు బహూకరించి, జ్ఞానదానానికి చేయూతనిచ్చి, యుగపరివర్తనలో తమ వంతు సహకారాన్ని అందించిన, వీరికి ఆ గురుయుగ్మం యొక్క ఆశీస్సులు సర్వదా లభించుగాక

## ఖమ్మం జిల్లాలో

2014, ఆగస్టు 15వ తేది శుక్రవారం కుసుమంచి గ్రామంలో శ్రీ సాయి అగ్రి ఇండస్ట్రీస్ ఆవరణలో నూతనంగా నిర్మించిన వర్కుషాపు ప్రాంగణంలో 24 కుండముల గాయత్రీ యజ్ఞం కన్నుల పండువగా నిర్వహించారు. ఖమ్మం గాయత్రీ పరివార్, గాయత్రీ ప్రజ్ఞాపీఠమువారి సారథ్యంలో శ్రీ ఎన్.బి.కె. చౌదరి దంపతులు, శ్రీ వెంకయ్యగారు, శ్రీ సాయికృష్ణ గారు, శ్రీ వెంకటనారాయణగార్ల నేతృత్వంలో యజ్ఞం నిర్వహించ బడింది. శ్రీ చౌదరిగారు పరమ పూజ్య గురుదేవులు, గాయత్రీ మాతల విశిష్టతను వివరించి చెప్పారు. రూ.5116/- అంశ దానం మరియు సాహిత్య వితరణ జరిగింది. శ్రీసాయి అగ్రి ఇండస్ట్రీస్ అధినేత అయిన శ్రీ లక్షణరావుగారు మరియు అనేక మంది గ్రామస్థులు ఈ యజ్ఞ సఫలతకై తమ సంపూర్ణ సహకారాలనందించుట జరిగింది.

## శాంతికుంజ్‌లో తెలుగువారికి ప్రత్యేక శిబిరము

***5 రోజుల శిబిరము (కొత్తవారికి):*** *గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లో 2014 అక్టోబరు 7 నుండి 11 వరకు 5 రోజుల వ్యక్తిత్వ పరిష్కారము (వ్యక్తి నిర్మాణం) పై శిక్షణా శిబిరము నిర్వహింపబడును. పాల్గొనదలచిన వారు 6వ తేది సాయంత్రానికి సౌత్ సెల్, శాంతికుంజ్, హరిద్వార్‌లో హాజరు కావాలి.* మీ రాకను ఈ క్రింది చిరునామాకు తప్పనిసరిగా లేఖ ద్వారా గాని, ఫోన్ ద్వారా గాని, ఫ్యాక్స్ ద్వారా గాని ఈ-మెయిల్ ద్వారా గాని (సెల్ నెంబర్‌తో సహా) తెలుప ప్రార్థన.

***వివరాలు పంపవలసిన చిరునామా:***
*సౌత్ సెల్, గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్,*
*హరిద్వార్-249411, ఉత్తరాఖండ్*
*ఫోన్: (01334) 260602, 260309*
*Ext. No. 180, Fax: 260865*
*E-mail: south@awgp.org*

**వస్తు వ్యామోహం తీర్చుకున్న కొద్దీ పెరుగుతుంది కానీ తగ్గదు**